ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com
WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-5-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 106 పేజీలు: 10+4 వెల: 8.00

ముసురుతున్న వాన మబ్బులు 2
ఆగస్టు 15 నుంచి ఎపిలో మహిళలకు 'ఉచితబస్సు' 7



## జై జై.. సైనికా!

### మిలటరీ బలగాలకు మద్దతుగా హైదరాబాద్‌లో భారీ తిరంగా ర్యాలీ

### పాల్గొన్న కిషన్‌రెడ్డి, వెంకయ్య నాయుడు, విద్యాసాగర్ రావు, డికె అరుణ ప్రభృతులు

శనివారం ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా ర్యాలీ దృశ్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే17:** భారత మిలటరీ బలగాలకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై బిజెపి నేతలు, శ్రేణులు పెద్ద ఎత్తున తిరంగా యాత్ర నిర్వహించారు. శనివారం సాయంత్రం జరిగిన ట్యాంక్‌బండ్‌పై >>2



ర్యాలీలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి డికె అరుణ



శనివారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకొంటున్న ఆయా కంపెనీల ప్రతినిధులు

# కోటి మంది కోటీశ్వరులే

### మహిళలు మరింతగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యం

### భారత్ మహిళా శక్తికి ఇందిరా గాంధీయే నిదర్శనం

### సోనియా గాంధీ కాంగ్రెస్ సారథిగా సక్సెస్

### 'మహాలక్ష్మి'తో లాభాల బాటపట్టిన ఆర్టీసీ

### ఉమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే17:** దేశాన్ని గెలిపించిన శక్తి.. మహిళలదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇండియా, చైనా యుద్ధం జరిగినపుడు, 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం జరిగిన సమయంలోనూ ఇందిరమ్మ మహిళా శక్తిని ప్రపంచానికి చాటారని గుర్తుచేశారు. శనివారం జూబ్లీహిల్స్ జేఆర్‌సీ కన్వెన్షన్‌లో వి-హబ్ విమెన్ యాక్సిలరేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి హాజరయ్యారు. కార్యక్రమం ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఆయాఉత్పత్తుల గురించి విక్రయదారులను అడిగి తెలుసుకున్నారు. పలు సంస్థలతో వీహబ్ చేసుకున్న ఎంఒయూలకు సంబంధించిన పత్రాలను ఆయా కంపెనీల ప్రతినిధులకు అందించారు. అనంతరం సిఎం ప్రసంగిస్తూ మహిళా శక్తిని కాంగ్రెస్ ఎప్పుడూ తక్కువ అంచనా వేయలేదని,మహిళా శక్తి దేశానికి అండ అని నిరూపించినా ఘనత కాంగ్రెస్‌దని ఉద్ఘాటించారు. భారత మహిళా శక్తి ఏంటో ఇందిరాగాంధీ చూపించా రని, సోనియా గాంధీ సుదీర్ఘంగా పార్టీని నడిపి తన సమర్థతను నిరూపించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తికి చేయూత నిచ్చే చాలా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకోవాలంటే మహిళలు కోటీశ్వరులు కావాలని తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు కృషి చేస్తామని మాటిచ్చారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి మహిళలకు ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ నజరానా అందించారని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తోందని చెప్పారు.మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు రాష్ట్రంలో ఎక్కడి వెళ్లాలన్నా,సునాయాసంగా వెళ్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. వారివల్ల ఆర్టీసీ లాభాల్లోకి వెళ్లిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల >>2



## నేడు జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష

### 13 ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో చేరడానికి జాతీయస్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) అడ్వాన్స్‌డ్-2025 >>2



## నీట్ ఫలితాలపై మద్రాసు హైకోర్టు స్టే

**చెన్నై, మే 17:** నీట్ ఫలితాల విడుదలకు సంబంధించి మద్రాస్ హైకోర్టుకీలక నిర్ణయం తీసుకుంది. ఫలితాలను విడుదలచేయొద్దని హైకోర్టు ఆదేశాలు జారీచేస్తూ తదుపరి విచారణ జూన్ 2వ తేదీకి వాయిదా వేసింది. కాగా ఇప్పటికే నీట్ ఫలితాలపై >>2

# ఆటల్లో తేలిన వరల్డ్ 'మిస్'లు

### గచ్చిబౌలి స్టేడియంలో అందాల సందడి



శనివారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీల భామలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే17:** ప్రపంచ సుందరి పోటీల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం స్పోర్ట్స్ ఫైనల్స్ కార్యక్రమం జరిగింది. మిస్‌వరల్డ్ కంటెస్టెంట్లు పలు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 10 స్పోర్ట్స్ ఈవెంట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మిస్ వరల్డ్ ఫౌండర్ జూలియా మోర్లీ, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, ఎంపీ, బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీబాల, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ మల్లారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ టూరిజం హనుమంత్, ఇతర అధికారులు హాజరయ్యారు. క్రీడాకారులు తాంగ్ త మార్షల్ ఆర్ట్స్, రోలర్ స్కేటింగ్ ప్రదర్శన చేశారు.మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ యోగాసనాలు చేశారు అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఒకప్పుడు క్రీడల్లో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రంగానే ఉండేది కానీ ఇప్పుడు ప్రాతినిధ్యం స్థాయి నుంచి ఎదిగి పతకాలు అందించే స్థాయికి ఎదిగారని అన్నారు. పురుషులతో సమానంగా క్రీడల్లో పోటీ పడుతూ, ప్రజాదరణ పొందుతున్నారని తెలిపారు. శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడు మానసిక స్థైర్యం పెరుగుతుందని, అది మనం ఏదైనా సాధించేలా చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించి, నూతన క్రీడా విధానంపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని స్థాపిస్తున్నారని చెప్పారు. ఈ చొరవ మహిళల సాధికారతకు దారితీస్తుందని, పిల్లలు క్రీడలను వృత్తిగా ఎంచుకునేలా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.మరోవైపు తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ వేదికకు పరిచయం చేయడం, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా >>2



# దగ్గరలోనే 'విస్తరణ'!

### ఈ నెలాఖరు లేదా జూన్ తొలివారం కేబినెట్‌లో మార్పులు, చేర్పులు

### 26, 27న పిసిసి పూర్తిస్థాయి కార్యవర్గం ఖరారు

### ముఖ్యమంత్రి మార్పనేది ప్రతిపక్షాల కుట్ర

### నిజామాబాద్‌లో మీడియాతో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, మే 17,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ వీలైనంత త్వరగా చేపట్టాలని కాంగ్రెస్ హైకమాండ్, సిఎం పట్టుదలతో ఉన్నారని మే చివరివారం లేదా జూన్ మొదటి వారంలో కెబినెట్ విస్తరణ పునర్వ్యవస్థీకరణ ఉండే అవకాశం ఉందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. నిజామాబాద్‌లో విలేఖరులతో మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సామాజిక,భౌగోళిక సమీకరణాల కూర్పు సమతూకంలో చేయాలనే ఆలోచన వల్ల మంత్రి వర్గ విస్తరణ జాప్యం జరుగుతోందని వెల్లడించారు. ఆశావహులు ఎక్కువ మంది ఉన్నారని, ఖాళీలు ఏమో తక్కువ ఉండటంతో జాప్యం జరుగుతోందని అసహనం వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణ అనేది ముఖ్యమంత్రి తీసుకోవాల్సిన నిర్ణయమని తాము కేవలం సలహాలు, సూచనలు మాత్రమే ఇస్తామని అన్నారు.ఈ నెల 26, 27 తేదీల్లో టీపీసీసీ కార్యవర్గం ఖరారయ్యే ఛాన్స్ ఉందన్నారు. మహిళా కాంగ్రెస్ ఆందోళనపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ. మహిళా కాంగ్రెస్ ఆందోళన సర్వ సాధారణమన్నారు. మహిళలకు కాంగ్రెస్‌లో ఉన్న ప్రాధాన్యం మరే పార్టీలో లేదని అన్నారు. మంత్రి కొండ సురేఖ వ్యాఖ్యలను కావాలనే వక్రీకరించారని మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు.మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారు అసత్య ప్రచారం పై మంత్రి కొండా సురేఖ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయబోతున్నారు.బిజెపి, బిఆర్ఎస్ నేతలు దిగజారి కాంగ్రెస్‌పై సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారు మధ్యప్రదేశ్ తరహాలో సోషల్ మిడియలో విష ప్రచారాన్ని అడ్డుకునేందుకు క్షుణ్ణంగా అధ్యయనం చేసి చట్టం తెచ్చే యోచన చేస్తున్నాం.సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసు పెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలపై మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విధానాన్ని తెలంగాణలో అమలు చేస్తామన్నారు. తెలంగాణలో సిఎం మార్పు అనేది ప్రతిపక్షాల కల్పిత కుట్ర అని కొట్టిపడేశారు.కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమం కోసం మహిళలకు ఉచిత బస్సు మొదలు సన్న బియ్యం పంపిణీ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం బృహత్తర కార్యకమాలను చేపట్టింది. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కుంటుపడిన విద్య, వైద్య రంగాలను మెరుగు పరుస్తున్నామని తెలిపారు విద్య పరంగా రూ. 200 కోట్లతో అధునాతన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. వైద్యం పరంగా ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి నిమ్స్ వరకు ప్రక్షాళన చేసి బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 65 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని అన్నారు. దేశానికి తెలంగాణ పరిపాలన ఒక రోల్ మోడల్‌గా మారిందని ఆయన చెప్పుకున్నారు ఉనికి కోసమే >>2

## జూన్ 6 నుండి రాష్ట్రమంతా 'బడిబాట'

### డ్రాపౌట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడమే లక్ష్యం

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బడుఈడు పిల్లలను బడిలో చేర్పించడం కోసం జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్టుగా ఈ ఏడాది కూడా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట >>2



శనివారం హైదరాబాద్ నాంపల్లి కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

## కాళేశ్వరం భూసేకరణ కేసు కొట్టివేత

### నాంపల్లి కోర్టులో మంత్రి శ్రీధర్‌బాబుకు ఊరట

### మరో 12 మందికి కూడా విముక్తి

**హైదరాబాద్, మే 17,ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ అంశంలో బిఆర్ఎస్‌హయాంలో నమోదైన కేసులో మంత్రి శ్రీధర్ బాబుకు ఊరట కలిగింది.కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు,ఇళ్ళు కోల్పోయిన వారికి న్యాయమైన నష్టపరిహారం అందించాలని ప్రజల పక్షాన పోరాటం చేయడంతో పెద్దపల్లి జిల్లాబసంత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీధర్‌బాబు, హర్కర వేణుగోపాల్,అన్నయ్యగౌడ్,శశిభూషణ్ కాచేలతోపాటు మరో తొమ్మిది మందిపై నమోదైన కేసును శనివారం నాంపల్లి కోర్టు కొట్టివేసింది. 2017లో శ్రీధర్‌బాబు తోపాటు పలువురు కాంగ్రెస్ నేతలపై టిఆర్ఎస్ ప్రభుత్వం కేసు నమోదుచేసింది. కేసునుకోర్టు కొట్టివేసిన అనంతరం శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం అనే మాటే లేదు. అంతా నిరంకుశత్వం. ప్రశ్నిస్తే చాలూ అక్రమ కేసులు పెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా >>2

# పాక్‌పై ఇక 'దౌత్య యుద్ధం'!



### ఏడు అఖిలపక్ష బృందాలు మిత్రదేశాలకు..

### అంతర్జాతీయ వేదికలపై పాక్ దుశ్చర్యలను ఎండగట్టనున్న భారత్

**న్యూఢిల్లీ, మే 17:** పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై దౌత్య యుద్ధానికి భారత్ సిద్ధమైంది. ఇందుకోసం ఏడు అఖిలపక్ష బృందాలను కీలక మిత్రదేశాలు, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యదేశాలకు పంపనుంది. ఒక్కో బృందంలో ఐదుగురు సభ్యులు ఉంటారు. ఈ బృందాల విదేశీ పర్యటన మే 23 లేదా 24న ప్రారంభమయ్యే అవకాశం ఉంది. పది రోజుల పర్యటనలో భాగంగా ఒక్కో అఖిలపక్ష బృందం దాదాపు ఐదు నుంచి ఎనిమిది దేశాలకు వెళ్లనుందని సమాచారం. ఈ అంశంపై శనివారం ఉదయం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ప్రకటన విడుదల చేసింది. ఏడు అఖిలపక్ష బృందాలకు బీజేపీ ఎంపీలు రవిశంకర్ ప్రసాద్, బైజయంత్ పాండా, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, జేడీయూ ఎంపీ సంజయ్ ఝా, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎన్‌ఎస్‌పీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే, శివసేనఎంపీ శ్రీకాంత్‌షిండే సారథ్యం వహిస్తారని తెలిపింది.వీరిలో నలుగురు ఎన్‌డీఏ కూటమికి చెందిన వారు కాగా, మిగతా ముగ్గురు విపక్ష ఇండియా కూటమి నేతలు ఉన్నారు. అఖిలపక్ష బృందాల కోసం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఎంపీలను కేంద్ర ప్రభుత్వం ఆచితూచి ఎంపిక చేసింది. అన్ని పార్టీలకూ ఈ బృందాల్లో చోటు కల్పించింది. ఎంపీలను ఎంపిక చేసే క్రమంలో రాజకీయ పార్టీల సిఫారసులను కూడా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ పరిగణనలోకి తీసుకుంది. కాంగ్రెస్ ఎంపీల ఎంపికపై చర్చించేందుకు పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీలతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు మాట్లాడారని సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. కాంగ్రెస్ తరఫున మాజీ కేంద్ర మంత్రి ఆనంద్ శర్మ, కాంగ్రెస్ లోక్‌సభా పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్, రాజ్యసభ ఎంపీ సయ్యద్ నసీర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్‌లకు అఖిలపక్ష బృందాలలో చోటు దక్కిందన్నారు. అయితే శశిథరూర్ పేరును కాంగ్రెస్‌పార్టీ వర్గాలు ప్రస్తావించక >>2



## 'సీజ్‌ఫైర్' నేటితో పూర్తి!

### కొద్ది రోజుల్లో మళ్లీ చర్చలు: పాక్ డిప్యూటీ ప్రధాని

**న్యూఢిల్లీ, మే 17:** భారత్ పాకిస్తాన్‌లమధ్య కాల్పుల విరమణ ప్రతిపాదనలు ఆదివారంతో ముగుస్తున్నాయి. మరోసారి డిజిఎంలు సమావేశం అయి సరిహద్దులవెంబడి నెలకొన్న పరిస్థితులను సమీక్షిస్తారని అంచనా. వాస్తవాధీన రేఖవెంబడి ఉద్రిక్తతలు తగ్గించి, కాల్పులు నిలిపివేసి శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు భారత్ >>2



న్యూఢిల్లీలోని గురుద్వారా బంగ్లా సాహిబ్ సమీపంలో శనివారం బలమైన గాలుల కారణంగా ఆటోరిక్షామీద కూలిపోయిన చెట్టు

# దగ్గరలోనే 'విస్తరణ'!

>> బిఆర్ఎస్ నేతల ఆరాటం బిఆర్ఎస్ లో కవిత, కేటీఆర్, హరీష్ రావు పోరుతో మూడు ముక్కలాట నడుస్తోందని తెలిపారు. మూడు ముక్కలాట పోరు తాళలేక కేసిఆర్ ఫాం హౌస్ కే పరిమితమయ్యిందని అపహాస్యంచేశారు. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంలో బిఆర్ఎస్ పార్టీ కనపడదని జోస్యం చెప్పారు. మతం పేరిట రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందడం బిజెపికి పరిపాటిగా మారిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ పై ప్రధాని మోదీ వైఖరితో ఆయన సత్తా ఏంటో తేలిపోయిందని అన్నారు. భారత్ పాక్ వార్ లో అమెరికా జోక్యంపై దేశ ప్రజలు జీర్ణించుకోలేని పరిస్థితి నెలకొంది. యుద్ధంతో సాధించింది ఏమిటి? కోల్పోయింది ఏమిటి? అన్న విషయంపై కేంద్రం క్లారిటీ ఇవ్వడం లేదని అన్నారు. ఇచ్చిన హామీల అమలుకు అనుగుణంగా పాలన అందిస్తున్నామని తెలిపారు. సిఎం రేవంత్,మంత్రులు సఖ్యతతో ప్రజాభిప్రాయానికి మేరకు పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ఆలోచన మేరకు కుల సర్వే నిర్వహించి చరిత్ర సృష్టించారు . బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది కేంద్రం జనగణన తో పాటు కులగణన చేస్తామని ప్రకటించడం రాహుల్ గాంధీ,కాంగ్రెస్ పార్టీ విజయం అని వ్యాఖ్యానించారు. సిఎం రేవంత్ రెడ్డి,మంత్రుల పాలనలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారింది. పార్టీ సీనియర్లకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా సలహా మండలి కమిటీ. పార్టీకి ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేయడానికి కమిటీ దోహదపడుతుంది. రోజువారీ పొలిటికల్ యాక్టివిటీ కోసం పొలిటికల్ అఫైర్స్ కమిటీలను నియమిస్తామని ప్రకటించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం సంవిధాన్ బచావో కమిటీ ఏర్పాటు చేసి కొంత మంది సీనియర్లకు, శాసన సభ్యులకు చోటు కల్పిస్తామనితెలిపారు. 2026లో డిలిమిటేషన్ దృష్ట్యాపార్టీకి సలహాలు,సూచనలకోసం డిలిమిటేషన్ కమిటీని నియమిస్తామనివివరించారు. పార్టీలోని కొత్త, పాత నేతల మధ్యసమన్వయంపై ప్రత్యేకదృష్టి సారించామని తెలిపారు.

# ఇక 'దౌత్య యుద్ధం'!

>> పోయినా కమిటీలోకి తీసుకున్నారు. ఇదొక గొప్ప గౌరవం దేశం కోసం పిలిస్తే కాదని చెప్పలేనని శశిథరూర్ అన్నారు. భారత్ తరఫున విదేశాల్లో పర్యటించనున్న ఒక అఖిలపక్ష బృందానికి సారథ్యం వహించమని నన్ను కోరినందుకు చాలా సంతోషంగా ఉంది. దేశం కోసం ప్రాతినిధ్యం వహించడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. మా బృందం ఐదు ప్రధాన మిత్రదేశాల రాజధానుల్లో పర్యటిస్తుంది. అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొని భారత్ వాణిని వినిపిస్తుంది. ఇటీవలే జరిగిన పరిణామాలు, ఘటనల గురించి వివరిస్తుంది. దేశ ప్రయోజనాల కోసం పిలిస్తే నేను కాదని చెప్పలేను. అంటూ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఒక పోస్ట్ పెట్టారు. దేశం తరఫున విదేశీ పర్యటనకు వెళ్లబోతున్నామని సుప్రియా సూలే అన్నారు. దేశం కోసం మేమంతా ఏకమయ్యాం. దేశం తరఫున త్వరలోనే విదేశీ పర్యటనకు వెళ్లబోతున్నాం. ఒక అఖిల పక్ష బృందంలో ఉండమని నన్ను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కోరారు. అందుకు అంగీకారం తెలిపాను. ఆపరేషన్ సిందూర్ ఎందుకు చేపట్టాల్సి వచ్చింది? పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతోంది? అనే వివరాలను మేం అంతర్జాతీయ వేదికలపై చెబుతాం" అని ఒక అఖిలపక్ష బృందానికి సారథ్యం వహించనున్న ఎన్ఎస్‌పీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే తెలిపారు. ఉగ్రవాదంపై అన్ని మార్గాల్లో భారత్ రాజీలేకుండా జరుపుతున్న పోరు గురించి అఖిలపక్ష బృందాలు అంతర్జాతీయ సమాజానికి వివరిస్తాయి. ఉగ్రవాదాన్ని భారత్‌కించిత్తు కూడా సహించదనే విషయాన్ని తేల్చిచెబుతాయి. ప్రతి అఖిలపక్ష బృందంలో ప్రఖ్యాత దౌత్యవేత్తలు భాగంగా ఉంటారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సీమాంతర ఉగ్రవాదంపై భారత్ ఇకపైనా పోరును కొనసాగిస్తుందనే సందేశాన్ని ప్రపంచానికి చాటిచెబుతారు. కీలక మిత్రదేశాలతో పాటు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యదేశాలకు అఖిలపక్ష బృందాలు వెళ్తాయి" అని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ పేర్కొంది. ఈ నెలాఖరులో విదేశీ పర్యటనకు వెళ్లనున్న అఖిలపక్ష బృందాలు భారతదేశ ఐక్యతకు నిదర్శనాలు. రాజకీయాలతో సంబంధం లేకుండా భారత్‌లోని రాజకీయ పార్టీలన్నీ ఏకమయ్యాయి. దేశ ప్రయోజనాల కోసం రాజకీయ విభేదాలను పక్కన పెట్టాయి అని పేర్కొంటూ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు వ్యాఖ్యానించారు.

# రాష్ట్రమంతా 'బడిబాట'

>> కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని .. అందుకు సంబంధించి రోజువారీ నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్‌ను, మార్గదర్శకాలను పాఠశాల విద్య డైరక్టర్ ఈవి నరసింహారెడ్డి శనివారం జిల్లా విద్యాశాఖాధికారులకు జారీ చేశారు. జూన్ 6 నుంచి బడిబాటను ప్రారంభించనున్నారు. బడిబాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హెచ్‌డబ్ల్యుఓలు మరియు ఎపిసి సభ్యులు ప్రతిరోజూ ఇంటింటికి ప్రచారం నిర్వహించాలి. ర్యాలీలు, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేయడం మొదలైనవి సమాజాన్ని చేరుకోవడానికి ప్రణాళిక వేయాలి. జిల్లా/మండల/గ్రామ స్థాయిలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారుల సమన్వయంతో 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతిలో చేర్పించాలి. జూన్ 6న గ్రామసభను నిర్వహించాలి, 7న ప్రతీ ఇంటిని సందర్శించి బడిఈడు పిల్లలను గుర్తించాల న్నారు. 8నుంచి 10వ తేదీ వరకు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించి.. అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన, డ్రాపౌట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడంతోపాటు ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి వారిని అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలన్నారు. జూన్ 11న.. జూన్ 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. 12వ తేదీన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజా ప్రతినిధులతో ప్రారంభించాలని, అదే రోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలను అందించి విద్యార్థులను పాఠశాలలకు ఆహ్వానిస్తూ వెల్‌కమింగ్ డేగా నిర్వహించాలని సూచించారు. 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలలసభను నిర్వహించాలని, 16న ఎఫ్ఎల్ఎన్ దినోత్సవం నిర్వహించాలి, 17న విలీన విద్య, బాలిక విద్యా దినోత్సవం నిర్వహించాలి. 18న తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన కల్పిస్తూ.. మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలి. 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించాలని డైరక్టర్ మార్గదర్శకాలను జారీ చేశారు.

# అడ్వాన్స్‌డ్ పరీక్ష

>> పరీక్ష నేడు(ఆదివారం) జరగనుంది. ఉదయం పేపర్-1ను, మధ్యాహ్నం పేపర్-2ను నిర్వహించనున్నారు. పరీక్షను ఐఐటి కాన్పూర్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. జెఇఇ అడ్వాన్స్‌డ్-2025కి దేశ వ్యాప్తంగా జెఇఇ మెయిన్ రాసిన వారిలో 2.50 లక్షల మందికి అర్హత కల్పించారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష జరగనుండగా.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరగనుంది. జెఇఇ అడ్వాన్స్‌డ్‌కి తెలంగాణ రాష్ట్రంలోని 13 నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి సుమారు 40వేల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉంది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరు. ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటల వరకు పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారు. పరీక్షకి హాజరయ్యే విద్యార్థులు అనలాగ్ వాచీలు ధరించడం, హ్యాండ్‌బ్యాగులు, పర్సులు కేంద్రాల్లోకి తీసుకెళ్లడం నిషేధించారు. అభ్యర్థులు చెప్పులను మాత్రమే ధరించాలి. చార్మ్/టాబిజ్, ఉంగరాలు, బ్రాస్‌లెట్‌లు, చెవిపోగులు, ముక్కుపిన్, చైన్/నెక్లెస్, పెండెంట్, బ్యాడ్జ్, బ్రూచ్, హెయిర్‌పిన్, హెయిర్ బ్యాండ్, పెద్ద బటన్లు ఉన్న దుస్తులు ధరించవద్దని సూచించారు.
విద్యార్థులు అడ్మిట్ కార్డ్, ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు (ఆధార్, స్కూల్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడి, పాస్‌పోర్ట్ లేదా పాన్ కార్డ్), పెన్, పెన్సిల్, ఎరేజర్‌తోపాటు పారదర్శకవాటర్ బాటిల్‌ను తీసుకెళ్లడానికి అనుమతి ఉంది. రాష్ట్రంలోని హైదరాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, కోదాడ, వరంగల్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్ధిపేట, సూర్యాపేట నగరాల్లో పరీక్ష జరుగుతుంది.

# మద్రాసు హైకోర్టు స్టే

>> మధ్యప్రదేశ్ హైకోర్టుకూడా స్టేవిధించింది. తమ ఎగ్జామ్‌కేంద్రంలో విద్యుత్ అంతరాయం కారణంగాపరీక్ష సరిగ్గారాయలేకపోయామని కొంతమంది విద్యార్థులు పిటిషన్ దాఖలుచేసారు. పరీక్ష కేంద్రంలో విద్యుత్ అంతరాయం కలిగినపుడు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయలేదని వారన్నారు. దీనితో హైకోర్టు ఫలితాలను నిలిపివేయాలని ఆదేశించింది. ఫలితాలుప్రస్తుతానికి వాయిదా పడ్డాయి. కాగా ఫలితాల విడుదలకు సంబంధించిన తేదీపై ప్రభుత్వ అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. 2024-25 సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఉన్న వైద్యకళాశాలల్లోప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మే 4న పరీక్ష నిర్వహించింది. ఈపరీక్షకు 23లక్షలమంది దరఖాస్తుచేసుకోగా20.8 లక్షలమంది పరీక్షకు హాజరయ్యారు. ఈ ఫలితాలను వెల్లడించాల్సి ఉంది.

## వారం - వర్జ్యం

తేది : 18-05-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
పంచమి ఉ.5.57
ఉత్తరాషాఢ సా.6.49
వర్జ్యం రా.10.55-12.33
దు.సా.4.45-5.37
శుభసమయం :ఉ.7.30-8.40
రాహుకాలం - సా.4.30-6.00

## వారాఫలం

**మేషం:** వ్యాపారాలు అభివృద్ధి సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వస్తులాభం. దైవదర్శనాలు.

**వృషభం:** నూతన ఉద్యోగయోగం. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మిథునం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కొంత ఊరట చెందుతారు. బంధువులను కలుస్తారు.

**కర్కాటకం :** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఋణ బాధలు తప్పవు. వాహనసౌఖ్యం.

**సింహం:** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**కన్య :** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**తుల:** కుటుంబంలో సమస్యలు ఎదురై చికాకులు పెట్టినా అధిగమించి ముందుకు సాగుతారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. విందు, వినోదాలు.

**ధనుస్సు:** దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** పాత మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. నూతన వస్తు, వస్త్రాల లాభాలు పొందుతారు.

**కుంభం:** పెట్టుబడులలో తొందరపాటు వద్దు. ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**మీనం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కోటి మంది కోటీశ్వరులే

>> నిర్వహణను అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ఆడబిడ్డలకు అప్పగించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల యునిఫార్మ్ కుట్టుపనిని మహిళా సంఘాలకు అప్పగించి వారికి భరోసా అందించాం. వ్యాపారంలో మహిళలను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాలను చేసేందుకు మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. అదానీ, అంబానీలకు పరిమితమైన వ్యాపారాలను మహిళలు చేసేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. శిల్పారామంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనకు స్టాల్స్‌ను కేటాయించామన్నారు. హైటెక్ సిటీ పక్కనే మూడున్నర ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి బజార్ రాష్ట్రానికి తలమానికంగా మారిందని చెప్పారు. ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా పురోగతి సాధిస్తుందని మేం నమ్ముతున్నామని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల సంఖ్యను కోటికి పెంచుకోవాలని కోరుతున్నా. మీ రేవంతన్నగా మీకు ప్రోత్సాహం అందిస్తాం అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ మా ఆడబిడ్డల సొంతం.. దేశంలో రూ.16 లక్షల కోట్లు కార్పొరేట్ కంపెనీలకు అప్పు ఇస్తే ఎగ్గొట్టి దేశం విడిచి వెళ్లారు.
కానీ ఆడబిడ్డలకు అప్పు ఇస్తే.. ఒక్క రూపాయి ఎగ్గొట్టకుండా వడ్డీతో సహా చెల్లిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాన్ని మహిళలకు అప్పగించామని చెప్పారు. మీరు సమర్ధవంతంగా నిర్వహిస్తే అవసరమైతే మరో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఉత్పత్తి చేసిన వాటినే రాష్ట్రానికి వచ్చే అతిథులకు బహుమతులుగా అందిస్తున్నామని చెప్పారు.
తెలంగాణ ఆడబిడ్డలను ప్రోత్సహించడమే మా ప్రభుత్వ విధానమని చెప్పారు. ఆడబిడ్డలకు రూ.500లకే సిలిండర్ అందిస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లోని మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చేందుకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. ఆడబిడ్డలు వ్యాపారంలో నిలదొక్కుకుంటే కుటుంబాలు ఆర్థికంగా బాగుంటాయని అన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు ఒక యూనిక్ ఐడీ కార్డు ఇస్తామన్నారు. మహిళల ఆరోగ్యం నుంచి సంపాదన వివరాలన్నీ తెలిపేలా యూనిక్ ఐడీ కార్డు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 21న ఇందిరా మహిళా స్టాళ్లను మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శిస్తారని వెల్లడించారు.

# జై జై.. సైనికా!



శనివారం ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా ర్యాలీలో వెంకయ్యనాయుడు, విద్యాసాగర్‌రావు, నందమూరి రామకృష్ణ తదితరులు

>> ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు తిరంగా యాత్ర విజయవంతంగా సాగింది. ఈ తిరంగా యాత్రకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రజలు, యువత పెద్దఎత్తున పాల్గొని ఈ యాత్రను విజయవంతం చేశారు. ఈ యాత్రలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు ఎంపీ డికే అరుణ, డీఆర్డీఓ మాజీ ఛైర్మన్ సతీష్ రెడ్డి, జమ్ముకశ్మీర్ మాజీ డీజీలు,రాజేంద్రకుమార్, గోపాల్ రెడ్డి, సీఆర్పీఎఫ్ మాజీ డీజీ కృష్ణారెడ్డి, సమ్మక్క సారక్క యూనివర్సిటీ వీసీ వై.ఎల్ శ్రీనివాస్, ప్రముఖ నటి జయప్రద, సినీహీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, ప్రముఖ నటి మంచు లక్ష్మి, మాజీ సిఎం ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ, ప్రముఖ గాయనీ మంగ్లీ, మందకృష్ణ మాదిగ, పాట్నా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి తదితరులు ఈ యాత్రలో దేశ రక్షణకు ప్రతీకలుగా మిలటరీ అధికారులు పాల్గొన్నారు. లెఫ్టినెంట్ జనరల్ రవిప్రసాద్, నారాయణన్, మేజర్ జనరల్ రజత్ మజూర్, శ్రీనివాసరావు,కల్నల్ నగేష్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ప్రముఖ నాయకులు బిజెఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి బీజేపీ పక్షనేత ఏవీఎన్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎం రఘునందన్ రావు, ఆర్ కృష్ణయ్య, గోడెం నగేష్, ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, రామారావు పవర్, పైడి రాకేష్ రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎమ్మెల్సీలు సి అంజిరెడ్డి, మల్కా కొమరయ్య, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, బంగారు శృతి, దుగ్యాల ప్రదీప్ కుమార్, డాక్టర్ గౌతమ్ రావు, ఇతర నేతలు పాల్గొన్నారు. యాత్రలో భాగంగా అందరూ జాతీయ జెండాను పట్టుకొని.. భారతదేశానికి, సైన్యానికి మద్దతుగా నినాదాలు చేశారు. అయితే ఈ ర్యాలీ నేపథ్యంలో ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సెల్లింగ్‌క్లబ్, డిబిఆర్ మిల్స్, ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని అధికారులు సూచించారు.

**ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణ**

మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు ర్యాలీకి చేరుకోవడంతో అక్కడి వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీ, భారత్ మతాకి జై నినాదాలతో మార్మోగుతూ ట్యాంక్ బండ్ పరిసరాలను మరింత ఉత్సాహంగా మార్చింది. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్ మాట్లాడుతూ హైదరాబాద్ ఉగ్రవాదులకు అడ్డగా మారిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కొన్ని రాజకీయ శక్తులు వారికి ఆశ్రయం ఇస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ కేంద్రంగా రెచ్చిపోతున్న ఉగ్రవాదులకు ముగింపు పలకాలని ఆయన వ్యాఖ్యానించారు.

**వెంకయ్య నాయుడు ఏమన్నారంటే...**

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. వీరోచిత పోరాటం చేసిన సైనికులందరికీ జేజేలు కొట్టాలన్నారు. ఒకప్పుడు ప్రపంచానికి విశ్వ గురువుగా ఉన్న ఇండియా, ఇప్పటికీ ఏ దేశంపై యుద్ధానికి కాలు దువ్వలేదన్నారు. మన దేశాన్ని కాపాడుకోవడానికి మాత్రమే ఎదురు దాడి చేసినట్లు పాకిస్థాన్ ఎటాక్ గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యూహంతో వ్యవహరించారని, భిన్నత్వంలో ఏకత్వంగా ఇండియా ఉందని పేర్కొన్నారు.
పోలీసుల తీరుపై కిషన్ రెడ్డి అసహనం
ఈ ర్యాలీ సమయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని ఫ్లాప్ చేయాలని చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి సహకరించాలని విజ్ఞప్తి చేసిన కిషన్ రెడ్డి, బీజేపీ తిరంగ్ ర్యాలీలో జరిగిన తోపులాటపై కూడా స్పందించారు. తోపులాటలో మందకృష్ణ మాదిగ కాలికి గాయం కావడంతో ఆయనను వెంటనే ర్యాలీ నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లారు.




సాయుధ దళాలకు మద్దతుగా శనివారం న్యూఢిల్లీలో తిరంగా ర్యాలీని నిర్వహించిన న్యాయవాదులు

# 'సీజ్‌ఫైర్' నేటితో పూర్తి!

>> పాకిస్తాన్‌లు రెండూ కూడా తాత్కాలిక కాల్పుల విరమణకు అంగీకారం తెలిపాయి. ఇందులోభాగంగానే సరిహద్దులవెంబడి పాక్ చొరబాట్లు, రెచ్చగొట్టే కాల్పులు కూడాజరగలేదు. అయితే ఈ కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారంతోముగుస్తున్నది. స్వయంగా పాకిస్థాన్ ఉపప్రధాని ఇషాక్‌ధర్ ఆదేశ ఎగువసభలోనే ప్రకటించారు.
డెడ్‌లైన్‌ను మరింత పొడిగించే అవకాశం ఉందని, దశలవారీగా చర్చలు కూడా జరుపుతామన్నారు. డైరెక్టర్‌జనరల్స్ మిలిటరీ ఆపరేషన్ల చర్చల్లో ముందు కాల్పులు విరమణకు అంగీకారం కుదిరిందని, 12వ తేదీవరకూ ఉన్న గడువును 14వ తేదీవరకూ పొడిగించారు.
ఆతర్వాత 18వ తేదీవరకూ పొడిగించినట్లు చెప్పారు. భారత్ ఈ వివాదంపై చర్చలకు అంగీకరించవచ్చని ఇషాక్‌ధర్ అన్నారు. పిపిపి చీఫ్ బిలావల్ భుట్టో తీవ్రస్థాయి వ్యాఖ్యలతో కొంతమేర చర్చలకు విఘాతం జరిగినా డిజిఎంఒల స్థాయిలో చర్చలుజరిగాయి.
పాక్ ఆక్రమిత కాశ్మీర్; సరిహద్దుల్లో చొరబాట్లు, కాల్పులు, ఉగ్రవాదం నిర్మూలన మినహా మరేమీ ఇతరచర్చలుండబోవని ఇప్పటికే భారత్ స్పష్టంచేసింది. ఈ క్రమంలో మరోసారి డిజిఎంఒల చర్చలకు స్పష్టమైన తేదీ అనేది ఖరారుకాలేదు.

# ఆటల్లో తేలిన వరల్డ్ 'మిస్'లు

>> చేయడం, అద్భుతమైన పర్యాటక ప్రదేశాలను ప్రమోట్ చేయాలనే ఉద్దేశంతో మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్త ప్రదేశాలను సందర్శించడం కేవలం విలాసం, విశ్రాంతి సాధనం కాదని, మరో సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం, కొత్త వంటకాలను రుచి చూడటం, ఈ జ్ఞాపకాలను పదిలంగా గుర్తుంచుకోవడానికి పర్యాటకం దోహదపడుతుందని చెప్పారు. పర్యాటకం అనేది ప్రజల మధ్య బంధాలను నిర్మించే వంతెన లాంటిదని అభిప్రాయపడ్డారు. బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా కూడా మాట్లాడారు.

# కాళేశ్వరం భూసేకరణ కేసు కొట్టివేత

>> ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగానే ముందుకు వెళ్తుంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తుందని అన్నారు. ఇదే బిఆర్ఎస్ ప్రభుత్వం నడి రోడ్డుపై న్యాయవాది దంపతులను చంపితే... అసలు నేరస్థులను బయటకు రాకుండా కాపాడింది. ఎప్పటికైనా అసలు దోషులకు తప్పకుండా శిక్ష పడుతుందనే నమ్మకం మాకుంది అని విశ్వాసం వ్యక్తం చేశారు.
అన్నదాతల తరఫున వారి గొంతుకగా.. మా మంథని ప్రజల కోసం పోరాటం చేస్తే నాతో పాటు, స్థానిక కాంగ్రెస్ నాయకులపై కేసులు పెట్టి ఇబ్బంది పెట్టారు. అసలు అక్కడ లేని వ్యక్తుల పేర్లను కూడా ఎఫ్ఐఆర్ లో చేర్చి కొందరు బీఆర్ఎస్ నేతలు రాక్షసానందం పొందారు. భూములు కోల్పోతున్న రైతుల తరఫున పోరాడితే కేసులు పెట్టారని, చివరికి న్యాయమే గెలిచిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజా విచారణ చేస్తున్న సందర్భంగా రైతుల హక్కులను కాపాడేందుకు వినతిపత్రాన్ని ఇవ్వాలని వెళ్లాము. అధికారం అండతో మాపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఎనిమిదేళ్లపాటు ఈ కేసు నడిచింది. తాజాగా న్యాయస్థానం కొట్టివేసింది. ఇది ప్రజా విజయం. రైతుల విజయం. పేద రైతు ఘోషను న్యాయస్థానం విన్నది. అధికారం ఉందని నాడు కేసులు పెట్టారు.
పోలీసులను అడ్డగోలుగా వినియోగించుకున్నారు. కానీ, ఇవాళ ప్రజాస్వామ్యం ఉంది. చట్టాలను నమ్ముతూ మేం ముందుకు వెళ్తున్నాం. మాకు అధికారం ఉందని ఎక్కడా దుర్వినియోగం చేయడం లేదు. భారాస ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూడా నిలవలేదు. దానిపైనా విచారణ జరుగుతోంది. తప్పు చేసిన వాళ్లు కచ్చితంగా శిక్ష అనుభవించాల్సిందే" అని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి ప్రజా విచారణ చేస్తున్న సందర్భంగా రైతుల హక్కులను కాపాడాలని విజ్ఞాపన పత్రాన్ని ఇచ్చేందుకు అక్కడికి వెళ్తే,అధికారం ఉందని మాపై అన్యాయంగా వివిధ సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారని గతంను శ్రీధర్‌బాబు గుర్తుచేసుకున్నారు.

# ముసురుతున్న వాన మబ్బులు

## బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

## పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** మాడు పగిలే ఎండతో అల్లాడిపోయిన ప్రజలకు వాతావరణ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, మాల్దీవులు, కొమోరిన్ ప్రాంతం, దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ దీవులులోకి మరింతగా ప్రవేశించాయని భారత్ వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర కోస్తాకు ఆనుకుని బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం తెలిపింది. అంతేకాకుండా ఈ రుతుపవనాలు రెండు, మూడు రోజుల్లో మాల్దీవుల్లోని మరిన్ని ప్రాంతాలు, మధ్య బంగాళాఖాతం వరకు విస్తరిస్తాయని తెలిపింది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో ఇవి దక్షిణ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయని వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు ఈ నెలాఖరు నాటికి కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని, దీని ప్రభావంతో రానున్న మూడు, నాలుగు రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఈసారి సాధారణం కంటే నాలుగు రోజులు ముందుగానే వర్షాలు వస్తున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీలో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఏపీలో వారం రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. మరోపక్క తెలంగాణ వ్యాప్తంగా రాబోయే నాలుగు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఇవాళ రేపు కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో రానున్న రెండు రోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని తెలిపింది.
గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. రాబోయే మూడు రోజులు పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది. రెండు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడి, ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది.

# ఆర్థిక ఇబ్బందుల్లో ఖజానా

### రూ.8,782 కోట్ల రెవెన్యూ లోటు

### రాబడుల్లో భారీగా తగ్గిన రూ.53 వేల కోట్లు : కాగ్ నివేదిక

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఖజానా కష్టాల్లో ఉంది. ఆదాయం తగ్గడంతో పాటు, రెవెన్యూ లోటు పెరుగుతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. 2024-25 సంవత్సరానికి రాష్ట్ర తాత్కాలిక ఖాతాలు ఆదాయ సమీకరణలో ఆశించినత మేర లక్ష్యాలను చేరుకోకపోవడం, ఆదాయ మరియు ఆర్థిక లోటు రెండింటిలోనూ ఆందోళనకరమైన పెరుగుదలను సూచిస్తుండటంతో తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తాజాగా ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక వెల్లడించింది. తెలంగాణ 2024-25 ఆర్థిక సంవత్సరాన్ని రూ.8,782 కోట్ల రెవెన్యూ లోటుతో ముగించింది. రాష్ట్ర ఆర్థిక లోటు, అంటే రుణాలు మినహాయించి మొత్తం వసూళ్లు మరియు ఖర్చుల మధ్య అంతరం, రూ.48,322 కోట్లుగా ఉంది, ఇది బడ్జెట్ అంచనా రూ.49,255 కోట్లకు దాదాపు చేరుకుంది. శాతం వినియోగం (98.11 శాతం) నియంత్రణలో ఉన్నట్లు కనిపించినప్పటికీ, తగ్గిన ఆదాయ వసూళ్ల కారణంగా రాష్ట్రం రుణాన్ని స్థిరంగా తిరిగి చెల్లించడానికి లేదా నిర్వహించడానికి తక్కువ అంతర్గత సామర్థ్యం కలిగి ఉన్నట్లు వెల్లడవుతోంది. తెలంగాణ అంచనా వేసిన రెవెన్యూ రాబడిలో కేవలం 75.85 శాతం మాత్రమే సాధించింది, అంటే రూ.2.21 లక్షల కోట్ల లక్ష్యానికి గాను రూ.1.68 లక్షల కోట్లు, అంటే రూ.53,000 కోట్ల భారీ తగ్గుదలగా ఉంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో, రాష్ట్రం దాదాపు 78 శాతం రెవెన్యూ రాబడిని ఆర్జించింది. ఇక పన్ను ఆదాయం అంచనా వేసిన రూ.1.64 లక్షల కోట్ల నుండి రూ.1.36 లక్షల కోట్లకు తగ్గింది. ముఖ్యంగా, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ రసీదులు అంచనాలలో కేవలం 46.48 శాతానికి పడిపోయాయి, ఎక్సైజ్ వసూళ్లు కూడా వెనుకబడి, లక్ష్యంలో 72.6 శాతం మాత్రమే సాధించాయి. పన్నుయేతర ఆదాయం అంచనాలలో కేవలం 67 శాతానికి చేరుకుంది మరియు కేంద్రం నుండి గ్రాంట్స్ ఇన్‌ఎయిడ్ కూడా అంచనా వేసిన మొత్తంలో 36.5 శాతం మాత్రమే ఉంది. అయితే, రాష్ట్ర నికర రుణాలు రూ.48,322 కోట్లుగా ఉన్నాయి, ఇది బడ్జెట్ అంచనాలో 98 శాతానికి పైగా ఉంది. మూలధన వ్యయం లక్ష్యాలను రూ.36,209 కోట్లతో స్వల్పంగా అధిగమించినప్పటికీ, రూ.33,486 కోట్లుగా ఉన్నప్పటికీ, పన్ను ఆదాయాల కంటే అప్పుల ద్వారా దీనిని తీర్చారు. రుణ చెల్లింపుల భారం పెరుగుతూనే ఉంది, రాష్ట్రం వడ్డీ చెల్లింపుల కోసం రూ. 26,688 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇది వార్షిక బడ్జెట్ అంచనాలో 150 శాతం. పెన్షన్లు మరియు జీతాలు కూడా బడ్జెట్ అంచనాలను మించిపోవడంతో ఈ రెండింటికికలిసి రూ. 59,000 కోట్లకు పైగా ఖర్చయ్యాయి. ఖజానాకు సమకూరిన ఆదాయం కంటే గణనీయంగా ఎక్కువ ఖర్చు చేసిందని దీంతో అప్పులు చేయకుండా అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలకు నిధులు సమకూర్చే రాష్ట్ర సామర్థ్యాన్ని ప్రభావితం చేసిందని తెలిపింది.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ హాల్‌టికెట్లు విడుదల

### 22 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారికి.. మొదటి సంవత్సరంలో ఇంప్రూవ్‌మెంట్ కోసం పరీక్షలు రాసే వారికోసం నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు విడుదల చేసింది. ఈ నెల 22 నుంచి జూన్ 3 వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి అలాగే సంబంధిత జూనియర్ కాలేజీల నుంచి కూడా పొందవచ్చని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. అనంతరం పరీక్షల ఫలితాలను ఏప్రిల్ 22న విడుదల చేశారు. వాటిలో మొదటి సంవత్సరంలో 4,88,430 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 3,22,191 మంది పాసయ్యారు. మరో 1,66,239 మంది ఫెయిలయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5,08,582 మంది పరీక్షలకు హాజరు కాగా.. వారిలో 3,33,908 మంది ఉత్తీర్ణులయ్యారు. మరో 1,74,674 మంది ఫెయిలయ్యారు. వీరిలో మొదటి సంవత్సరంలో ఫెయిలైన వారితోపాటు మరికొందరు తమకు తక్కువ మార్కులొచ్చిన సబ్జెక్టుల్లో మార్కులను పెంచుకోవడానికి ఇంప్రూవ్‌మెంట్ రాసుకుంటారు. అయితే ఈ నెల 8తో అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించడానికి గడువు ముగిసింది. రాష్ట్రంలో ఫెయిలైన విద్యార్థుల్లో 2,89,907 మంది ఫీజు చెల్లించినట్టు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. అలాగే ఇంప్రూవ్‌మెంట్ కోసం 1,23,647 మంది దరఖాస్తు చేసుకున్నారు. రీవెరిఫికేషన్ కోసం 27,138 మంది దరఖాస్తు చేసుకోగా.. రీకౌంటింగ్ కోసం 3761 మంది దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

## రష్దీపై దాడి నిందితుడికి 25 యేళ్ల జైలు

**న్యూయార్క్, మే 17:** ప్రముఖ అంతర్జాతీయ రచయిత, బుకర్ ప్రైజు విజేత సల్మాన్ రష్దీపై హత్యాయత్నం కేసులో శుక్రవారం తీర్పు వెలువడింది. ఈ కేసులో గత ఫిబ్రవరిలో దోషిగా నిరూపణ అయిన న్యూజెర్సీకి చెందిన 27 యేళ్ల హాది మతార్‌కు కోర్టు 25 యేళ్ల శిక్ష విక్ష విధించింది. న్యూయార్క్‌లో



2022లో జరిగిన దాడిలో సల్మాన్‌రష్దీ కన్ను కోల్పోయారు. శుక్రవారం తీర్పు సందర్భంగా కోర్టుకు రష్దీ హాజరుకాలేదు. అయితే, తనపై జరిగిన దాడి ప్రభావంపై ఆయన కోర్టుకు సమాచారం ఇచ్చారు. రష్దీ హిపోక్రేట్ అని తీర్పుకు ముందు మతార్ అన్నారు. 2022లో స్టేజిపై రష్దీతోపాటు మరో వ్యక్తిపై మతార్ దాడి చేశారు. రష్దీపై దాడికి 25 యేళ్లు, మరో వ్యక్తిపై దాడికి ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ జాసన్ ష్మిట్ తీర్పు చెప్పారు. ఈ రెండు శిక్షలూ ఏకకాలంలో అమలవుతాయి. మతార్ ఉద్దేశ పూర్వకంగానే రష్దీపై 1,400 మంది ఆడియెన్స్ ముందు దాడిచేసి ఆయనను తీవ్రంగా గాయపరిచినట్టు ష్మిట్ పేర్కొన్నారు. కత్తితో దాడి చేసిన ఘటనలో రష్దీ కాలేయం కూడా దెబ్బతిన్నది. ఓ చేతికి నరం డ్యామేజ్ కావడంతో పక్షవాతం కూడా వచ్చింది. 35 యేళ్ల క్రితం సల్మాన్‌రష్దీ రాసిన ద సటానిక్ వర్సెస్ నవల వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఆ నవలలో మహమ్మద్ ప్రవక్తపై అతను వ్యాఖ్యలు చేశారు. దీంతో రష్దీని టార్గెట్ చేశారు. రష్దీ కపట మోసకారి అని నిందితుడు కోర్టులో పేర్కొన్నాడు.

# కెసిఆర్ అంతఃపురంలో మొదలైన అలజడి

### బిఆర్ఎస్‌లో నాలుగు స్తంభాలాట

### బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ అంతఃపురంలో అలజడి మొదలైందని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కెసిఆర్ కుటుంబ పార్టీ అయిన బిఆర్ఎస్‌లో తండ్రి, కొడుకు, కూతురు, మేనల్లుడు మధ్య రాజకీయ విభేదాలు కొద్ది రోజులుగా కొనసాగుతున్నాయే తప్ప కొలిక్కి రావడం లేదన్నారు. వీరి మధ్య రాజకీయ విబేధాలు ఉన్నాయనడానికి బిఆర్ఎస్ రజతోత్సవ సభలో హరీశ్ రావుకు, కవితకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా విస్మరించడమే నిదర్శనం అన్నారు. రజతోత్సవ సభ నిర్వహణలో పెత్తనమంతా తండ్రీ, కొడుకులదే కావడం, కూతురు, మేనల్లుడు ప్రేక్షక పాత్రకే పరిమితమవడమే అన్నారు. బిఆర్ఎస్‌ను నడిపిస్తున్న కెటిఆర్ డమ్మీలుగా మిగిలిన హరీష్, కవితగా మిలిగిపోతున్నారు. మాజీ మంత్రి కెసిఆర్ అంత చురుకుగా లేరని అన్నారు. అప్పుడుప్పుడు మాత్రమే మాట్లాడుతున్నారని అన్నారు. పార్టీ నిర్వహణ బాధ్యతలను వర్కింగ్ ప్రసిడెంటు అయిన కెటిఆర్ చూస్తున్నారు.
స్వయంగా కెసిఆరే పార్టీ నేతలకు కెటిఆర్‌ను కలవండని చెప్తున్నారు. అసెంబ్లీ లోపల బయటా బిఆర్ఎస్‌ను కెటిఆరే నడిపిస్తున్నారు. దాంతో పార్టీ నేతలంతా కెటిఆర్‌నే కలుస్తున్నారు తప్ప కవిత, హరీష్‌రావులను పట్టించుకోవడం లేదన్నారు. పదవులు, ఆస్తులు అన్నీ కెటిఆర్‌కేనా తండ్రి కెసిఆర్‌పై లేఖాస్త్రంతో కవిత తిరుగుబాటు మొదలైందన్నారు. గత కొన్నిరోజులుగా కవిత తండ్రి కెసిఆర్ పదేళ్ల పాలనపై తన అసంతృపి వ్యకం చేస్తున్నారు. బిఆర్ఎస్ పాలనలోని లోపాలు, వైఫల్యాలతో పాటు పార్టీలో తనకు జరుగుతున్న అన్యాయాలపై కవిత ఇటీవల కెసిఆర్‌కు రాసిన లేఖను త్వరలోనే బయటపెట్టే అవకాశముంది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తన సొంత సంస్థ తెలంగాణ జాగృతి కృషి సైతం ఉందని, ఉద్యమం కాలం నాటి వాస్తవాలను కూడా బయటపెట్టాలని కవిత అనుకుంటున్నట్టు సమాచారం. కెసిఆర్ పదేళ్ల పాలనలో అవినీతి ద్వారా జమ చేసిన వేలకోట్ల సొమ్మును తన కుమారుడు కెటిఆర్ ఇస్తున్నారని, పదవులు, డబ్బులు అన్నీ ఆయనకే ఇవ్వడంతో కవిత తిరుగుబాటు జెండా ఎగరవేస్తున్నారు.
కెటిఆర్ నాయకత్వానికి ఒకె అన్న హరీష్ తెరవెనక కెసిఆర్ ఒత్తిడే కారణమా అన్న అనుమానం కలుగుతుందన్నారు. తన సొంత పార్టీ బిఆర్ఎస్‌పై కవిత అసంతృప్తి వ్యక్తం చేసిన మరుసటి రోజే అంటే మే 13న హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లోనే మీడియా సమావేశంలో బిఆర్ఎస్ అధ్యక్ష బాధ్యతలు కెటిఆర్‌కు అప్పగించినా తనకు అభ్యం తరం లేదని ప్రకటించారు.
కవిత చేసిన కామెంట్సుతో బిఆర్ఎస్ క్యాడరులో గందరగోళం నెలకొంటుందని గ్రహించిన కెసిఆర్, దానిని తగ్గించాలనే ఆలోచనతో, కవిత మాదిరిగా హరీష్ అసంతృప్తిగా లేదని బయటి ప్రపంచానికి చెప్పెందుకె హరీష్‌రావుతో ఆ స్టేట్ మెంట్ ఇప్పించారట. తన నాయకత్వానికి మద్దతు ఇస్తానంటూ హరీష్ మాట్లాడిన తర్వాత మూడో రోజే అంటే శుక్రవారం ఆయన ఇంటికి కెటిఆర్ వెళ్లి రెండు గంటల పాటు రాజకీయాలు చర్చించారు. కెటిఆర్‌కు పార్టీ అధ్యక్ష పదవి ఇస్తే తనకు ప్రతిపక్ష నేత పదవి ఇవ్వాలని హరీష్‌రావు డిమాండ్ చేసారట. ఇదే అంశంపై మాట్లాడేందుకె కెటిఆర్ ఉన్నపళంగా హరీష్‌రావు ఇంటికి వెళ్లినట్టు సమాచారం. కెటిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్‌లో ఉంటే తమకు పదవులు రావనే హరీష్, కవితలను బిఆర్ఎస్ఎల్పీని చీల్చే వ్యూహాన్ని అమలు చేసుబిన్నారా అన్న అనుమానం కలుగుతుందన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ తాను ఎంపి, ఎమ్మెల్సీ మాత్రమే కాగలిగానని. తన అన్న చేతిలోకి బిఆర్ఎస్ వెళితే ఇక తనకు రాజకీయ భవిష్యత్తు ఉండదని గ్రహించిన కవిత బిఆర్ఎస్ఎల్పీని చీల్చుడానికె తెగించారట. హరీష్ కూడా కెసిఆర్ పుణ్యమా అని మంత్రిని కాగలిగానని, కెటిఆర్ చేతిలోకి బిఆర్ఎస్ వెళితే ఇక పార్టీ భవిష్యత్తు ఉండదని అని కలవరపడుతున్నారట. భవిష్యతుబిపై గ్యారంటీ లేనపుడు బిఆర్ఎస్‌లో కొనసాగడం దేనికని, తెగించి బిఆర్ఎస్ఎల్పీ చీల్చితే ఇపుడైతే ప్రతిపక్ష పదవి అయినా దక్కుతదని, హరీష్ బిఆర్ఎల్పీ చీలిక వ్యూహాన్ని అమలు చేస్తున్నారట అని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

# త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు ఏర్పాటు

### సిఎం రేవంత్‌రెడ్డి

### బోర్డులో భాగస్వామ్యం కానున్న నోబెల్‌గ్రహీత అభిజిత్‌బెనర్జీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 17:** ఆర్థిక శాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన పథకాలు, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాసేపు ముచ్చటించారు. శనివారం బంజారాహిల్స్ లోని ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి,హైదరా బాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఆదాయాన్ని పెంచేందుకు ఉన్న మార్గాలు, ఆర్థిక క్రమశిక్షణ, పట్టణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టించడంతో పాటు తదితర అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. శతాబ్దాల చరిత్ర ఉన్న హైదరాబాద్ విజన్‌ను, ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదరణ గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు వివరించారు. తెలంగాణకు సంబంధించిన విశిష్ట తను, ఇక్కడున్న అనుకూలతలను ప్రపంచ మంతటా చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతుల సాధికారత, యువతకు ఉద్యోగాలతో పాటు స్కిల్ డెవలప్ మెంట్ దిశగా ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డులో భాగస్వామ్యం పంచుకోవాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అభిజిత్ బెనర్జీని ఆహ్వానించారు.



భవిష్యత్తు విజన్ రూపకల్పనలో ఇతర ప్రముఖులతో పాటు తమ అనుభవాలను పంచుకోవాలని కోరారు. గొప్ప విజన్‌తో ముందుకు సాగుతున్నారని అభిజిత్ బెనర్జీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశంసించారు. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు బోర్డులో చేరడానికి సమ్మతించారు.పోలీస్, మున్సిపల్ శాఖల్లో ట్రాన్స్‌జెండర్ల నియామకం, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాను సర్వీస్ సెక్టార్ గా అభివృద్ధి చేసే ప్రణాళికను ఎంచుకోవటం, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయటం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతకు అద్దం పట్టిందని అభిజిత్ బెనర్జీ ముఖ్యమంత్రిని అభినందించారు. భారత్ ఫ్యూచర్ సిటిలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సృజనాత్మకతను భాగం చేయాలని అభిజిత్ బెనర్జీ సూచించారు. సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆధునిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. అత్యాధునిక సాంకేతికత, సోషల్ మీడియా, మార్కెటింగ్ నైపుణ్యాలతో వారిని వృద్ధి చేయాలన్నారు.

# మా భూమిని కబ్జా చేశారు.. కాపాడండి సార్

### సిఎం రేవంత్‌కు జవాన్ విడియో ద్వారా విజ్ఞప్తి

### ఎక్స్ ఖాతాలో ఆ విడియోను పోస్ట్ చేసిన హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 17:** తాను దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తూ, శత్రువుల నుంచి దేశాన్ని కాపాడుతుంటే, తన భూమిని మాత్రం కొందరు కబ్జా చేసి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఓ జవాన్ వాపోయారు. తమ భూమి తమకు దక్కేలా చూడాలంటూ పలు సామాజిక మాధ్యమాల వేదికగా సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను సరిహద్దుల్లో దేశం కోసం పోరాడుతుంటే, సొంతూరిలో భూమిని కబ్జా చేశారని దుబ్బాక(ఎం) చౌదరిపల్లికి చెందిన జవాన్ రామస్వామి వాపోయారు. తన తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమిని కబ్జా చేసిన వ్యక్తి విఆర్వో తమ్ముడు అని తెలిపారు.స్థానిక ఎమ్మార్వో,ఆర్డీవోలకు ఫిర్యాదు చేద్దామన్నా వారికే మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌ను కలిసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తన తల్లిదండ్రులను బెదిరిస్తున్నారని, తన భూమి తనకు దక్కేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించి, న్యాయం చేయాలని కోరారు. ఆర్మీ జవాన్ సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేసిన వీడియోను బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. జవాన్‌కు తగిన న్యాయం చేయాలంటూ సిద్దిపేట కలెక్టర్‌ను ఎక్స్ వేదికగా కోరారు.

# భీకర దాడి..ఒక్కరోజే గాజాలో 115 మంది మృతి

**గాజాసిటీ, మే 17:** గాజాలో ఇజ్రాయెల్ మారణ హోమాన్ని సృష్టిస్తోంది. గాజాలోని పలు ప్రాంతాలపై భీకర దాడులకు పాల్పడుతోంది. గత మూడు రోజులుగా వైమానిక దాడులతో విరుచుకు పడుతోంది. ఈ క్రమంలో శుక్రవారం ఒక్కరోజే ఐడీఎఫ్ జరిపిన దాడుల్లో ఏకంగా 115 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. గాజా శివార్లలోని దేర్ అల్ బలాహ్, ఖాన్ యూనిస్ నగరంతో సహా గాజావ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఇజ్రాయెల్ సేనలు బాంబుల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. ఈ దాడుల్లో 115 మంది ప్రాణాలు కోల్పోగా వందలాది మంది గాయపడినట్లు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్ మినహా గల్ఫ్ దేశాలలో జరిపిన పర్యటన ముగిసిన నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులు జరిగాయి. గాజా స్ట్రిప్ సరిహద్దులపై ఇజ్రాయెల్ దిగ్బంధం మూడు నెలలుగా సాగుతోంది. ఇక దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై రాత్రి వేళల్లో ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో 54 మంది మరణించారు.



మృతుల్లో ఓ పాత్రి కేయుని కుటుంబ సభ్యు ల్లో 11 మంది ఉన్నారు. అంతకుముందు జరి గిన దాడుల్లో 22 మంది చిన్నారులు సహా మొ త్తం 70 మంది ప్రాణాలు కోల్పోయారు. ఫలితం గా గత మూడు రోజుల వ్యవధిలోనే ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో గాజాలో 180 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం మరో 115 మంది మరణించారు. తాజా మరణాలతో కలిపితే గాజా పోరు మొదలైనప్పటి నుంచి ప్రాణాలు కోల్పోయిన పాలస్తీనియుల సంఖ్య 53 వేలు దాటినట్లు గాజా ఆరోగ్యశాఖ తెలిపింది. లక్షలాది మంది గాయపడ్డారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవార్డు చూపిస్తున్న నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్

## డ్రగ్స్‌ఫ్రీ తెలంగాణ కల సాకారం చేస్తున్న పోలీసులకు సిఎం రేవంత్ అభినందనలు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** మాదకద్రవ్యాలు, అక్రమ రవాణాల నియంత్రణపై నిరంతరం పోరాడుతూ ప్రపంచంలోనే నగరం ప్రథమస్థానం రావడం గర్వకారణమని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దుబాయ్ వేదికగా జరిగిన వరల్డ్ పోలీస్ సమ్మిట్‌లో పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ అవార్డు అందుకోవడంతో ఆయనతోపాటు నార్కోటిక్ బృందాన్ని అభినందించారు. శని వారం సిఎంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ప్రతినిధులు ప్రదానం చేసిన ప్రతిష్టాత్మక అవార్డును చూపించడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆ అంశాలపై జరిగిన చర్చను ఆయనకు వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం సమాజాన్ని పట్టిపీడిస్తుందని, డ్రగ్స్‌ఫ్రీ తెలం గాణకు తాను కంటున్న కలలను సాకారం చేస్తున్న ప్రతీ పోలీసుకు మద్దతు పలుకుతున్నాని తెలిపారు. 138 దేశాలతో పోటీపడి నంబర్‌వన్‌గా నిలవడం ప్రత్యేక గౌరవమన్నారు.

## విదేశీ కార్ల గోల్‌మాల్ వ్యవహారంలో మరో ఇద్దరి అరెస్టు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల కార్ లాంజ్ షోరూంలో వెలుగు చూసిన విదేశీ కార్ల అక్రమ దిగుమతి, సుంకాల ఎగవేత కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ డైరక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) అధికారులు శనివారం మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ కేసులో కార్ లాంజ్ షోరూం యజమాని బషారత్ అహ్మద్‌ఖాన్‌ను డిఆర్ఐ అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే. అమెరికా, జపాన్, బ్రిటన్ దేశాలలో తయారైన ఖరీదైన కార్లను తక్కువ ధర వాహనాలుగా చూపుతూ తప్పుడు పత్రాలతో శ్రీలంక నుంచి భారత్‌లోకి అక్రమంగా కార్ లాంజ్ షోరూం యజమాని బషారత్ అహ్మద్ ఖాన్ చేరవేయడం తెలిసిదే. మొత్తం 30 కార్లను ఇతను భారత్‌కు తీసుకురాగా ఇందులో ఏడు కార్లను తన మిత్రుడు, వ్యాపార భాగస్వామి డాక్టర్ అహ్మద్‌కు అమ్మగా పది కార్లను నగరంలోని తనకు నమ్మకమైన బడా బాబులకు అమ్మినట్లు డిఆర్ఐ వెల్లడించింది. బషారత్ అహ్మద్ ఖాన్ వద్ద కార్లను కొన్న వా రిలో ఇద్దరిని గుర్తించిన డిఆర్ఐ వారిని శనివారం ఉదయం హైదరాబాద్‌లో అరెస్టు చేసిందని సమాచారం. వీరిని విచారిస్తున్న డిఆర్ఐ అధికారులు కార్లు కొన్న మిగతా వారి కోసం గాలిస్తున్నారు. మరోవైపు బషారత్ అహ్మద్‌ఖాన్‌ను గుజరాత్‌లో అరెస్టు చూపిన డిఆర్ఐ అధికారులు అతన్ని కస్టడీలోకి తీసుకుని ఈ గోల్‌మాల్‌పై విచారించేందుకు అక్కడి కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. బషారత్ అహ్మద్ ఖాన్ 25 కోట్ల రూపాయలకుపైగా పన్నులను ఎగవే సినట్లు డిఆర్ఐ గుర్తించింది. ఇతను విక్రయించిన కార్ల ద్వారా మరో 20 కోట్ల రూపాయల పన్ను రావాల్సి ఉందని డిఆర్ఐ నిర్ధారించింది.



## కాంగ్రెస్ తీరు మార్చుకోవాలి

### నేడు వన్ నేషన్-వన్ ఎలక్షన్‌పై నిపుణులతో సమావేశం: మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార:** దేశవ్యాప్తంగా వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమం కొనసాగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రజల మద్దతు పొందేలా పురప్రముఖులు, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజినీర్లు తదితర రంగాల్లోని ప్రముఖులు పాల్గొంటున్నారని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 500 సమావేశాలు, గ్రూప్ మీటింగ్స్ నిర్వహించినట్లు, జిల్లాలస్థాయిలోనూ ఇవి విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు.
ఆదివారం ఉదయం 10:30 గంటలకు నగరంలో ఒక హోటల్‌లో నిర్వహించనున్న ప్రొఫెషనల్స్ ఫర్ వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమంలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి సునిల్ బన్సల్, ఏకే ఆంటోనీ, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమం జాతీయ ఇంచార్జ్ అనిల్ కె. ఆంటోనీ పాల్గొననున్నారని తెలిపారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ కొత్త కాన్సెప్ట్ కాదని, 1952 నుంచి 1967 వరకూ దేశంలో లోకసభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకే సమయంలో జరిగేవన్నారు.
ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ గవర్నర్ కార్యాలయాన్ని దుర్వినియోగం చేసి, రాజ్యాంగానికి విరుద్ధంగా ఎన్నికలను రద్దు చేయడం మొదలుపెట్టిందన్నారు. దీని వల్ల ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాంటెక్స్‌తో డెవలప్ మెంట్ పూర్తిగా ఆగిపోతుందన్నారు.

## 51 రోజులు 1,000 కిలోమీటర్లు

**భువనేశ్వర్, మే 17:** ఆలివ్ రిడ్లే తాబేళ్ల జీవన విధానం, పునరుత్పత్తిపై చేస్తున్న పరిశోధనల్లో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒక ఆలివ్ రిడ్లే తాబేలు ఒడిశాలోని కేంద్రపారా జిల్లా గహీర్‌మథ్ వద్ద సముద్రంలో ప్రయాణం ప్రారంభించి 51 రోజుల తర్వాత ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరుకుంది. ఈ 51 రోజుల్లో ఆ తాబేలు వెయ్యి కిలోమీటర్లు ఈదినట్లు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రేమ్ శంకర్ ఝా తెలిపారు. ఆలివ్ రిడ్లే తాబేలుకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్యాగ్‌ను అమర్చి పరిశీలించగా ఈ విషయాలు తెలిశాయని ప్రేమ్ శంకర్ చెప్పారు. గతంలో మరో తాబేలు శ్రీలంక, తమిళనాడు, పుదుచ్చేరిల మీదుగా ఆంధ్రాకు చేరిందని తెలిపారు. నాలుగేళ్ల కిందట కూడా ఒడిశా తీరంలో ట్యాగ్ వేసిన ఓ తాబేలు 3,500 కిలోమీటర్లు ప్రయాణించి గుడ్లు పెట్టేందుకు ఇటీవల మహారాష్ట్రలోని రత్నగిరి తీరానికి చేరుకుందని వెల్లడించారు.



# ఎస్సీ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలు పూర్తి

### 17వతేదీ లోపే సీట్లన్నీ భర్తీ

### గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ గురుకులల్లో 5వ తరగతిలో సీట్ల భర్తీ ప్రక్రియ పూర్తియినట్టు గురుకుల కార్యదర్శి డాక్టర్ విఎస్ అలగు వర్షిణి తెలిపారు. తొలిసారిగా మే 17లోపే 5వ తరగతిలో అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిచేసి రికార్డు సృష్టించినట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సి, ఎస్టి, బిసి, సాధారణ రెసిడెన్షియల్ నాలుగు సొసైటీల్లో 5 వ తరగతి సీట్ల భర్తీకి గాను ఈ ఏడాది ఫిబ్రవరి 23న టిజి సెట్-2025ని నిర్వహించారు. నాలుగు సొసైటీ వారిగా సీట్లను ...మూడు దఫాలుగా భర్తీ చేసి అర్హత పొందిన విద్యార్థుల మెరిట్ జాబితాను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. శనివారం విడుదల చేసిన 1822 సీట్లతో ఈ విద్యా సంవత్స రానికి 5వ తరగతి సీట్లు పూర్తిగా భర్తీ చేయడం జరిగిందన్నారు. మే 3వ వారంలోపు 5వ తరగతి సీట్లను అన్ని భర్తీ చేయడం అనేది గురుకుల చరిత్రలో ఇదే మొదటిసారి కావడం విశేషమని ఇదొక గొప్ప రికార్డని టిజి సెట్-2025 చీఫ్ కన్వీనర్ డాక్టర్ విఎస్ అలగు వర్షిణి తెలిపారు.
విద్యార్థిని, విద్యార్థులు 5వ తరగతిలో చేరిన తర్వాత వారు ఏమైనా కారణాలతో సంబంధిత విద్యా సంస్థలో కొనసాగకుండా వెళ్ళిపోతే వారి స్థానంలో ఏర్పడిన ఖాళీలను మే 25 తర్వాత .. తదుపరి మెరిట్ ఉన్న విద్యార్థులచేత భర్తీ చేయనున్నట్టు స్పష్టం చేశారు. దాంతో పాటు ఎన్నడు లేనివిధంగా గురుకుల విద్యా సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు అంచనాలకు మించి వచ్చాయన్నారు. గురుకులాలలో ఇంటర్‌లో తీసుకున్న విప్లవాత్మక మార్పుల మూలంగా ..విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడంతోపాటు ఉత్తీర్ణశాతం గణనీయంగా పెరిగిందని.. అలాగే ఐఐటి, జేఈఈ వంటి పోటీ పరీక్షలు కూడా గురుకుల విద్యార్థులు కార్పొరేట్ కళాశాలకు దీటుగా అధిక సంఖ్యలో అర్హతను సాధించారని తెలిపారు. ఇంటర్‌లో అడ్మిషన్‌కు అర్హత పొందిన విద్యార్థుల జాబితాను ఈ నెల 23వ తేదీలోగా వెల్లడించనున్నట్టు గురుకుల కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు. ఎస్సి గురుకుల సొసైటీ అధ్వర్యంలో కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ సైనిక పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23న పరీక్షను నిర్వహించడం జరిగిందన్నారు. అర్హత పొందిన విద్యార్థులలో రుక్మా పూర్ సైనిక్ స్కూల్ లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను 1:10 చొప్పున ఎంపిక చేసి ఫిజికల్, మెడికల్ టెస్ట్‌లను ఈనెల మొదటి వారంలో నిర్వహించడం జరిగింది. ఈ టెస్టులో మొత్తం 80 సీట్లకుగాను 102 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. క్వాలిఫై అయిన విద్యార్థుల ఫలితాలను కూడా శనివారం విడుదల చేసినట్టు తెలిపారు. మేడ్చెల్ మల్కాజ్ గిరి జిల్లా పరిధిలోని ఘట్‌కేసర్ దగ్గరగల ఏదులాబాద్ ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23న పరీక్షను నిర్వహించడం జరిగింది. ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను 1:10 చొప్పున ఎంపిక చేసి స్కిల్ టెస్ట్ ఈ నెల రెండవ వారంలో నిర్వహించడం జరిగింది. ఇందులో మొత్తం 210 మంది విద్యార్థులు స్కిల్ టెస్ట్‌కు హాజరుకాగా .. క్వాలిఫై అయిన 85 మంది విద్యార్థుల ఫలితాలను శనివారం విడుదల చేసినట్టు సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.G లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ /బహిరంగ టెండర్ పత్రికా ప్రకటన
RRZ-01/2025-26
వివిధ సామగ్రిల యొక్క సేకరణ నిమిత్తం టెండర్ స్పెసిఫికేషన్ నం॥లు OT-01/2025-26 యొక్క CE/OP/RR జోన్ కొరకు బహిరంగ టెండర్లకు అర్హులైన కాంట్రాక్టర్లు నుండి టెండర్లు కోరబడుతున్నవి. సవివరమైన ప్రకటన, స్పెసిఫికేషన్ మరియు డిజిటల్ సర్టిఫికేట్ సంబంధిత తదుపరి వివరాల కొరకు దయచేసి www.tender.telangana.gov.inను వీక్షించండి.
సం/-. చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్, రంగారెడ్డి జోన్, KPHB కాలనీ, హైదరాబాద్.
DIPR.NO. 2051-PP/CL/ADVT/1/2025-26 తేదీ: 17.05.2025

ఇటీవల మాజీ మంత్రి హరీష్‌రావు ప్రభుత్వం ధాన్యంసేకరణలో వైఫల్యాన్ని ఎండగడుతున్నారు. రైతులు చనిపోతుంటే పట్టించుకోకుండా అందాల పోటీల మీద రివ్యూలు పెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి తీరు.. రోమ్ నగరం తగులబడుతుంటే నీరో చక్రవర్తిఫిడేల్ వాయించినట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో వచ్చే పదిరోజుల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. రైతులు సాగు సన్నాహాలు చేసుకోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపు కాస్తున్నారు. ధాన్యం ఎప్పుడు మిల్లుకు తరలిస్తారో కొందరు ఎదురు చూస్తుంటే, మరికొందరు నగదు ఎప్పుడు బ్యాంకు ఖాతాలో చేరుతుందో అని ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన దొడ్డు,సన్నరకం ధాన్యానికి సంబంధించిన కనీస మద్దతు ధరకు మొత్తంరూ.3328.36 కోట్లు రైతులకు చెల్లించలేదు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే చెల్లిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. పౌర సరఫరాల సంస్థకు చెందిన ఓపీఎంఎస్ సాఫ్ట్వేర్ పోర్టల్లో ధాన్యం కొనుగోళ్ల వివరాలు నమోదు చేశాకే రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయి. ఇంకా తెలంగాణలో 19 లక్ష మె.ట.పైగా వివరాల నమోదు చేయాల్సి ఉంది.సివిల్ సప్లయ్ సన్నాలకు చెల్లించాల్సిన బోనస్ బకాయిలు ఖరీఫ్‌కు చెందినవి రూ.250 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. రబీ సీజన్ సన్నాలకు సంబంధించి రూ.767కోట్ల బోనస్ చెల్లింపులు ఇంకా చేపట్టలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రా ల్లో కనీస వసతులు లేక వడదెబ్బతో ధాన్యం రాశులపైనే రైతులు ప్రాణాలు వదులుతున్నా రని, ఇవి ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగిన హత్యలేనని, రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని హరీష్ డిమాండ్ చేశారు. చనిపోయిన రైతు కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ బిఆర్ఎస్ డిమాండ్ చేస్తే రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని బిజెపి డిమాండ్ చేస్తున్నది.

# మబ్బులు ముసురుతున్నా రైతుకు వెతలే!

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

'నాదని భూమిని నమ్మేవాడికి నాగలిపట్టి దున్నేవాడికి ఉన్నది ఎంతో సంతృప్తి ఉందిరా సుఖ సంపత్తి' -1971లో వచ్చిన రైతుబిడ్డ సినిమాలో కొసరాజు రాసిన పాటకు భిన్నంగా ప్రపంచీకరణతో వచ్చిన మార్పులతో రైతుబతుకు తల్లకిందై 'అన్నదాత జీవితమల్లా అశాంతేరా' అని పాడుకొనేలా తయారైంది. ప్రకృతి ప్రకోపంతో ఓవైపు తెలంగాణ రైతు తల్లడిల్లుతుంటే మరోపై ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులు తాలు, తరుగు, చేట, సడెం అంటూ కొల్లగొడుతున్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో జెట్టి రాజు అనే రైతుక్వింటాకు 10కిలోల తరుగుతీస్తున్నారని ఆత్మహత్య చేసుకున్నారు. ముగిసిన వ్యవసాయ సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్‌లు కలిపి రైతుల నుంచి రూ.6283 కోట్లు మార్కెట్‌లో దళారులు దోచుకున్నారు. రబీ సీజన్‌లోనే ఇప్పటి వరకు 13లక్షల టన్నుల ధాన్యం తరుగు, తాలు రూపంలో దళారుల గిడ్డంగుల్లోకి చేరుతోన్నది. టన్ను ధాన్యానికి 22వేల చొప్పున ధర కడితే సుమారు రూ.2860 కోట్లు. ఈ సీజన్ రైతు కష్టాన్ని దోచుకున్నారు. ఖరీఫ్,రబీ సీజన్‌లో 281లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి తెలంగాణలో జరిగింది. యాసంగి సీజన్‌లోనే 127లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కాగా అందులో 70.13 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు విక్రయానికి వస్తాయని అంచనా వేశారు. శుక్రవారం నాటికి 44.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 40కిలోల గన్నీ బ్యాగు 850 గ్రాముల బరువు వుంటుంది. ధాన్యం తూకం వేసేప్పుడు 40.850 గ్రాములు మాత్రమే తూకం వేయాలి. కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తాలు, తేమ అంటూ పేచిపెడుతూ నాలుగున్నర కిలోలు అధికంగా తూకం వేస్తున్నారు. క్వింటాల్‌కు పది కిలోలు తరుగు దళారుల జేబుల్లో నింపుకొంటుంటే రైతు కళ్లలో కన్నీళ్లు నింపుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ధాన్యం సేకరణలో కూడా జాప్యం జరుగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఇద్దరు మహిళా రైతులతో పాటు పదకొండు మంది రైతులు ఎండదెబ్బతో మృతి చెందారు. ఒక రైతు తాను అమ్మకాని తీసుకొచ్చిన వరిధాన్యం కుప్పపైనే మృతి చెందిన హృదయవిదారకమైన దృశ్యం ఈ రబీసీజన్‌లో ఆవిష్కృతమైంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని కుమ్మరికుంట్లకు చెందిన ఎండీ యాకూబ్ 38 రోజుల క్రితం వరి కోసి గ్రామంలోని ప్రాథమిక సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు పోశాడు. పూర్తిస్థాయిలో ఆరబెట్టిన తరువాత తేమశాతం వచ్చినా తన వడ్లు కాంటాలు పెట్టకుండా తాత్సారం చేస్తుండటంతో సోమవారం ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యా



యత్నం చేశాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్మడానికి అన్నదాతలు ఆపసోపాలు పడుతున్నారు.సాయంత్రం ఆకాశం మేఘావృతం వుతుండటంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ల కొరత ఉండటంతో ధాన్యం తడిసిపోతుందని అన్నదాత ఆందోళన చెందుతున్నారు. దాదాపు 60 శాతం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు దుబాటులో లేవు. కేంద్రాలకు ఊహించిన దానికంటే ఎక్కువ ధాన్యం రావడంతో జాప్యం భగుతోంది. దీనికితోడు తేమ పేరుతో కేంద్రాల నిర్వాహకులు అధిక తూకం వేస్తుండటంతో కర్షకులు నష్టపోతున్నారు. తెలంగాణలో ఆర్థిక సంక్షోభం పెరిగిపోతుండటంతో అనంతకోటి దరిద్రాలకు శతకోటి ఉపాయాలు అన్నట్లుధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దొంగలు కూడా పెరిగిపోతున్నారు. రాళ్లతో రైతులపై దాడులు చేసి ధాన్యం ఎత్తుకుపోయే ముఠా కూడా ఇటీవల తయారైంది. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొందరు తమ అక్రమార్జనకు అనువుగా మలచుకుంటున్నారు. అరికట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించటంతో అన్నదాతలు నిలువు దోపిడీకి గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు వర్షానికి తడవకుండా కాపాడుకోవడానికి వారు నానా తంటాలు పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కుటుంబ సభ్యులందరూ శ్రమిస్తున్నారు. తెలంగాణలో యాసంగిలో 54.89లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 8381ఇందిరా క్రాంతి, పీఏసీఎస్. మార్కెట్యార్డు, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దొడ్డురకం ధాన్యం క్వింటాలుకు రూ.2,320,సన్నరకానికి రూ.2,320, బోనస్ రూ.500లను ప్రభుత్వం ప్రకటించింది. వరికోతలు పూర్తిచేసి నెలరోజులు గడిచింది. 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రబీలో పంట దిగుబడిగా వస్తుందనీ అంచనా వేయగా 100లక్షల మెట్రిక్ టన్నులలోపే దిగుబడి అయింది 70లక్షల మె.ట ధాన్యం కొంటామనీ ప్రభుత్వం ప్రకటించినా కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు లేక తేమ యంత్రాలు పనిచేయక అకాల వర్షంతో కొనుగోళ్ల జాప్యం చేయడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. తూకాల్లో జాప్యం, లారీల కొరత రైతులకు తీవ్ర మానసిక ఇబ్బందిగా మారింది. అకాల వర్షాలతో పలుకొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దవుతోంది. భారీ ఈదురుగాలు లకు టార్పాలిన్లు ఎగిరిపోతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో దోపిడి మాత్రం ఆగడంలేదు. తుంగతుర్తి మండలంలోని కేంద్రాల నిర్వాహకులు కొందరు రైతుల నుంచి వంద బస్తాలకు ఒక డబ్బా, ఆపైన బస్తాలకు బస్తా వడ్లు వసూలు చేస్తున్నారు. తామేమీ తక్కువ కాదన్నట్లు హమాలీలు కూడా అదనంగా వడ్లుకాదంటే నగదు వసూలు చేస్తున్నారు.వాస్తవానికి ధాన్యం బస్తా 41కిలోలు తూకం వేయాల్సి ఉండగా 41,200 కిలోలు తూకం వేస్తున్నారు. ఈ లెక్కన క్వింటాకు అరకిలో దగాచేస్తున్నారు. దీనికితోడు లారీ డ్రైవర్ మామూలు పేరుతో బస్తా ఒక్కంటికి రూ.2చొప్పున వసూలు చేస్తున్నారు. నిర్వాహకులు ఇప్పటికే ఒక్కో కేంద్రం నుంచి 30 క్వింటాళ్ల వరకు రైతుల పేరునలారీల్లో తరలించినట్లు తెలుస్తోంది. కొనుగోళ్లు పూర్తయ్యే నాటికి నిర్వాహకులు, హమాలీలు కలిసి ఇంకెంత సమకూర్చుకుంటారోనని రైతులు వాపోతున్నారు.ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, నేలకొండపల్లి, వైరా, తల్లాడ, ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, వేంసూర్ మండలాల్లో నిజామాబాద్ జిల్లా లోని ధర్పల్లి.ఇందల్వాయి, నందిపేట,రెంజల్ మండలాల్లో రైతుల నుంచి లారీ డ్రైవర్లు డబ్బులు వసూలు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో లింగంపల్లి, నిజాంసాగర్ తదితర మండలాల్లోనూ ఇదే సమస్య. మహబూబా బాద్ జిల్లాలోని పెద్దవంగర, నర్సింహుల పేట, ఇనుగుర్తి మండలాల్లోని కొన్ని సహకార సంఘాల కొనుగోలు కేంద్రాలు, మరికొన్ని ఐకేపీ కేంద్రాల వద్ద ఎంతో కొంత ఇవ్వకపోతే ధాన్యం తరలించడం లేదని రైతులు వాపోతున్నారు.వరంగల్ జిల్లాలో బస్తాకు ఇంత అని కాకుండా ధాన్యం అమ్మిన రైతు నుంచి రూ.300వసూలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయలేని పరిస్థితుల్లో డబ్బులు ఇవ్వక తప్పటంలేదని రైతులు వాపోతున్నారు. తూకం వేసిన ధాన్యం మిల్లుకు చేరేవరకు వారం పదిరోజుల అవుతుండటంతో ఎండిపోయి బరువు తగ్గుతోందని బరువుతగ్గిందని కోత పెడుతున్నారని రైతుల అంటున్నారు. లారీ డ్రైవరు కూడా బస్తాకు రూ.2 చొప్పున ఎన్ని బస్తాలుతెస్తే అన్ని రూపాయలు ముడుపులు చెల్లించుకుంటున్నారు రైతులు. కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్న ఈక్రమంలో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిల్లు వద్ద క్వింటాకు రూ.5 ఇస్తుంటే కొనుగోలు కేంద్రం వద్దక్వింటా లారీలోకి ఎక్కిస్తే రూ.14నుంచి రూ.15 ఇస్తుంటారు. దీంతో హమాలీలు.. పక్క జిల్లాల్లో కొనుగోళ్ల వద్దకు వెళ్తున్నారు. దీంతో లారీల్లోంచి ధాన్యం మిల్లుల వద్ద ఆన్ లోడింగ్ ఆలస్యమవుతోంది. ఇది సదరు మిల్లరు ట్రక్ తయారీపై పడుతోంది. కాంటా వేశాక మిల్లుకు తరలించటంలో ఆలస్యం ఆన్లోడింగ్లో జాప్యంతో వడ్లు ఎండిపోతున్నాయి. కాంటాలు వేసిన చోట తూకానికి.. మిల్లరు ఇచ్చే ట్రక్లో తూకానికి వ్యత్యాసాలుంటున్నాయి. దీంతో వివాదాలు తలెత్తుతున్నాయి. తాము అమ్మిన సరకు తక్కువగా చూపారంటూ రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇప్పటికైనా రైతు క్షేమం కోసం ప్రభుత్వం సమాజం కదలిరావాలి. ●

# మళ్లీ పేర్ల కయ్యం!

అరుణాచల్ ప్రదేశ్

**ఎ.వి.వి ప్రసాద్**

గిల్లికజ్జాలు పెట్టుకోవడంలో పాకిస్థాన్ కంటె రెండాకులుఎక్కువే చదివింది చైనా. కానీ పాక్ మాదిరిగా ఏ ఉగ్రవాదం మీదో ఆధారపడి ప్రత్యక్ష దాడికిప్రయత్నించదు. మూలాల నుంచి మొక్కను పెకలించే దౌత్యవివాదాల ద్వారా ఆక్రమణలకు ప్రయత్నిస్తూంటుంది. కాశ్మీర్ విషయంలో పాక్ తగాదా పడుతున్నట్లే, అరుణాచల్ ప్రదేశ్ విషయంలో చైనా మనమీద పెత్తనం చెలాయించాలని చూస్తోంది. ఈ తగాదా ఇప్పటిది కాకపోయినా, అప్పుడప్పుడు గుర్తుచేస్తూ భారత్‌కు శిరోభారం పెంచుతోంది. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత పాక్‌లోని కొన్ని ఉగ్రశిబిరాలపై మన సైన్యం దాడులు జరపడంతో యుద్ధం దిశగా పరిస్థితులు పరిణమిస్తున్న వేళ.. చైనా కూడా భారత్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నాలు మరోసారి మొదలు పెట్టింది. దానిలో ఒక భాగమే అరుణాచల్‌లోని కొన్ని ప్రాంతాలకు పేర్లు మార్చి చైనా తాను భావించిన పేర్లు పెట్టడం. పొరిగింటిలోని వారి పిల్లలకు పేర్లుమార్చాలని ఎవరైనా అనుకుంటారా! అనుకుంటే మాత్రం మార్చగలరా? ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేక కాదు.. కానీ ఏదో విధంగా కయ్యానికి కాలు దువ్వాలన్నదే చైనా సంకల్పం. దాదాపు పదేళ్లుగా ఈ ' పేర్ల మార్పిడి' ప్రక్రియతో చైనా వృధా ప్రయత్నం చేస్తూనే ఉంది. భారత్ ఎన్ని రకాలుగా నిరసనలు ప్రకటించినా, దౌత్య పరంగా ఎన్ని చర్చలు జరిపినా ' అబ్బే! అదేం లేదు.. ఊరికేనే' అంటూనే అరుణాచల్ పై అధికారం చెలాయించడానికి చైనా ఏదో ఒక కుట్ర పన్నుతూనే ఉంది. అరుణాచల్ తమదే అని చెప్తూ రాష్ట్రం పేరునే 'జంగ్నాన్' గా గతంలోనే మార్చేసింది.అనేక ప్రాంతాలు,గ్రామల పేర్లను ఇప్పటికి అయిదు మార్లు మార్పులు చేసి సొంత పేర్లతో పిలుస్తోంది. అరుణాచల్‌ను చైనాలో అంతర్భాగంగా భావిస్తూ తానుమార్చిన పేర్లతో మ్యాప్‌ను కూడా తయారు చేసి ప్రపంచానికి చూపుతోంది. ఈ దుందుడుకు చర్యలన్నిటిని భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ 'అరుణాచల్ భారత్‌లో అంతర్భాగం. చైనా వాదాన్ని తిరస్కరిస్తున్నాం' అంటూ ప్రపంచ వేదికలపై ఎన్నోమార్లు ప్రకటించింది కూడా. అయినా చైనా వక్రబుద్ధిలో మార్పు రాకపోవడమే విచిత్రం. ఒక వంక పాక్‌తో తాజా ఉద్రిక్తతలు పూర్తిగా చల్లారకుండానే గతవారం చైనా కొత్త మంట పెట్టింది. టిబెట్‌కు దక్షిణ ప్రాంతంగా అరుణాచల్‌ను చైనా భావిస్తోంది కానీ భారత్ అంతర్భాగంగా మాత్రం గుర్తించడం లేదు. ఇది ప్రాదేశిక హద్దులు తెలియకపోవడం వల్ల కాదు, చైనా దురహంకార, దురాక్రమణ ధోరణి వల్లనే. భారత్ చుట్టూ ఇప్పటికే అనేక రకాలుగా, చాలా వ్యూహాత్మకంగా చైనా దురాక్రమణలకు పాల్పడుతున్నట్లే కనిపిస్తుంది. భారత్ చుట్టూ సముద్ర తీర ప్రాంతాల్లో వ్యూహాత్మకంగా తన ప్రాబల్యం పెంచుకుంటోంది. పాక్‌లో గ్వాదర్ పోర్ట్, శ్రీలంకలో హంబంటోటా పోర్ట్,బంగ్లాదేశ్‌లో చిట్టగాంగ్ పోర్ట్, మయన్మార్‌లో కయాక్ప్యూ పోర్ట్‌లపై పెత్తనం సాగిస్తూతద్వారా భారత్‌కు తరచుగా ఇబ్బందులను సృష్టించే యత్నాలు చేస్తోంది. చైనా హ్యాకర్ల ద్వారా భారత్‌లోని కీలక సంస్థలపై సైబర్‌దాడులు కూడా పెంచుతోంది. ఈ చర్యలన్నీ భారత్‌కు నిరంతరం నిద్రపట్టకుండా చేయాలనే. కొద్ది రోజులుగా చైనా గూఢచారి నౌక ఒకటి భారత్ సముద్ర జలాల్లో సంచరించడం కూడా అటువంటిదే. భారతీయ నౌకల కదలికలు, నిఘా,ప్రతిస్పందనసామర్థ్యం, జలాంతర్గాముల కదలికలను హైడ్రోగ్రాఫిక్ పరికరాల సాయంతో చైనా నౌక పసిగడుతోందని నిపుణులు అంటున్నారు.'ఆపరేషన్ సిందూర్' తర్వాత మన నౌకాదళం అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రం ఉత్తరతీరం వైపు చాలా అప్రమత్తంగా ఉంటోంది. ఎందుకంటే పాక్‌తో తాజాగా జరిగిన పోరు తాటాకు చప్పుళ్ల వంటిది కాదు. మరికొంచెం ముందుకు వెళ్లి ఉంటే,రెండు దేశాలకు జరిగే నష్టాన్ని అంచనా వేయలేం.కానీ బెడద పాక్‌తో తప్పినంత మాత్రాన సరిపోదు కదా! అదే సమయంలో చైనా కవ్వింపులు మొదలయ్యాయి. చైనా గూఢచారి నౌకలో అత్యంత అధునాతన సెన్సర్లుకూడా ఉన్నాయనిఅంటున్నారు. వాటివల్ల మన ఐఎన్ఎస్ విక్రాంత్ సహా, యుద్ధ నౌకల కదలికలను చైనా పసిగట్టి ఏదైనా ముప్పు తేవడానికి ప్రయత్నించవచ్చు. బెల్ట్అండ్ రోడ్ ఇనిషియేటివ్ కింద చైనా పాక్ ఎకనమిక్ కారిడార్ నిర్మాణం జరుగుతోంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ గుండా సీపెక్ ప్రాజెక్టును నిర్మించడంపై భారత్ మొదటి నుంచి అభ్యంతరం చెబుతూనే ఉంది. అయినా చైనా ఈ ప్రాజెక్టును కొనసాగిస్తూనే ఉంది. ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే పాక్‌లో రాజకీయంగా, ఆర్థికంగా స్థిరమైన పరిస్థితులుండాలి. చైనా నిఘా పెట్టడానికి ఇదికూడా ఒక కారణం కావొచ్చని తెలుస్తోంది. ఇలా ఏదో ఒక రకంగా భారత్‌కు 'స్థిమితం' లేకుండా చేయడమే చైనా వ్యూహం. డ్రాగన్ దేశం ఎప్పుడు ఏం చేస్తుందోననే అంశంపై భారత్ తన దృష్టిని కేంద్రీకరించవలసిరావడంతో ప్రాధమ్యాలు కూడా మారిపోతుంటాయి. పాక్ వైపు కంటె చైనా వైపు ఎక్కువ దృష్టి పెట్టిన సమయంలో దాయాది దేశం మళ్లీ ఏ కుట్రకైనా పాల్పడవచ్చు. పేర్ల మార్పు వ్యూహం కూడా అటువంటిదే. అరుణాచల్‌లోని 27 ప్రాంతాలకు తాజాగా చైనా తాననుకున్న పేర్లను పెట్టింది. చైనా ఇలాపేర్లుమార్చడం ఇది ఐదోసారి. ఇంతకు ముందు 2017, 21, 23, 24 లో నాలుగుసార్లు చాలా గ్రామాలకు కొత్త పేర్లుపెట్టింది. దాదాపు 90 ప్రాంతాలు, గ్రామాల పేర్లను ఇప్పటిదాకా మార్చేసింది. గత సంవత్సరం నాలుగో విడతలో 30 ప్రాంతాల పేర్లు మార్చినప్పుడు భారత్ చాలా తీవ్రంగానే ప్రతిస్పందించింది.అయినా వక్రబుద్ధిమార్చుకోని చైనా గత బుధవారం (14,మే ) మరో 27 ప్రాంతాల పేర్లు మార్చినట్లు ప్రకటించింది. ఇది పైకి చిన్నదిగా కనిపించినా చాలా ప్రమాదకరమైన అంశమే. పాక్ చేసే ప్రత్యక్ష దాడి కంటే ఎక్కువ ప్రమాదకరం. భారత్ తగిన విధంగా వ్యూహం రూపొందించకపోతే ముందు ముందు మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ●




డ్రాగన్

# మరో కొత్త 'సుంకం'!

అమెరికా

**గన్ని మోహన్**

ప్రపంచంలో ఎన్నడూ వినని, చూడని కొత్త చట్టాలు, బిల్లులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచ దేశాలు చూస్తున్నాయి. డోజ్ వ్యవస్థను స్థాపించి ప్రభుత్వ ఉద్యోగుల్లో కోత విధించడం, ఖజానాకు భారం అనిపిస్తే చాలు ఎలాంటి చర్యనైనా చేపట్టేందుకు ట్రంప్ వెనకాడటంలేదు. ఈక్రమంలో దేశ అత్యున్నత న్యాయవ్యవస్థ నుంచి చీవాట్లు ఎదురవుతున్నా కూడా ట్రంప్ తనదారిలో తాను వెళ్లడం అలవాటుగా మార్చేసుకున్నారు. మనం మళ్లీగ్రేట్ అమెరికాను నిర్మిద్దాం, అమెరికా ఫస్ట్, అమెరికన్ ఫస్ట్‌నినాదమే లక్ష్యంగా వెళుతున్న ట్రంప్‌ముందు వలసదారులపై వేటువేసారు. ఫలితంగాసుమారు ఆరులక్షలమందికిపైగా స్వదేశాలకు పలాయనం చిత్తగించారు. ఉక్రెయిన్ యుద్ధం ముగించేస్తామంటూ పుతిన్‌తో తానుమాట్లాడితే తప్ప సంధి కుదరదని చెపుతున్న ట్రంప్ పాకిస్థాన్ భారత్‌ల మధ్య నేనే మధ్యవర్తిత్వం చేసామని, ఒత్తిడి చేయడంతో రెండుదేశాలు అంగీకరించాయని అందువల్లనే అతిపెద్ద అణ్వస్త్రదాడి ముప్పు తప్పిందంటూ విదేశాల్లో సైతం ఆయన చెప్పుకుంటున్నారు. ఈ విధానాల్లో ఎలాంటి మార్పు లేకపోయినా అదేదారి అదే పద్ధతి ఎంతమాత్రం తీరుమార్చుకోని ట్రంప్‌ఇప్పుడు అమెరికా ఖజానా పరిపుష్టం చేసే పనిలో పడినట్లుంది. గోల్డ్‌కార్డ్ వీసానుప్రవేశపెట్టి 10 మిలియన్ డాలర్లు రుసుం విధించారు.తనకంటూ సొంతంగా ఒకకొత్త క్రిప్టో కరెన్సీని ప్రవేశపెట్టారు. అక్కడితో ఆగకుండా ఇప్పుడు ఖజానా సమృద్ధిగా ఉండాలంటే కొంత మేర కఠిన కార్యాచరణ తప్పదంటూ ఇప్పుడు ట్రంప్ వలసదారులపై మరో భారం మోపారు. అమెరికాలో నివసిస్తున్న విదేశీయులంతా తమ స్వదేశానికి సొమ్ములు పంపించుకుంటేఐదుశాతం సుంకం విధిగా చెల్లించాలి. ఇందుకోసంఅమెరికా ఉభయసభల్లో ప్రత్యేక బిల్లును తెస్తోంది. ఈనెల 12వ తేదీనే ప్రతినిధుల సభలో ఈబిల్లు ప్రతిపాదించారు. బిల్లు అమలుకు వస్తే అంతర్జాతీయ నగదు బదిలీలపై ఐదుశాతం పన్ను విధిస్తారు. అలాగే ప్రామాణిక తగ్గింపును పెంచడం, చిన్న పిల్లలపై పన్ను క్రెడిట్ 2028 వరకూ, 2500 డాలర్లకు పెంచడం ద్వారా 2017 పన్నుకోతలు, ఉద్యోగాల చట్టాన్ని శాశ్వతం చేయాలనే లక్ష్యంతోనే ఈ బిల్లును ప్రవేశపెట్టారు.రెండోసారి అధికారంలోకి వచ్చిన రిపబ్లికన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బాహాటంగానే ఈ చట్టాన్ని 'గ్రేట్' అని వర్ణించారు. ఈనెల 26వ తేదీ మెమమోరియల్ డే ఉన్నందున ఈలోపే ఈ బిల్లు ఆమోదింప చేసుకోవాలని ట్రంప్ యోచనచేస్తుండటం చూస్తే అమెరికాలో నివసించే ప్రతి విదేశీయుడు తన కుటుంబానికి సొమ్ములు పంపిస్తే ఐదుశాతం పన్నులు రూపంలో చెల్లించుకోవాలి. కష్టపడి సంపాదించుకున్న సొమ్ములపై మళ్లీ పన్నులేమిటని ఇప్పటికే ప్రవాసులంతా పెదవి విరుస్తున్నా ట్రంప్ మాత్రం ట్రెజరీ పరిపుష్టం కావాలంటే పన్నులుతప్ప వన్న భావనతోనే ఉన్నారు. ఒక్క భారత్‌కే విదేశాలనుంచి ఏటా 8300 కోట్ల డాలర్లు జమలు వస్తున్నాయి. అందులో అత్యధికభాగం అమెరికానుంచే కావడం విశేషం. ఇపుడు కొత్త బిల్లు అమలుకు వస్తే ప్రతి లక్ష రూపాయలకు ఎన్నారైలు ఐదువేల రూపాయలు పన్ను రూపంలో చెల్లించుకోవాలి. భారతీయ రిజర్వు బ్యాంకు నివేదికల ప్రకారం2011 సంవత్సరంలో 55.6బిలియన్ డాలర్ల జమలు భారత్‌కు వచ్చేవి. అదే 2024 నాటికి 118.7 బిలియన్ డాలర్లకు పెరిగాయి.అంటే గత ఏడాది భారత్ అందుకున్న మొత్తం జమలలో అమెరికా నుంచే అత్యధికంగా ఉన్నాయి.అంటే27.7శాతం వాటాతోఉంది. అంటే మొత్తం 32.9 బిలియన్ డాలర్ల జమలకు ఈ 27.7శాతం వాటా సమానంగా ఉంటుంది. అంటే ఐదుశాతం చొప్పున పన్నులు విధిస్తే సుమారు 1.64 బిలియన్ డాలర్లు ప్రవాసులంతా చెల్లించుకోవాలి.గడచిన రెండు దశాబ్దాల నుంచి భారత్ అత్యధిక విదేశీ జమలు రాబట్టుకునే దేశాల్లో మొదటిదిగా ఉంది. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం ప్రపంచ స్థాయి చెల్లింపుల్లో భారత్‌కు అత్యధిక వాటా ఉంది. 14శాతం ఉన్నట్లు అంచనావేసింది. గత ఏడాది ఈ జమలు భారత్‌కు 129 బిలియన్ డాలర్లవరకూ వచ్చాయి. ఆతర్వాత మెక్సికో 68 బిలియన్ డాలర్లు, చైనా 48 బిలియన్‌డాలర్లు, ఫలిప్పీన్స్ 40 బిలియన్ డాలర్లు, పాకిస్థాన్‌కు 33 బిలియన్ డాలర్లు విదేశీ జమలరూపంలో అందాయి. ట్రంప్ ప్రతిపాదించిన ఐదుశాతం సుంకం అమలుకువస్తే ఈ దేశాలకు వెళ్లే జమలన్నింటిపైనా అదనపు భారం పడుతుంది. నిజానికి అమెరికా అంటేనే వలసదార్ల రాజ్యం అన్న పేరుంది. ప్రపంచంలోనే అత్యధిక వలసజనాభా ఉన్నదేశంగా అమెరికా నిలిచింది. ప్రపంచదేశాల నుంచి 53.3 మిలియన్ల మంది నివాసితులు అమెరికాలో ఉపాధి పొందేందుకు వచ్చినవారు, స్థిరనివాసాలు ఏర్పాటుచేసుకుని జీవిస్తున్నవారున్నారు.మొత్తం అమెరికా జనాభాలో వీరు 15.8 శాతం వాటాతోఉన్నారు. అమెరికాలో విదేశీ సంతతి జనాభా 47.78 మిలియన్లకు చేరిందని అమెరికా లెక్కలే చెపుతున్నాయి.అంతకుముందు సం॥ కంటే 1.6 మిలియన్లు పెరిగారు. ఇక ఇతరదేశాలకంటే భారత్‌నుంచి అమెరికాకు వెళ్లి నివసిస్తున్న పౌరులు 5.4మిలియన్లమంది ఉన్నారు. అమెరికా జనాభాలో వీరివాటా 1.6 శాతంగా ఉంది.ట్రంప్ ప్రతిపాదించిన ఐదుశాతం సుంకం అమలుకు వస్తే ప్రతి లక్షకు ఐదువేలు భారత కరెన్సీలో ఎన్నారైలు చెల్లించుకోవాలి.ఈ రూపేణా ట్రంప్ అమెరికా ట్రెజరీని పరిపుష్టం చేయాలన్న బలమైన లక్ష్యంతోఉన్నారు. ప్రవాసుల కారణంగానే అమెరికన్లకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్న భావనఅక్కడి అమెరికన్లలో నెలకొన్న తరుణంలోట్రంప్ విధానాలువారికి ఎంతో ఆమోదయోగ్యంగా కనిపిస్తున్నాయి. కానీ ట్రంప్ వలసదారులపై మరిన్నిఅస్త్రాలు ఎక్కుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్లిష్టకాలంలో భారత్ తనకున్న సంబంధాలను అమెరికావద్ద ప్రస్తావిస్తేతప్ప ప్రవాసులకు ఎదురయ్యే ముప్పు నుంచి తప్పుకోలేని పరిస్థితి ఎదురవుతుంది. ●



ట్రంప్

# తుర్కియే, అజర్‌బైజాన్‌ల పర్యాటకం కుదేలు



యేచన్ చంద్రశేఖర్

పాకిస్థాన్ ప్రేరేపిత లష్కర్ ఏ తోయిషిబా అనుబంధ సంస్థగా చెప్పబడుతున్నది రెజిస్టెంట్ ఫ్రంట్ పహల్గామ్‌లో జరిపిన ఉగ్రదాడిలో 26 మంది అమాయక పర్యాటకుల ప్రాణాలు పొట్టనబెట్టుకున్న తరువాత భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్" నేపథ్యంలో తుర్కియే అజర్‌బైజాన్‌లు పాకిస్థాన్‌కు బాహాటంగా మద్దతు ప్రకటించాయి. అంతేకాదు, తుర్కియేఅందించిన మూడు నుండి నాలుగు వందల డ్రోన్‌లను భారతదేశంలోని సైనిక పౌర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ ప్రయోగించింది. లడఖ్‌లోని లేహ్ నుండి గుజరాత్‌లోని సర్ క్రీక్‌వరకు మొత్తం పశ్చిమ సరిహద్దులో 36ప్రదేశాలలో భారత గగనతలంలోకి చొరబడి డ్రోన్‌లను ప్రయోగించారని భారత ప్రభుత్వం ప్రత్యేక పత్రికా సమావేశంలో తెలిపింది. పాకిస్థాన్ పంపిన దాదాపు 400 డ్రోన్లలో, చాలా వాటిని భారత సైన్యం సమర్థవంతంగా కూల్చివేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఫోరెన్సిక్ నిపుణుల ప్రాథమిక అధ్యయనం ప్రకారం ఇవి తుర్కియేకి చెందిన 'సిస్ గార్డ్ సోంగర్" డ్రోన్లుగా తేలింది. ఇటీవలి ఘర్షణలలో అజర్‌బైజాన్ పాకిస్థాన్‌కు సైనిక సహాయం అందించినట్లు ప్రత్యక్ష ఆధారాలు లేనప్పటికీ, దౌత్యపరంగా కాశ్మీర్ సమస్యపై ఆ దేశం వైఖరిని బహిరంగంగా సమర్థించింది.భారతదేశం దాడికి పూనుకోక ముందే తుర్కియే వైమానిక దళం విమానం నగరంలో దిగిన కొద్ది రోజులకే తుర్కియే నావికాదళం యుద్ధనౌక కరాచీ ఓడరేవుకు చేరుకుంది. ఇది భారతదేశానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. తుర్కియే రాష్ట్ర ప్రసారకర్త టిఆర్‌టి వరల్డ్ భారత వ్యతిరేక కథనాలను విస్తృతం చేస్తోందని, ముఖ్యంగా కాశ్మీర్ పరిస్థితికి సంబంధించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆరోపిస్తూ మే 14, 2025న టిఆర్‌టి వరల్డ్ అధికారిక ఎక్స్ ఖాతాను భారత దేశం బ్లాక్ చేసింది. ఆగస్టు 2019లో ఆర్టికల్ 370 రద్దు సమయంలో తరువాత కూడా అంతర్జాతీయ వేదికలపై, ముఖ్యంగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్ పదే పదే కాశ్మీర్ సమస్యను లేవనెత్తిన విషయం మనకు తెలుసు. ఇదిలా ఉంటే, గత ఐదు సంవత్సరాలలో భారత్ తుర్కియే దేశాల మధ్య వాణిజ్యం గణనీయంగా వృద్ధి చెందడంతో పాటు 2022-23లో ద్వైపాక్షిక వాణిజ్యం 13.8 బిలియన్ డాలర్లకు చేరింది. భారత్ నుండి ఎగుమతులు 6.65 బిలియన్ డాలర్లకు తుర్కియే నుండి దిగుమతులు 3.78 బిలియన్ డాలర్లకు చేరుకున్న పరిస్థితులలో భారత్‌కు వ్యతిరేకంగా తుర్కియే పాకిస్థాన్‌తో అంటకాగడాన్ని భారతీయులు జీర్ణించుకోలేకపోయారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసే ప్రమాదముందని తుర్కియే విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొనడంతోపాటు పాకిస్థాన్‌కు సైనిక మద్దతు అందించడం, అజర్‌బైజాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ కూడా ఇస్లామాబాద్‌కు మద్దతుగా పాకిస్థాన్ ప్రజలతో సంఘీభావంగా ఉంటూ, అమాయక బాధితుల కుటుంబాలకు మేము సంతాపం తెలియజేస్తున్నాము,గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము" అని ఒక ప్రకటన విడుదల చేయడం భారతీయులను తీవ్ర అసహనానికి గురిచేసింది. భారతదేశం,పాకిస్థాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో వ్యాపారులు టర్కిష్ ఆపిల్‌లను బహిష్కరించడంతో తుర్కియేని నిషేధించాలనే ధోరణి ఊపందుకుంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌పాక్ మధ్య ఇటీవల తలెత్తిన ఉద్రిక్తతల నడుమ తుర్కియే పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు అందించిన నేపథ్యంలో, దేశవ్యాప్తంగా తుర్కియేని నిషేధించు" అన్న ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ 11.76 టన్నుల ఆపిల్‌లను దిగుమతి చేసుకుంది. ఇందులో పూణే మార్కెట్‌కు రూ.1,000 నుండి 1,200 కోట్ల వరకు దిగుమతి అయ్యాయి. కాగా తుర్కియే పాకిస్థాన్‌కు మద్దతు అందించిన నేపథ్యంలో పూణేలో వ్యాపారులు తుర్కియే ఆపిల్‌లను బహిష్కరించడం ద్వారా నిర్ణయాత్మక చర్య తీసుకు




న్నారు. దీంతో స్థానిక మార్కెట్ల నుండి తుర్కియే ఆపిల్‌లు ఒక్కసారిగా అదృశ్యమయ్యాయి. కేవలం వ్యాపారులే కాదు పౌరులు కూడా ఈ ఉద్యమంలో చేరడం గమనార్హం. ఈ బహిష్కరణ నగర పండ్ల మార్కెట్‌ను గణనీయంగా ప్రభావితం చేస్తుందని భావిస్తున్నారు. అంతేకాదు, పూణేలోని వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్ కమిటీ మార్కెట్‌లో ఆపిల్ వ్యాపారి సుయోగ్ జెండే ఇటీవలి రోజుల్లో తుర్కియే ఆపిల్‌లకు డిమాండ్ గణనీయంగా తగ్గిందని ధృవీకరించారు. తుర్కియే దిగుమతులకు బదులుగా హిమాచల్,ఉత్తరాఖండ్, ఇరాన్ మరియు ఇతర ప్రాంతాల నుండి ఉత్పత్తులను స్వీకరిస్తున్నామని ఈ నిర్ణయం తమ దేశభక్తికి నిదర్శనం అని ఆయన అన్నారు. స్థానిక వినియోగదారులు కూడా ఈ బహిష్కరణకు మద్దతు తెలుపుతూ మన దగ్గర ఎంచుకోవడానికి చాలా ఆపిల్ రకాలు ఉండగా మన శత్రుదేశానికి మద్దతు అందించే దేశం నుండి మనం ఎందుకు కొనుగోలు చేయాలి?" అని అంటున్నారు. పూణేతో పాటు ముంబై ఇతర ప్రధాన నగరాల్లోని వ్యాపారులు తుర్కియే ఆపిల్స్ నిల్వచేయడం మానేసి, వాటి స్థానంలో ఇరాన్, వాషింగ్టన్, న్యూజిలాండ్ సహా హిమాచల్‌ఉత్తరాఖండ్ వంటి భారతీయ రాష్ట్రాల నుండి ఉత్పత్తులను సేకరిస్తున్నారని టైమ్ ఆఫ్ ఇండియా నివేదిక ఏజెన్సీలను ఉటంకిస్తూతెలిపింది. తుర్కియే ఆపిల్స్ బహిష్కరణ ముమ్మరం కావడంతో, రిటైల్ ఆపిల్ ధరలు కిలోకు రూ. 20నుండి30 దాకా పెరిగినట్లు మరియు 10 కిలోల కార్టన్ల హోల్‌సేల్ ధరలు రూ. 200 నుండి 300 వరకు పెరిగినట్లు తెలుస్తోంది. తుర్కియేను బహిష్కరించండి" అనే హ్యాష్‌ట్యాగ్ తరహా పిలుపు కేవలం సామాజిక మాధ్యమాల ఆగ్రహానికి మాత్రమే పరిమితం కాలేదు. పూణేలోని పండ్ల మార్కెట్లతోపాటు ఇది ఉదయపూర్‌లోని పాలరాయి యార్డుల వరకు దావానలంలా వ్యాపించింది. భారతదేశ పాలరాయి కేంద్రమైన ఉదయపూర్ నుండి తుర్కియే దిగుమతుల పట్ల తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతోంది. ఉదయపూర్ మార్బుల్ ప్రాసెసర్స్ అసోసియేషన్, భారతదేశానికి అతిపెద్ద పాలరాయి సరఫరాదారు అయిన టర్కీ నుండి దిగుమతులను పూర్తిగా నిలిపివేయాలని పిలుపునిచ్చిందని ప్రముఖ వార్తా సంస్థ ఏఎన్ఐ నివేదించింది. తుర్కియే పాలరాయిపై నిషేధం కోరుతూ తాము ప్రధానమంత్రికి లేఖ రాసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సురానా ఏఎన్ఐకి తెలిపారు.ప్రతిసంవత్సరం భారతదేశం దిగుమతి చేసుకునే పాలరాయిలో దాదాపు 70శాతం అంటే రూ. 2,500 నుండి 3,000కోట్లకు పైగా విలువైన 14 నుండి 18 లక్షల టన్నుల పాలరాయిని తుర్కియే నుండే సరఫరా అవుతుందని మనలో ఎంతమందికి తెలుసు? ఇటీవలి సంవత్సరాలలో తుర్కియే అజర్‌బైజాన్ రాజధాని బాకుకు భారత పర్యాటకుల తాకిడి బాగా పెరిగింది. తుర్కియే సాంస్కృతిక పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రకారం, 2014లో 119,503 మంది భారతీయ పర్యాటకులు ఆ దేశాన్ని సందర్శించగా, గత సంవత్సరం దాదాపు 62.2మిలియన్ల విదేశీ పర్యాటకులు సందర్శించారని అందులో 3,30,000 మంది భారతీయులు అని,ఇది గత సంవత్సరంతో పోలిస్తే 20.7 శాతం అధికమని తెలిపింది. తమ దేశ పర్యాటకరంగ ఆదాయం 2024లో ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 61.1బిలియన్ డాలర్లకు చేరుకుందని, ఇది అంతకు ముందు సంవత్సరం కంటే 8.3శాతం అధికమని తుర్కియే పర్యాటక బోర్డుతెలిపింది. ఎకనామిక్ టైమ్స్ నివేదిక ప్రకారం, గత సంవత్సరం తుర్కియే సందర్శించిన భారతీయ సగటు సందర్శకుల ఖర్చు 972 డాలర్లుగా నమోదైంది. ఈ లెక్కన భారత పర్యాటకులు తుర్కియేని బహిష్కరిస్తే, ఆదేశానికి దాదాపు 291.6మిలియన్ డాలర్ల ప్రత్యక్ష నష్టంతో పాటు భారతీయ వివాహాలు, కార్పొరేట్ కార్యక్రమాలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను రద్దు చేసుకుంటే పరోక్షంగా మరింత ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. మరో పక్క, భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సైనిక చర్యను ఖండిస్తూ తుర్కియే అజర్‌బైజాన్ దేశాల విదేశాంగమంత్రిత్వ శాఖలు చేసిన ప్రకటనలను తప్పుబడుతూ, భారతదేశం నుండి తుర్కియే అజర్‌బైజాన్‌లకు ప్రయాణాన్ని బహిష్కరించాలని విస్తృతంగా ఆన్‌లైన్లో ప్రచారం చేపట్టగా అది ఆశించిన ప్రభావాన్ని చూపింది. దేశవ్యాప్తంగా వేలాది మంది తుర్కియే అజర్‌బైజాన్ దేశాలకు తమ ప్రయాణ ప్రణాళికలను రద్దుచేసుకోగా, టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫారమ్‌లు ట్రావెల్ ఆపరేటర్లు ఈ దేశాలకు బుకింగ్‌లను నిలిపివేశారు. ●

# గుజరాత్ ఎంఎన్‌రేగాలో భారీ స్కాం

## రూ.250 కోట్లమేర నిధుల మళ్లింపు

## మంత్రి కుమారుడు సహా నిందితుల అరెస్టు



**అహ్మదాబాద్, మే 17:** రూ.71 కోట్ల ఎంఎన్‌రేగా కుంభకోణం గుజరాత్ గ్రామీణాభివృద్ధి వ్యవస్థను కుదిపేసింది, రాష్ట్ర పంచాయతీ మరియు వ్యవసాయ మంత్రి బచు ఖాబాద్ కుమారుడు బల్వంత్ ఖాబాద్ సహా నిందితులను అరెస్టు చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పథకంలో భారీ అవకతవకలకు సంబంధించిన ఈ కుంభకోణం దాహోద్ జిల్లాలోని ధన్‌పూర్ మరియు దేవ్‌గఢ్ బరియా తాలూకాలలో బయటపడింది. అరెస్టును ధృవీకరిస్తూ, దాహోద్ డిప్యూటీ ఎస్పీ జగదీష్ భండారి వివరాలు తెలిపారు. ధన్‌పూర్ మరియు దేవ్‌గఢ్ బరియాలో ఎంఎన్‌రేగా కుంభకోణానికి సంబంధించి బల్వంత్ ఖాబాద్ మరియు అప్పటి తాలూకా అభివృద్ధి అధికారి (టిడిఒ) దర్శన్ పటేల్‌లను అరెస్టు చేశామన్నారు. ఈకేసులో మంత్రి చిన్న కుమారుడు కిరణ్ ఖాబాద్ పరారీలో ఉన్నాడు. ఈ కుంభకోణం మధ్యలో కేవలం కాగితాలపై ఉన్న కల్పిత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రోడ్లు, బండ్లు మరియు ఇతర ప్రజా పనుల యొక్క బాగా వ్యవస్థీకృత నెట్‌వర్క్ ఉంది. ఎంఎన్‌రేగా కింద గిరిజన ఉపాధి కోసం ఉద్దేశించిన నిధులను నకిలీ సర్టిఫికెట్లు మరియు నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా మళ్లించారని, ఆ డబ్బును మంత్రి కుమారులతో సంబంధం ఉన్న ఏజెన్సీలకు మళ్లించారని ఆరోపణలు ఉన్నాయి. దేవ్‌గఢ్ బరియా మరియు ధన్‌పూర్ తాలూకాలలో ప్రాజెక్టు అమలులో పెద్ద అవకతవకలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) డైరెక్టర్ బిఎంపటేల్ గుర్తించిఆడిట్‌కు ఆదేశించడంతో మోసం బయటపడింది, బల్వంత్ మరియు కిరణ్ ఖాబాద్ నడుపుతున్న రాజ్ కన్‌స్ట్రక్షన్ మరియు రాజ్ ట్రేడర్స్ అనే సంస్థలు ఈ మోసాలకు పాల్పడ్డాయి. వీరిద్దరూ ముందస్తు బెయిల్ కోరుతూ ముందస్తు ఆధారాలను పొందారు. 2021 మరియు 2025 మధ్య, కువా, రెధానా మరియు సిమామోయి వంటి గ్రామాలను పూర్తయిన ఎంఎన్‌రేగా ప్రాజెక్టుల లబ్ధిదారులుగా తప్పుగా గుర్తించారు. దేవ్‌గఢ్ బరియా నుండి 28 మంది మరియు ధన్‌పూర్ నుండి ఏడుగురు 35 మంది మెటీరియల్ సరఫరాదారులు స్థానిక అధికారుల సహాయంతో నకిలీబిల్లులు సృష్టించినట్లు అధికారులు కనుగొన్నారు. ఆడిట్‌లలో కనిపించని లాగ్‌లు, ఉనికిలో లేని పని ప్రదేశాలు మరియు విస్తృతమైన డాక్యుమెంట్ ఫోర్జరీ బయటపడింది. సుమారు రూ.160 కోట్ల మోసపూరిత క్లెయిమ్‌లు పరిశీలనలో ఉన్నాయి. మరింత లోతుగా ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఏర్పాటు చేయబడింది. ఇప్పటివరకు, దేవ్‌గఢ్ బరియాలో రూ.60.90 కోట్ల నకిలీ బిల్లులు మరియు ధన్‌పూర్‌లో రూ.10.10 కోట్ల నకిలీ బిల్లులను ట్రాక్ చేశారు. ప్రతిపక్ష నాయకుడు అమిత్ చావ్డా గతంలో ముఖ్యమంత్రికి రాసిన లేఖలో ఈ కుంభకోణం గురించి హెచ్చరించారు, ఈ మోసం దాదాపు రూ.250 కోట్లుగా అంచనా వేశారు. మంత్రి రాజీనామా చేయాలని మరియు రాష్ట్ర స్థాయిలో క్రిమినల్ దర్యాప్తును డిమాండ్ చేశారు. ఒత్తిడి పెరుగుతున్నప్పటికీ, మంత్రి బచు ఖాబాద్ మౌనంగా ఉన్నారు మరియు అధికార బిజెపి నుంచి ఎటువంటి అధికారిక స్పందన లేదు. ప్రతిపక్షాలు మరియు పౌర సమాజం నుండి తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. ఒక సాధారణ ఆడిట్‌గా ప్రారంభమైన ఆడిట్ గుజరాత్‌లో అతి పెద్ద సంక్షేమ కుంభకోణాలలో ఒకటిగా పేలిపోయింది, ఇది పాతుకుపోయిన అవినీతిని బహిర్గతం చేసింది మరియు ప్రభుత్వ జవాబుదారీతనంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసింది.



## సత్తా చాటిన భారత్ వైమానిక రక్షణ వ్యవస్థలు

### 600లకుపైగా పాకిస్థాన్ డ్రోన్లు కూల్చివేత

**న్యూఢిల్లీ, మే 17:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సైనిక దాడుల్లో భారత వైమానిక రక్షణ వ్యవస్థలు సత్తా చాటాయి. 600కు పైగా పాకిస్థాన్ డ్రోన్లను ఇవి కూల్చివేశాయి. భారత రక్షణ స్థావరాలకు ఎటువంటి నష్టం జరగకుండా కాపాడాయి. మే 7న పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ధ్వంసం చేసింది. దీనికి ప్రతిస్పందనగా భారత్ సరిహద్దులోని నగరాలను పాకిస్థాన్ సైన్యం లక్ష్యంగా చేసుకున్నది. భారత సైనిక స్థావరాలపై దాడుల కోసం వందలాది డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించింది. కాగా, భారత వైమానిక రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా వాటిని అడ్డుకున్నాయి. 600కు పైగా పాకిస్థాన్ డ్రోన్లను కూల్చడంతోపాటు ధ్వంసం చేశాయి. పాక్ డ్రోన్లను అడ్డుకునేందుకు విస్తృతమైన వైమానిక రక్షణ గొడుగును భారత సైన్యం అమలు చేసింది. నియంత్రణ రేఖ (ఎల్ఒసి) నుంచి అంతర్జాతీయ సరిహద్దు (ఐబి) వరకు పలు కీలక ప్రాంతాల్లో వెయ్యికిపైగా ఎయిర్ డిఫెన్స్ గన్స్‌ను మోహరించింది. ఎల్-70 ఎయిర్ డిఫెన్స్ గన్, జు-23 ఎంఎం గన్, శిల్కా గన్ సిస్టమ్ వంటివి ఇందులో ఉన్నాయి. అలాగే పెద్ద వైమానిక ముప్పును ఎదుర్కొనేందుకు 750కు పైగా స్వల్పశ్రేణి ఉపరితలం నుంచి గాలిలోకి ప్రయోగించే క్షిపణి (ఎస్ఎఎం) వ్యవస్థలను కూడా భారత సైన్యం మోహరించింది. మరోవైపు భారత భూభాగంలోకి ప్రవేశించిన ప్రతి వైమానిక లక్ష్యాన్ని పర్యవేక్షించడం, ట్రాక్ చేయడం, ఎయిర్ డిఫెన్స్‌ను యాక్టివేట్ చేయడం కోసం ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఆకాశ్ తీర్ వ్యవస్థ ఎంతో కీలకంగా వ్యవహరించింది. ఈ ఇంటిగ్రేటెడ్ ఏరియల్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఎసిసిఎఫ్) ను కొన్ని నెలల కిందటే ఆకాశ్ తీర్ ప్రాజెక్టు కింద వైమానిక దళంలోకి చేర్చినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. నిర్దిష్టమైన పనితీరును ప్రదర్శించినట్లు వివరించారు.

# తుర్కియే యాపిల్స్ బ్యాన్ చేయండి

## వాషింగ్టన్ యాపిల్స్‌పై సుంకం రాయితీ వద్దు

## హిమాచల్ యాపిల్ సాగుదారుల డిమాండ్




**చండీఘర్, మే 17:** హిమాచల్‌ప్రదేశ్‌లోని యాపిల్ సాగుదారులు తుర్కియే యాపిళ్లను బ్యాన్‌చేయాలని డిమాండ్ చేసారు. దేశ ఆర్థిక వ్యవస్థలో యాపిల్ సాగుదారులు కీలకంగా ఉన్నారని, ఒక్క హిమాచల్‌నుంచే యాపిల్ ఆర్థికవ్యవస్థకు ఐదువేల కోట్లవరకూ అందిస్తున్నారని, అందువల్ల దేశీయ ఉత్పత్తులను ఆదరించే వీలుగా తుర్కియే యాపిళ్లను పూర్తిగా నిషేధించాలని వారు డిమాండ్‌చేస్తున్నారు. అలాగే వాషింగ్టన్ యాపిల్స్‌పైనా దిగుమతి సుంకాలను తగ్గించాలని, ఎలాంటి మినహాయింపులు ఇవ్వకూడదని వారు కోరుతున్నారు. ఆపరేషన్ సింధూర్‌లో పాక్ సైనిక మద్దతుతోపాటు డ్రోన్లసాయం అందించడంపై ఇప్పటికే తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ బాయ్‌కాట్ తుర్కియే పిలుపునిచ్చిన వర్తక వాణిజ్యసంఘాలకు తోడు ఇపుడు హిమాచల్ యాపిల్ సాగుదారులు కూడా తోడయ్యారు. సంయుక్త కిసాన్‌మంచ్ కన్వీనర్ హరీష్ చౌహాన్ మాట్లాడుతూ తాము త్వరలోనే హిమాచల్ గవర్నర్ శివప్రతాప్ శుక్లానకలిసి చర్చలు జరపనున్నట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీ గవర్నర్‌ను కలుస్తామన్నారు. అలాగేప్రధాని నరేంద్ర మోడీకి కూడా ఒక వినతిపత్రం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్రం టర్కిష్ యాపిల్స్ దిగుమతులను వెంటనే నిలిపివేయాలని కోరతామన్నారు.

ఇరాన్‌నుంచి కూడా యాపిల్ పండ్లను దిగుమతిచేసుకోవద్దని, వాషింగ్టన్ యాపిల్స్‌పైనా దిగుమతిసుంకాలను తగ్గించవద్దని రైతులు డిమాండ్‌చేసారు. వివిధ దేశాలనుంచి దిగుమతి అవుతున్న యాపిల్స్‌పై కనీస దిగుమతిధరలు కిలోకు 100గా ఉన్నాయి. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం కిలోకు రూ.50 చొప్పున సుంకం ఛార్జిచేస్తామని ప్రకటించింది. జులై మధ్యస్తం నుంచి హిమాచల్‌లో యాపిల సీజన్‌ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది గత ఏడాదికంటే ఎక్కువ రావచ్చని 2.18 కోట్ల బాక్సులు పైబడి ఉంటుందని హరీష్ చౌహాన్ తెలిపారు. తుర్కియే, ఇరాన్‌లనుంచి దిగుమతి చేసుకుంటున్నందున దేశీయ యాపిల్ సాగు దార్లకు విపరీత నష్టం వాటిల్లుతోందని, తుర్కియే యాపిల్ కిలో 60 నుంచి 65కు అమ్ము తుంటే ఇరాన్ యాపిల్స్ కిలో 38 నుంచి 40 కే లభిస్తున్నాయని గుర్తుచేసారు. అదే హిమాచల్ యాపిల్ ఉత్పత్తి వ్యయం కిలోకు 40గా ఉందని, బెస్ట్‌క్వాలిటీ యాపిల్‌ను మార్కెట్‌లో రూ.50 నుంచి 60కి మించకుండా విక్రయిస్తున్నట్లు తెలిపారు.

1.29 మెట్రిక్ టన్నులు తుర్కియేనుంచి దిగుమతి అయ్యాయని గత ఏడాది మాత్రం 1.11 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గినట్లు చౌహాన్ వివరించారు. ఇరాన్‌నుంచి 1.07 లక్షల టన్నులు దిగుమతి అవుతున్నాయన్నారు. ఇప్పటికే తాము కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్‌ను కలిసి సమస్యలు వివరించినట్లు హరీష్ చౌహాన్ వెల్లడించారు.

## ముంబయి ఎయిర్‌పోర్టులో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదుల అరెస్టు!



**ముంబయి, మే 17:** ముంబయి విమానాశ్రయంలో ఐసిస్ స్లీపర్ సెల్ మెంబర్స్ అని భావిస్తున్న ఇద్దరిని ఎన్ఐఎ అరెస్టు చేసింది. ఇండోనేసియా జకార్తా నుంచి మళ్లీ భారత్‌లోకి ప్రవేశిస్తున్న అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్ వాలా, తల్హాఖాన్‌లను రెండో నంబరు టెర్మినల్ వద్ద ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకున్నారు. అనంతరం ఎన్ఐఎ వారిని అరెస్ట్ చేసింది. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్, సిరియా ఐసిస్ స్లీపర్ సెల్ విభాగంతో వీరికి సంబంధాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇద్దరు నిందితులను ఎన్ఐఎ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నారు. ఐసిస్ సానుభూతి పరులైన వీరు 2023లో ఉగ్రవాదుల కోసం పుణేలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ ఐఇడి, ఇతర పేలుడు పదార్థాలు తయారు చేసినట్లు గుర్తించారు. అదే కేసులో 8 మంది ఐసిస్ సానుభూతిపరులను అరెస్టు చేయగా వీరిద్దరు మాత్రం ఎన్ఐఎ కళ్లుగప్పి ఇండోనేషియా పారిపోయారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఐఈడీలు తయారుచేసిన ప్రదేశంలోనే బాంబు తయారీ వర్క్‌షాపులు కూడా నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. వారిపై ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. వారి సమాచారం ఇస్తే ఒక్కొక్కరికి మూడు లక్షలు ఇస్తామని ఎన్ఐఎప్రకటించింది. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడం, హింస, ఉగ్రవాదం ద్వారా దేశంలో ఇస్లామిక్ పాలనను స్థాపించాలన్న ఐసిస్ ఎజెండా కోసం వీరు పనిచేసినట్లు అధికారులు తెలిపారు. భారత్‌లో శాంతి, మత సామరస్యాన్ని దెబ్బతీయాలని కుట్ర పన్నారని వివరించారు అరెస్ట్ చేసిన అనుమానిత ఐసిస్ స్లీపర్ సెల్ సమయంలోనే మరోవైపు, దాదాపు రెండేళ్లుగా పరారీలో ఉన్న వీరు భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తల సమయంలోనే ఎందుకు ముంబయి వచ్చారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో నిర్మూలించాలనే కేంద్ర ప్రభుత్వం లక్ష్య సాధన కోసం ఎన్ఐఎ తీవ్రంగా ప్రయత్నిస్తోందని వెల్లడించారు. కాగా, భారత్ ఐసిస్ కార్యకలాపాలను నిర్వీర్యం చేయడంలో ఈ అరెస్టులు కీలక ముందడుగు అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పహల్గాం పాశవిక దాడి చేసిన ఉగ్రవాదుల కోసం ఎన్ఐఎ బృందాలు జమ్ముకశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నాయి. స్థానిక అధికారులతో కలిసి ఉత్తరకశ్మీర్‌లోని కుప్వారా, శ్రీనగర్, గందేర్‌బాల్, బారాముల్లా వంటి 10 ప్రదేశాల్లో సోదాలు చేపట్టారు.

# న్యాయమూర్తులు సామాజిక వాస్తవాలు విస్మరించకూడదు

## చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్



**న్యూఢిల్లీ, మే 17:** న్యాయమూర్తులు సామాజిక వాస్తవాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సత్కార కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, సామాజిక వాస్తవాలను అర్థం చేసుకోవడంలో, వాటికి ప్రతిస్పందించడంలో న్యాయమూర్తుల పాత్రను నొక్కి చెప్పారు. ఇటీవలే 52వ చీఫ్‌జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టిన బీఆర్ గవాయ్‌ను బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) సత్కరించింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ మానవ అనుభవాల సంక్లిష్టతను విస్మరిస్తూ, నేటి న్యాయవ్యవస్థ చట్టపరమైన విషయాలను కఠినమైన నలుపుతెలుపు పదాలతో చూడకూడదని చెప్పారు. న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టడానికి మొదట్లో నేను చాలా సంకోచించాను. కానీ మా నాన్న ఓ విషయం చెప్పారు. న్యాయవాదిగా ఉండడం వల్ల బాగా డబ్బులు వస్తాయి. కానీ న్యాయమూర్తిగా పనిచేయడం వల్ల సామాజిక, ఆర్థిక న్యాయం పట్ల డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కున్న దార్శనికతను ముందుకు తీసుకెళ్లడానికి వీలు కలుగుతుందని మా తండ్రి నొక్కి చెప్పారు. అందుకే మా నాన్న సలహాకు కట్టుబడి ఉండాలని నిర్ణయించుకున్నానని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. జస్టిస్ బీఆర్ గవాయ్ హైకోర్టు న్యాయమూర్తిగా 22 సంవత్సరాలు, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా 6 సంవత్సరాలు పనిచేశారు. న్యాయవ్యవస్థలో ఉన్నవారు ఒంటరిగా ఉండాలని, ప్రజలతో సంబంధాలు పెట్టుకో కూడదు అనే భావాలను చీఫ్ జస్టిస్ గవాయ్ తోసిపుచ్చారు. న్యాయమూర్తులు అందరితో కలిసి ఉండాలని చెప్పారు. న్యాయ నియామకాల్లో మహిళలకు, అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం పెరగాలని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, వివిధ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు హాజరైన ఓ ముఖ్యమైన సమావేశాన్ని జస్టిస్ గవాయ్ గుర్తు చేసుకున్నారు. ఆ సమావేశంలో ఇప్పటి వరకు న్యాయవ్యవస్థలో ప్రాతినిధ్యం లేని, తక్కువ ప్రాతినిధ్యం ఉన్న వర్గాలకు చెందిన అభ్యర్థులకు సరైన అవకాశం కల్పించాలని జస్టిస్ చంద్రచూడ్ కోరారు. అత్యంత నైపుణ్యం ఉన్న మహిళా న్యాయవాదులను కచ్చితంగా గుర్తించి, ప్రోత్సహించాలని చీఫ్ జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ ప్రయత్నం కచ్చితంగా విజయవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థలోని ఖాళీల భర్తీ సమస్యను కూడా జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. సరిపడ న్యాయమూర్తులు లేకపోవడం వల్ల పెండింగ్ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. నియామకాలను వేగం వంతం చేయడంలో సహకార విధానాన్ని అవలంభించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## భారత్ సమాచారాన్ని పాక్‌కు అందించిన విద్యార్థి అరెస్టు!

**న్యూఢిల్లీ, మే 17:** పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై హర్యానాలో ఓ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పటియాలలోని ఖల్సా కళాశాలలో దేవేంద్రసింగ్ ధిల్లాన్ పొలిటికల్ సైన్స్ చదువుతున్నాడు. మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టోల్ చిత్రాలను పోస్టు చేశాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతేడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్‌కు వెళ్లి అక్కడి ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధికారులతో భారత్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు అంగీకరించాడు. అందుకు పాక్ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బు ముట్టచెప్పినట్లు తెలిపాడు. పటియాలా మిలిటరీ కంటోన్మెంట్‌కు సంబంధించిన చిత్రాలను సైతం అతడు పాక్ అధికారులకు అందించాడు. దేవేంద్రసింగ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ దర్యాప్తుకు పంపించాం. డబ్బు లావాదేవీలకు సంబంధించిన సమాచారం సేకరిస్తున్నాం. దీనిపై పూర్తి దర్యాప్తు కొనసాగుతోంది. ఇక ఇటీవల పాకిస్తాన్ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తున్న ఒక వ్యక్తిని సైతం పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా పని చేస్తున్న రవీంద్రకుమార్ ఓ అమ్మాయి వలపు వలలో చిక్కి భారత సైన్యం ఆయుధాలకు సంబంధించి సున్నితమైన సమాచారాన్ని పాక్ అధికారులకు చేరవేశాడు. దీంతో పాటు గగన్‌యాన్ ప్రాజెక్టు వివరాలను అందించినట్లు విచారణలో తేలింది. పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐఎస్ఐ సభ్యులతోనూ అతడు నేరుగా టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడయింది.

## ఇటలీ పిఎం మెలోనికి మోకాలిపై కూర్చొని అల్బేనియా ప్రధాని స్వాగతం



**టిరానా, మే 17:** అల్బేనియా రాజధాని టిరానాలో ఐరోపా రాజకీయ కమ్యూనిటీ సదస్సు జరిగింది. ఈ సమావేశానికి యూరోపియన్ యూనియన్ దేశాల నేతలు హాజరయ్యారు. అయితే, ఈ సదస్సుకు విచ్చేసిన ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అల్బేనియా దేశ ప్రధాని ఎడి రమా స్వాగతం పలికిన తీరు ఆసక్తికరంగా మారింది. మోకాలిపై కూర్చొని ఎడి.. ఆమెను ఆహ్వానించారు. మెలోనీ కారు దిగి వేదిక వద్దకు వస్తుండగా అల్బేనియా ప్రధాన మంత్రి ఎడి మోకాలిపై కూర్చొని చేతులు జోడించి నమస్కారం చెబుతూ స్వాగతం పలికారు. వర్షంలోనూ ఆయన పలికిన ఈ ఆత్మీయ ఆహ్వానానికి మెలోనీ ఫిదా అయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కాగా మెలోనీ తన 'ఇటాలియన్ సిస్టర్' అని చెప్పే ఎడి రమా ఆమె ఎప్పుడు కనిపించినా సరే ఇలాగే పలకరిస్తారు. ఈ యేడాది జనవరిలో మెలోనీ పుట్టినరోజు నాడు ఓ సదస్సులో కలిసిన ఎడి.. ఆమెకు మోకాలిపై కూర్చొని స్కార్ఫ్‌ను కానుకగా ఇచ్చారు. ఇటాలిన్ భాషలో ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అప్పుడు కూడా వీరి విడియో నెట్టింట తెగ చక్కర్లు కొట్టింది.

# గడువు దాటితే అమెరికా నుంచి బహిష్కరణ

**కీలక అడ్వైజరీ జారీ చేసిన భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం**

**న్యూఢిల్లీ, మే 17:** నిర్దేశిత గడువు దాటి అమెరికాలో ఉంటున్నవారిని ఉద్దేశించి భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఈ అంశంలో ఉల్లంఘనకు పాల్పడితే కలిగే తీవ్ర పరిణామాలను స్పష్టంగా వెల్లడించింది. బహిష్కరణ ముప్పు తప్పదని, అదేవిధంగా భవిష్యత్తులో అమెరికాకు ప్రయాణంపై శాశ్వత నిషేధం ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఎంబసీ పోస్టు పెట్టింది. పర్యాటక, విద్యార్థి, వర్క్ పర్మిట్స్ సహా వివిధ వీసాలపై అమెరికాలో నివసిస్తోన్న భారతీయులను ఉద్దేశించి ఈ హెచ్చరిక చేసింది. అమెరికా ప్రయాణంపై నిషేధం పడితే భవిష్యత్తులో అక్కడ చదువు, వృత్తి వ్యక్తిగత అవకాశాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది. నిర్దేశిత గడువు ముగిసిన తర్వాత ఏవైనా అనుకోని పరిస్థితుల కారణంగా దేశాన్ని వీడటంలో ఇబ్బందులు ఏర్పడితే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోకుండా ఉండేందుకోసం యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. కాగా అమెరికాలో గడువుకు మించి ఉంటున్నవారు తక్షణమే దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని అక్కడి హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం గతంలో హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. అమెరికాలో 30 రోజులకు నిబంధనలకు మించి నివసిస్తున్న వారు ఖచ్చితంగా ఫెడరల్ గవర్నమెంట్ వద్ద రిజిస్టర్ చేయించుకోవాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు. అందుకే ఇప్పుడే సొంతంగా వెళ్లిపోండి అని గతంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే దేశం నుంచి పంపిచేస్తామని పేర్కొంది. అంతే కాదు ఫైనల్ ఆర్డర్ అందుకొన్న వారు ఒక్కరోజు అధికంగా ఉంటే రోజుకు 998 డాలర్లు ఫైన్, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని, వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా అమెరికాలోకి ప్రవేశం లభించదని చెప్పింది.

# పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించేందుకు ఎంపిల బృందం



**న్యూఢిల్లీ, మే 17:** ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపిల పేర్లను శనివారం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఎంపిలు శశిథరూర్(కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్ (బిజెపి), బైజయంత్ పాండా (బిజెపి) సంజయ్ కుమార్ ఝా (జెడియు), కనిమొళి (డిఎంకె), సుప్రియా సూలే (ఎన్సీపి, ఎస్పీ), శ్రీకాంత్ శిండే (శివసేన) విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో అయిదు దేశాలకు వెళతాయి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం విపక్షాలతో చర్చలు జరిపి బృంద సభ్యులను ఎంపిక చేసింది. వీరు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏ విధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. వీరు ముఖ్యంగా అయిదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించనున్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు. పాక్ బెదిరింపులకు దీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరణ. భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత. ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే ఖచ్చితంగా లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్తాన్ అనుసరిస్తున్న పాత్రను దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును వివరించడం. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్, పాక్‌పై అనేక దౌత్య చర్యలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులను తిరిగి స్వదేశానికి పంపడం, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవడం వంటి చర్యలు చేపట్టింది. అనంతరం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసి, ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాల రాయబారులు, మంత్రులకు ప్రత్యేక బ్రీఫింగ్ ఇచ్చింది.

## బిన్‌లాడెన్ ఆపరేషన్ తరహాలోనే 'సిందూర్': ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



**లక్నో, మే 17:** ఆపరేషన్ సిందూర్‌పై భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉగ్రవాది బిన్ లాడెన్‌ను అమెరికా వేటాడి అంతమొందించిన ఘటనతో ఆపరేషన్ సిందూర్‌ను పోల్చారు. భారత్ మునుపెన్నడూ లేని విధంగా పాకిస్థాన్‌లోకి చొచ్చుకొని వెళ్లి మరీ ఉగ్రమూకలను ఏరిపారేసిందని చెప్పారు. 2 మే 2011న అమెరికా దళాలు ఇదే విధంగా వ్యవహరించాయని లాడెన్ పేరు ప్రస్తావించకుండా ధన్‌ఖడ్ మాట్లాడారు. ప్రపంచానికి తెలిసేలా భారత్ చేసి చూపించింది. శాంతియుత వాతావరణానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉగ్రవాదుల్ని తుదముట్టించడం ద్వారా ఒక గ్లోబల్ బెంచ్ మార్క్‌ను సెట్ చేసిందని ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ధన్‌ఖడ్ అన్నారు.

భారత్ ఎంతో కచ్చితత్వంతో దాడులు చేసిందని, ఉగ్ర శిబిరాలకు మాత్రమే నష్టం వాటిల్లిందని చెప్పారు. అమెరికా చరిత్రలో అత్యంత విషాద ఘటనగా మిగిలిన ఘటన వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై 11 సెప్టెంబర్ 2001లో (9/11) అల్‌ఖైదా జరిపిన ఉగ్రదాడి. ఈ దాడిలో దాదాపు మూడువేల మంది ప్రాణాలు కోల్పోయారు.

# భారత్ క్షిపణుల దెబ్బ తగిలింది

## పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ అంగీకారం



**ఇస్లామాబాద్, మే 17:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'తో దాయాది పాకిస్థాన్ వణికిపోయింది. మన మిలిటరీ దాడులు ఆ దేశ వైమానిక దళాన్ని చావుదెబ్బ కొట్టాయి. శత్రువుల కీలక వైమానిక స్థావరాలను మన క్షిపణులు ధ్వంసం చేశాయి. అయితే, ఈ నష్టంపై ఇన్నాళ్లూ బుకాయిస్తూ వస్తోన్న పాక్ తాజాగా దాన్ని అంగీకరించింది. భారత క్షిపణుల దెబ్బ తమకు తగిలిందని స్వయంగా ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ధ్రువీకరించారు. శుక్రవారం రాత్రి ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ షెహబాజ్ ఈ విషయాన్ని వెల్లడించారు. మే 9-10 మధ్య రాత్రి సమయంలో రావల్పిండిలోని నూర్‌ఖాన్‌సహా ఇతర వైమానిక స్థావరాలపై భారత్ దాడి చేసినట్లు పాక్ ప్రధాని అంగీకరించారు. ఇందుకు సంబంధించిన విడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

**ఆ సమయంలో ఈత కొడుతున్నా: షెహబాజ్**

'ఆ రోజు తెల్లవారుజామున ప్రార్థనలు ముగించుకుని ఈత కొట్టేందుకు వెళ్లా. నా సెక్యూర్డ్ ఫోన్ మాత్రమే తీసుకెళ్లా. రెండుసార్లు మోగింది. ఆర్మీ ఛీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ లైన్‌లో ఉన్నారు. ఫోన్ ఎత్తగానే భారత్ దాడులు చేస్తున్న విషయాన్ని చెప్పారు. వాటిని ఎదుర్కొనేందుకు వైమానిక దళం స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతోపాటు చైనా యుద్ధ విమానాలను కూడా వినియోగిస్తోందని మునీర్ తెలిపారు' అంటూ షెహబాద్ వివరించారు. అయితే, భారత్‌పై పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లు కూలిపోయిన విషయాన్ని మాత్రం ఆయన చెప్పకపోవడం గమనార్హం. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సైనిక స్థావరాలు, పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకుని పాక్ దాడి చేసింది. దీంతో న్యూఢిల్లీ ప్రతిదాడికి దిగింది. అత్యంత కచ్చితత్వంతో పాక్‌లోని దాదాపు డజను సైనిక స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. ఇందులో ఆ దేశానికి అత్యంత కీలకమైన పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ ఉన్న చక్లాలలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌తో పాటు సర్గోదా, భోలారీ వైమానిక స్థావరాలున్నాయి. దాడుల్లో ఇవి ధ్వంసమైన తీరు ఉపగ్రహ చిత్రాల్లో బయటికొచ్చింది. పాక్ వాయుసేనకు చెందిన దాదాపు ఐదోవంతు మౌలిక వసతులు, ఫైటర్‌జట్లు భారత్ దాడిలో ధ్వంసమైనట్లు సమాచారం.

## సిబ్బంది ఉత్తమంగా పనిచేస్తూ పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలి

### ఎస్‌హెచ్‌ఒల భేటీలో డిజిపి జితేందర్ ఉద్బోధ

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** పోలీసులు విధి నిర్వహణలో ఉత్తమంగా పనిచేస్తూ పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలని డిజిపి జితేందర్ అన్నారు. శిక్షణ సమ యంలో నేర్చుకున్న చట్టాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు ప్రజల ఇబ్బందులను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలు, కమిషనరేట్ల నుంచి ఎంపిక చేసిన స్టేషన్ హౌజ్ ఆఫీసర్లతో శనివారం నాడు డిజిపి జితేందర్ భేటీ అయ్యారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ పోలీసు శాఖకు దేశంలోనే ఉత్తమ పోలీసు విభాగంగా పేరుందని అన్నారు. ఈ పేరు ఏదో ఒక్క రోజులో వచ్చింది కాదని, నిరంతరంగా ఏళ్ల తరబడి సమిష్టిగా కృషి చేయడం వల్ల వచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్ర పోలీసు శాఖకు వున్న పేరు ప్రఖ్యాతులను మరింతగా పెంచేందుకు పోలీసు సిబ్బంది అకుంటిత దీక్షతో పనిచేయాలని ఆయన కోరారు. ప్రజలకు మరింత సేవలందించడం, మెరుగైన సేవలను కొనసాగించడం, ఉత్తమ సేవలు కల్పించడం, పోలీసు విభాగాల సేవలను అత్యుత్తమంగా కొనసాగేలా చూడడం వంటి నాలుగు అంశాలను అమలు చే యడం ద్వారా పోలీసులు ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని, ప్రజల ఆదరాభిమానాలను పొందవచ్చని డిజిపి తెలిపారు. బ్రిటీష్ కాలంలో మొదలైన పోలీసింగ్ 165 ఏళ్లు పూర్తి చేసుకుందని, మారిన పరిస్థితుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోలీసులు ప్రయత్నించాలని ఆయన కోరారు. ఈ విషయం లో స్టేషన్ హౌజ్ ఆఫీసర్ల పాత్ర మరింత కీలకంగా వుందని డిజిపి జితేందర్ అన్నారు. ప్రజల్లో పోలీసులకు ఆదరాభిమానాలు పెరిగితే పోలీసుల కుటుంబీకు లు సైతం సంతోషపడతారని ఆయన అన్నారు. ప్రజల్లో పోలీసు విధుల పట్ల అవగాహన పెరిగిందని, దీనిని దృష్టిలో వుంచుకుని పోలీసులు మసలు కోవాలని ఆయన కోరారు. క్రిమినల్ జస్టిస్ ప్రకారం నేరాలు చేసేవారికి కచ్చితంగా శిక్షలు పడాల్సిందేనని ఆయన అన్నారు. సాంకేతికతతో నేరాలను నివారించవచ్చని ఆ యన తెలిపారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, ఏఐజి రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కల్నల్ సోఫియా ఖురేషీని అవమానించిన బిజెపి మంత్రిని భర్తరఫ్ చేయండి

### మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** సోఫియాఖురేషీ పట్ల అమర్యాద వ్యాఖ్యలు చేస్తూ అవమానించిన బిజెపికి చెందిన మధ్యప్రదేశ్ మంత్రిని వెంటనే ప్రభుత్వం భర్తరఫ్ చేయాలని మాజీ పిసిసి అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో హనుమంతరావు శనివారం మాట్లాడుతూ మధ్యప్రదేశ్ బిజెపి మంత్రి.. కల్నల్ సోఫియా ఖురేషినే కాదు.. సైనికులను అవమనించాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత దేశంలోని అనేక మతాలకు చెందిన సైనికులు దేశమాత కోసం ప్రాణాలు పణంగా పెట్టడానికి సిద్ధంగాఉంటే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. అవమానించిన బిజెపి మంత్రిని వెంటనే పార్టీ నుంచి కూడా సస్పెండ్ చేయాలని అన్నారు. కిషన్‌రెడ్డి తిరంగా ర్యాలీ చేస్తుండు మంచిదే కానీ సైనికులను అవమానించిన మంత్రిని తొలగించాలి, అప్పుడే సైనికులకు మనోధైర్యం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పహల్గాంలో టెర్రరిస్టుల దాడిలో 26 మంది అమాయక ప్రజలు చనిపోయారు, కల్నల్ సోఫియా ఖురేషి ఉగ్రవాదులను ఫినిష్ చేసిందని ఆయన తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌ను దేశ ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు స్వాగతించాయి కల్నల్ సోఫియా ఖురేషి, సైనికులకు గౌరవం దక్కాలంటే బిజెపి మంత్రిని భర్తరఫ్ చేయాల్సిందే అప్పుడే మంచి మెసేజ్ పోతుందని అన్నారు.

## ప్రజాదరణ చూసి ఓర్వలేక రాహుల్‌పై అక్రమ కేసులు

### మోడీ, నితీష్ దిష్టిబొమ్మలను దగ్ధం చేసిన యూత్ కాంగ్రెస్

**హైదరాబాద్,మే 17,ప్రభాతవార్త:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేని మోడీ,నితీష్ సర్కార్‌లు అక్రమ కేసులు పెడుతున్నాయని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆరోపించారు.తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గాంధీ భవన్ లో నరేంద్ర మోడీ, బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శివ చరణ్ మాట్లాడుతూ



బీహార్ రాష్ట్రం దర్భంగాలో అంబేద్కర్ హాస్టల్లో దళిత విద్యార్థులను రాహుల్ గాంధీ కలవనీయకుండా కేంద్ర పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని నితీష్ సర్కార్,మోడీలు కుట్రలు చేశాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ పై అక్రమ కేసులు పెట్టి ఎఫ్ఐఆర్ లు నమోదు చేయడం ప్రజాస్వామిక స్ఫూర్తికి విఘాతం అని అన్నారు. బిజెపి ప్రభుత్వ నియంత పరిపాలనకు నిరసనగా ప్రజలు ఏకం కావాలని ఆయన కోరారు.రాహుల్ గాంధీ పర్యటనలను మోడీ సర్కార్ అడ్డుకోవడం సిగ్గు చేటు అన్నారు.బిజెపి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన రాహుల్ గాంధీ దేశ ప్రజల్లో ఉన్న ఆదరణను పోగొట్టలేవని స్పష్టం చేశారు. త్వరలోనే మతతత్వ బిజెపి పార్టీకి దేశ ప్రజలు సరైన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు పలు జిల్లాల, నియోజకవర్గాల, మండలాల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసమే భూభారతి

### అద్భుత ప్రగతిని సాధించనున్న రియల్ ఎస్టేట్: మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహా



సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ

**కొండాపూర్, మే 17, ప్రభాతవార్త:** ధరణిలో రైతులు తమ భూ సమస్య పరిష్కారం కోసం ఆలి మెడలో తాళిని అమ్మి కోర్టులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉండేదని శనివారం మండల కేంద్రమైన కొండాపూర్ లో నిర్వహించిన భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సమీక్ష సమావేశానికి రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ నాలుగు గోడల మధ్యలో నలుగురు వ్యక్తులు తీసుకువచ్చిన తమ స్వార్థం కోసం తీసుకువచ్చిన ఈ చట్టం తో వేలాదిమంది రైతులు ఎంతో ఘోష పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతల భూములను ఆగం చేసిన టిఆర్ఎస్ సర్కారును ఇటీవల జరిగిన ఎన్నికల్లో గద్దె దించారని పేర్కొ న్నారు. 6000 మంది లైసెన్సుడ్ సర్వేయర్లను నియ మకానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తొలి విడతలో వెయ్యిమంది సర్వేయర్లను నియామకం కోసం కేబినెట్‌లో నిర్ణ యం తీసుకున్నా మన్నారు. ప్రతి గ్రామా నికి రెవెన్యూ అధికారిని నియమిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని పునరుద్ఘాటించారు. పేదల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైతే భూభారతి చట్టంలోనూ మార్పులు చేసేందుకు ప్రభుత్వం వెనకాడ బోదని స్పష్టం చేశారు గత ప్రభుత్వ పెద్దలు చేసిన ప్రభుత్వ భూముల్లో కబ్జా చేసిన భూ కబ్జాలన్నీ ఈ భూభారతి చట్టంతో బయటకు వస్తాయని వారు పేర్కొన్నారు.

భూభారతి చట్టం ద్వారా రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ అద్భుతమైన ప్రగతిని సాధిస్తుందని పేర్కొన్నారు. రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ గృహాలను కట్టేందుకు ప్రణాళికను తయారు చేశామన్నారు. ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతలో అర్హులైన నిరుపేదలకు ఇచ్చేందుకే ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి సహకరించక పోయిన ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. 200 లోపు యూనిట్ల ఉచిత విద్యుత్తు, తెల్ల రేషన్ కార్డు పై సన్నబియ్యం ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్ వికాస్ వంటి సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని అన్నారు.

ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ లను రాష్ట్రవ్యాప్తంగా 58 చోట్ల ఏర్పాటుచేసి నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కెసిఆర్ చేసిన ఎనిమిది లక్షల కోట్ల అప్పులు తీర్చుతూ సంక్షేమ పథకాలను నిరాటంకంగా కొనసాగిస్తున్నామని వారు అన్నారు.


# గిరిజనులను మోసగిస్తున్న కాంగ్రెస్ సర్కారు

### బిజెపి ఎంపి గొడెం నరేష్

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** తెలంగాణలో గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బిజెపి ఎంపి గోడం నరేష్ ఆరోపించారు. శనివారం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపి గోడెం నగేష్ మాట్లాడారు. రాష్ట్రంలో ఆదివాసులు, గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 300 కోట్లు విడుదల చేసిందన్నారు. అయితే ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలకు పంపక, గిరిజనులకు అందకుండా గత ఐదు నుండి ఆరు నెలలుగా నిలిపివేసిందన్నారు. పేద గిరిజనులకు అందాల్సిన ఈ నిధులను కాంగ్రెస్ పార్టీ తమ కార్యక్రమాలకు వినియోగిస్తున్నదనే అనుమానం కలుగుతుందన్నారు. కొలాంస్, తోటి, చెంచు గిరిజనులు గత యేడాది నుంచే అప్పులు తీసుకుని ఇండ్ల నిర్మాణాలు చేపట్టారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. విద్యా సంవత్సరం ముగిసినప్పటికీ, గిరిజన విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్ షిప్‌లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. కాగా, ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం గత అక్టోబర్‌లోనే విడుదల చేసిందన్నారు. ఆర్టికల్ 275(1) కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో రెసిడెన్షియల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యా వ్యవస్థలో మౌలిక మార్పులు తీసుకురావాలి. అలాగే, విద్యార్థుల స్కిల్ డెవలప్‌మెంట్ కోసం కేంద్రం సహాయం అందిస్తుందన్నారు. కానీ, ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుని ఆశ్రమ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్‌కు ఒక రూపాయి కూడా ఇవ్వడం లేదంటూ మండిపడ్డారు. కేంద్రం ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కోసం రూ. 5 కోట్లు విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులను ట్రైబల్ వెల్ఫేర్ ఏజెన్సీలకు ఇవ్వలేదని, ప్రధానమంత్రి గ్రామ్ యోజన కింద గ్రామాలకు మౌలిక వసతుల కల్పన కోసం కేంద్రం మార్చి 24న రూ. 16 కోట్లు విడుదల చేసింది. అయితే రెండు నెలలు గడిచినా ప్రభుత్వం ఈ నిధులను ఇంకా విడుదల చేయలేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్‌స్టిట్యూషన్ డెవలప్‌మెంట్ కోసం కేంద్రం రూ. 98 కోట్లు విడుదల చేసింది. కేంద్రం పేద గిరిజనుల కోసం కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణ అభివృద్ధికి పూర్తి సహకారం

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హామీ



ఎస్పీఆర్ హిల్స్‌లో మంచినీటి రిజర్వాయర్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు.

**హైదరాబాద్ (యూసుఫ్‌గూడ), మే 17, ప్రభాతవార్త:** హైదరాబాద్‌తో పాటు తెలంగాణ అభివృద్ధికి అన్ని రకాలుగా కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రహమత్ నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్‌లో నూతనంగా నిర్మించిన జిఎల్ఎస్ఆర్ రిజర్వాయర్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. జనాభా ఎక్కువగా ఉండి కొండల ప్రాంతమైన రహమత్ నగర్ డివిజన్‌లోని ఎస్పీఆర్‌హిల్స్ ప్రాంతంలో నీటి సమస్య తలెత్తడం సర్వసాధారణమైంది. ఈ ప్రాంతంలో మూడు రోజుల కొకసారి అర్ధరాత్రి వచ్చే నీళ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్యకు స్వస్తి పలికేందుకు రూ.5.75 కోట్లతో జీఎల్ ఎస్ఆర్ రిజర్వా యర్‌ను నిర్మించారు. పూర్తయిన రిజర్వాయర్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రారంభించగా ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రహమత్‌నగర్, బోరబండ కాలనీలతో పాటు ప్రజలు తాగునీటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని జీఎల్ఎస్ఆర్ రిజర్వాయర్ పూర్తి చేయాలని అనేకసార్లు ఆందోళన చేశామని గుర్తు చేశారు. ఇన్నేళ్ల తర్వాత ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గోదావరి నది నుంచి నగరానికి నీరు తీసుకొచ్చే ప్రయత్నం చేశారని ఎన్టీఆర్‌కూడా నగరంలో తాగునీటి అవసరాల కోసం కృష్ణా జలాలను రప్పించారని గుర్తు చేశారు.

గత పదేళ్లుగా నగరం ఎంతో విస్తరించిందని ఒక చుక్కనీరు కూడా నగరానికి అదనంగా అందలేదన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేస్తాము కాని ఆ తర్వాత తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో కలిసి ముందుకు వెళ్తామన్నారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికై రాజకీయాలకు అతీతంగా సాగునీటి సమస్య పరిష్కారం చేయడానికి ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7 వేల 400 కోట్లతో 20 టీఎంసీల నీటిని నగరానికి తీసుకొచ్చే ప్రక్రియ పూర్తిచేసిందని త్వరలోనే పను లు ప్రారంభమౌతాయన్నారు. అనంతరం యూసుఫ్‌గూడలో రూ.75 లక్షలతో అండర్‌గ్రౌండ్ నాలా ఆధునీకరణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభసభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# 23 తర్వాత పెండింగ్ రైతుభరోసా

### రూ. 5 వేల కోట్ల అంచనా

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త :** ఈనెల 23వ తేదీ తరువాత పెండింగ్ రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఆర్థిక శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. మొత్తానికి నాలుగు ఎకరాలు ఆపైన సాగు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో ఈ నెలాఖరు లోగా రైతు భరోసా నిధులు జమ అవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు వచ్చే నెల నుంచి ఖరీఫ్ పనులు కూడా ప్రారంభం కానున్నాయి. దీంతో ఖరీఫ్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను సైతం జూన్ నెలాఖరు నుంచి దశల వారీగా రైతుల ఖాతాల్లో జమ చేసేలా ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలో సాగుకు యోగ్యంగా కాని భూములను మినహాయిస్తే దాదాపు కోటి 50 లక్షల ఎకరాలకు రైతు భరోసా కింద ప్రభుత్వం సాయం అందించేందుకు సిద్ధమైంది. దీనికోసం సుమారు రూ.9వేల కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం దాదాపు రూ.4వేల కోట్ల వరకు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇక పెండింగ్‌లో ఉన్న నాలుగెకరాలు, ఆపైన భూమి కలిగిన రైతుల బ్యాంకు ఖాతాల్లోనూ రైతు భరోసా నిధులు జమచేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. కాగా రేవంత్ సర్కార్ రాష్ట్రం లోని రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా పేరుతో ఖరీఫ్, రబీ సీజన్ లకు కలిపి ఎకరాకు రూ. 12వేలు అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే, రబీ సీజన్ కు గాను ఇప్పటి వరకు మూడున్నర ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే సాయం అందింది. దీంతో నాలుగు ఎక రాలు ఆపైన భూమి ఉన్న రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేప థ్యంలో ప్రభుత్వం వారికి గుడ్ న్యూస్ చెప్పింది. త్వరలో మిగిలిన రైతుల ఖాతాల్లోనూ రైతు భరోసా నగదు జమ కానుంది. రైతు భరోసా నిధుల కోసం ఆర్థిక శాఖ నిధులను సర్దుబాటు పనిలో నిమగ్నమైంది.

# కెటిఆర్ రాజకీయ భవిష్యత్ కోసం హరీశ్‌రావు ఇంటికివెళ్లి మంతనాలు

### కెసిఆర్ హయాంలోనే ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 8వేల కోట్లు బకాయి

### వారిని రెచ్చగొట్టడానికి బిఆర్ఎస్ కుట్రలు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** బిఆర్ఎస్‌లో రాజకీయ అధిపత్య పోరు తారా స్థాయికి చేరడంతో కెటిఆర్ తన రాజకీయ భవిష్యత్తు కోసమే హరీశ్‌రావు ఇంటికి పోయి మంతనాలు ఆడుతున్నారని ప్రభుత్వ విప్‌ఆది శ్రీనివాస్ ఆరో పించారు. శనివారం అసెంబ్లీ ఆవరణలోని సిఎల్‌పి మీడియా సెంటర్లో ఆది మాట్లాడుతూ హరీష్ రావు పార్టీ నుంచి బయటకు పోతాడని స్పష్టమైన సంకేతాలు రావడంతో కెటిఆర్ ఇంటికి వెళ్లి బతిమాలుకుంటున్నడని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైన కెటిఆర్ కళ్లలో నిప్పులు పోసుకుం టున్నాడని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముందు తన ఇంటిని చక్కదిద్దుకోవాలని సలహా ఇచ్చారు. ప్రభుత్వాన్ని ఏ విధంగా నడుపాలో మేం చూసుకుంటాం. ప్రజా ప్రభుత్వం లో అందరి ని కళ్ళలో పెట్టుకొని చూసుకుంటాం అని ఆయన తెలిపారు.మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఆది తెలిపారు. బిఆర్ ఎస్ రజతోత్సవం తరవాత పార్టీ కేసీఆర్,కేటీఆర్ మాత్రమే నాయకులని సంకేతాలు ఇచ్చేవిధంగా వేదికపైన ఇద్దరి ఫోటో లు మాత్రమే పెట్టుకున్నారని ఇది పార్టీలో చిచ్చుపెట్టిందని అన్నారు. హరీష్‌రావు ను బతిమాలు కావడం కోసమే కేటీఆర్ ఆయన ఇంటికి వెళ్లారు.ఒక్క ఫోటో కూడా లేకుండా హరీశ్ రావు ను పక్కన పెట్టారు..కవిత కూడా బిఆర్ఎస్ లో అసంతృప్తి గా ఉన్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ ఎస్ పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని జోస్యంచెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని హామి ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ సంఘాల నాయకులతో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి మూడు గంటలకు పైగా సమావేశమయ్యారని గుర్తుచేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇంత సమయం ఇచ్చిన దాఖలాలు లేవు. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న అనేక సమస్యలను మా ప్రభుత్వం పరిష్కరించింది. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చాం, బదిలీలు చేశాం దాదాపు 15 యేళ్లకుపైగా పెండిం గ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు చేశామని తెలిపారు. ప్రమోషన్లు ఇచ్చాం ప్రతినెల మొదటి తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు ప్రభుత్వ ఉద్యోగులను పట్టించుకోలేదని అన్నారు. 15వ తేదీ తర్వాతే ఆ నాడు ఉద్యోగులు జీతాలు తీసుకున్నారని గతం గుర్తుచేశారు. మొత్తం నాలుగు డిఏ లుఇవ్వకుండా కేసీఆర్ పెండింగ్‌లో పెట్టి పోయాడు.

మా ప్రభుత్వం వచ్చాక ఒక డిఏ ఇచ్చింది. కేసీఆర్ హయాంలోనే ఉద్యోగులకు సంబంధించిన 8 వేల కోట్ల రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏళ్ల తరబడి నుంచి బిల్లలు ఇవ్వకుండా కేసీఆర్ పెండింగ్‌లో పెట్టి పోయాడని ఆరోపించారు. .ఉద్యోగులు పదవీ విరమణ చేస్తే రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి వస్తుందని వయోపరిమితి 61 యేళ్లకు పెంచి చేతులు దులుపుకున్నారు. కెసిఆర్ తీసుకున్న నిర్ణయం వల్ల కాంగ్రెస్ హయాంలో వేల మంది ఉద్యోగులు ఇప్పుడు రిటైర్మెంట్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల 600 కోట్ల రూపాయలు కేటాయిస్తామని మా ఆర్థిక మంత్రి ఇప్పటికే ప్రకటించారని తెలిపారు. ఉద్యోగుల బదిలీల కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. ఉద్యోగుల సమస్యలు తెలుసుకోవడం కోసం సీనియర్ ఐఎఎస్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. నవీన్ మిట్టల్, కృష్ణభాస్కర్, లోకేష్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ ఇప్పటికే ఉద్యోగ సంఘాలతో సమావేశం అయిందని తెలిపారు. ఉద్యోగ సంఘాలు 57 సమ స్యలను ప్రస్తావిస్తే అందులో 45కిపైగా తక్షణమే పరిష్కరిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగులను రెచ్చగొట్టడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగ సంఘాలమాజీ నాయకులను పిలిచి ఉద్యోగులల్లో విభజన తీసుకురావడానికి కుట్ర వన్నుతున్నారని విమర్శించారు.



## మధిరలో భూగర్భ కేబుల్ వ్యవస్థతో విద్యుత్ సరఫరా

### రూ 40 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు

### అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి

**మధిర, మే 17, ప్రభాతవార్త :** మధిర నియోజకవర్గ కేంద్రంలో భూగర్భ కేబుల్ వ్యవస్థ ద్వారా విద్యుత్ సరఫరా చేసే ప్రతిపాదనలకు అధికారులు సిద్ధం చేశారు. సుమారు రూ.40 కోట్ల అంచనా తో తయారుచేసిన ఈ ప్రతిపాదనలను శనివారం ఎన్పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి తో పాటు జిల్లా యంత్రాంగం మధిర కు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో పలు అభివృద్ధి పనుల భూమి పూజలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం మధిర శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క తన పర్యటనను ముగించుకొని హైదరాబాద్కు వెళ్ళవలసిన ఆయన మధిరకు చేరుకున్నారు. ముందస్తు గా డిప్యూటీ సీఎం మధిర పర్యటన షెడ్యూల్లో లేదు. ఎన్పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డిని మధిరకు వెళ్లి పరిశీలించాలని ఆదేశించినట్లు తెలిసింది. కాగా ఆయన భద్రాద్రి జిల్లా పర్యటన పూర్తిచేసుకుని మదిరకు చేరుకోవడం, భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి ఆయన అధికారులకు సూచించిన విధంగా విద్యుత్ శాఖ అధికారులు తయారుచేసిన సుమారు రూ. 40 కోట్ల అంచనాతో 18 కిలోమీటర్ల 11 కెవి కేబుల్ వర్క్స్, 12 కిలోమీటర్లు ఎల్ టి కేబుల్ వర్క్స్ సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేశారు. దీనిలో భాగంగా మధిర పట్టణంలో ఆత్కూరు క్రాస్ రోడ్ నుండి నందిగామ బైపాస్ రోడ్డు వరకు అలాగే ఆర్వి కాంప్లెక్స్ నుండి ఆర్టీసీబస్టాండ్ వరకు భూగర్భ కేబుల్స్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేవిధంగా నివేదికలు పొందుపరిచారు. ప్రతిపాదన యొక్క కూడిన ప్లాన్ మ్యాప్ ను నివేదికను ఎన్పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు చూపి వివరాలను వెల్లడించారు. మ్యాప్ తో పాటు నివేదిక ప్రతిపాదనలు పరిశీలించిన డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. అనంతరం సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి మధిర పట్టణంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి డిప్యూటీ సీఎం సూచనల మేరకు అధికారులకు తగు సూచనలు సలహాలు సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి, పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ ఎస్ఈ రంజిత్ రెడ్డి, మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, విద్యుత్ శాఖ డిఇలు శ్రీనివాసరావు, హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రివర్గ విస్తరణ ముఖ్యమంత్రి అడ్డుకొంటున్నారనడం అవివేకం

### నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి


**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** బిజెపి శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని,ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, మంత్రులకు మధ్య పూర్తిస్థాయిలో సమన్వయం ఉందని నాగంకర్నూల్ ఎంపి మల్లు రవి అన్నారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మంత్రి వర్గ విస్తరణను సిఎం అడ్డుకుంటున్నారని అనడం ఆయన అవివేకం అని అభిప్రాయపడ్డారు.అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అద్భుతమైన ప్రగతి తెలంగాణ సాధిస్తుండడం తో వాళ్లకు ఏమి మాట్లాడాలో తెలియక పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శంచారు. బిజెపి రాష్ట్రాల్లో ఎక్కడైనా మహిళకు ఉచిత బస్ సౌకర్యాలు ఉన్నాయా అని నిలదీశారు. బిజెపి పాలకులు సన్న బియ్యం ఇస్తున్నారా?, ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తున్నారా?. 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ ఇస్తున్నారా.? 500 రూపాయలకు గ్యాస్ ఇస్తున్నారా? ఇవేమీ ఇవ్వడానికి బీజేపీ నాయకులకు చేతకాదు అని ఆయన నిష్ఠూరాలు పలికారు.రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించి యువత కు ఉద్యోగాలు ఇప్పిస్తున్నాము ఇప్పటికే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పెడుతున్న, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్న కూడా బీజేపీ నాయకులకు అవన్నీ కనిపించడం లేదని ఆవేదన చెందారు. మంత్రి వర్గం విడిపోతే ఇవన్నీ ఇలా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎలా సాధ్యమో బీజేపీ నాయకులు చెప్పగలరా అని సవాల్ విసిరారు. బిజెపి పార్టీ లో తీవ్రమైన వర్గపోరు ఉంది. అందుకే చాలా కాలంగా బిజెపి అధ్యక్షుల ఎంపిక వాయిదా పడుతుంది అని భాష్యంచెప్పారు.రోజు మీడియాలో ఉండాలంటే కాంగ్రెస్ పైన, ప్రభుత్వంపైన ఏదో ఒక అబద్ధాల ప్రచారం చేయాలన్నది బిజెపి ఎత్తుగడ అని మల్లురవి అభిప్రాయం వ్యక్తం చేశారు..బీజేపీ నాయకులు గోబెల్స్ వారసులన్నారు. వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై, మంత్రివర్గంపై ఎన్ని అవాకులు,చెవాకులు మాట్లాడినా ప్రజలు నమ్మరని మల్లు రవి అన్నారు.



## కడెం పరీవాహక ప్రాంతాల్లో ముంపు నివారణకు చర్యలు చేపడతాం

### ప్రాజెక్టును పరిశీలించిన ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** కడెం నది పరివాహకంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అవసరమైన పటిష్ట చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన కడెం ప్రాజెక్టును సందర్శించి, గేట్ల పనితీరు, వరద నియంత్రణ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్ డి ఆర్ ఎఫ్ డిప్యూటీ కమాండర్ దామోదర్ సింగ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ప్రాజెక్టు వద్ద జరిగిన విస్తృత సమీక్షలో ప్రత్యేక కార్యదర్శి పాల్గొన్నారు. గతంలో ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగిన సమయంలో గేట్లు ఎత్తే ప్రక్రియలో లోపాలు తలెత్తిన నేపథ్యంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినట్టు జిల్లా కలెక్టర్ వివరించారు. దీనిపై స్పందించిన అర్వింద్ కుమార్, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కడెం, దస్తురాబాద్ మండలాల్లో వరద ముప్పుకు గురయ్యే 10 నుంచి 12 గ్రామాల్లో మెరుగైన అలారం వ్యవస్థ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్షాలు అధికంగా కురిసినప్పుడు వరద నీటిని సమర్థవంతంగా నియంత్రించేందుకు నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ప్రాజెక్టు నిర్వహణ తీరును పరిశీలించిన ప్రత్యేక కార్యదర్శి ఇంజనీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఎస్ఇ రవీందర్, ఇఇవిట్టల్, తహశీల్దార్లు ప్రభాకర్, సర్పరాజ్, ఎంపిడిఒ అరుణ, తదితరులు పాల్గొన్నారు.



# ఆర్సీబి వర్సెస్ కెకెఆర్ మ్యాచ్‌కు వర్షం అడ్డంకి

## రద్దుచేసి చెరొక పాయింట్ కేటాయించిన నిర్వాహకులు

**బెంగళూరు, మే 17:** తొమ్మిదిరోజుల విరామం తర్వాత ఐపిఎల్ మళ్లీ పునః ప్రారంభం కావడంతో ధనాధన్ ఎంటర్‌టైన్‌మెంట్ లభిస్తుందని అందరూ ఆశించారు. అయితే శనివారం చిన్నస్వామి స్టేడియంలోజరిగే ఆర్సీ బీ, కోల్‌కత్తా నైట్‌రైడర్స్ మ్యాచ్‌కకు వర్షం అడ్డంకిగామారింది. కనీసం టాస్‌కూడా పడకుండానే మ్యాచ్ రద్దయింది. రెండు జట్లకు చెరొక పాయింట్‌కేటాయించారు. మ్యాచ్‌కు వర్షం ముప్పుపొంచి ఉన్నట్లు వాతావరణశాఖ ముందే అంచనావేసింది. అందుకు తగినట్లే సాయంత్రం నుంచి వర్షం ప్రారంభం అయింది. చిన్నపాటి జల్లుగా మొదలై క్రమంగా జోరందుకుంది. తర్వాత వరుణుడు కొద్దిసేపు శాంతించడంతో మ్యాచ్ నిర్వహణకు వీలుగా మైదానాన్ని సిద్ధంచేయడానికి సిబ్బంది రంగంలోకి దిగారు. అయితే కాసేపటికే మళ్లీ వర్షం కురిసింది. వర్షం తగ్గితే కనీసం ఐదు ఓవర్ల మ్యాచ్అయినా నిర్వహించాలని ఎదురుచూసారు. ఎడతెరిపిలేని వర్షంతో మ్యాచ్‌ను రద్దుచేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. మ్యాచ్ రద్దుకావడంతో కోల్‌కత్తాజట్టు ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. జట్టు ప్లే ఆఫ్స్ రేసునుంచి నిష్క్రమించింది. ప్రస్తుతం కెకెఆర్ 13 మ్యాచ్‌లు ఆడి 12 పాయింట్లతో ఉంది. చివరిలీగ్‌మ్యాచ్‌లో గెలిచినా కోల్‌కత్తాకు ప్రయోజనం లేదు. ఇక కెకెఆర్‌పై గెలిచి అధికారికంగా ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకుందామనుకున్న ఆర్సీబీకి నిరాశే ఎదురయింది. 12 మ్యాచ్‌లు ఆడి 17 పాయింట్లతో ఉన్న బెంగళూరు రెండు మ్యాచ్‌ల్లో ఓడినా ప్లేఆఫ్స్‌కు చేరేందుకు ఛాన్స్ ఉంది.

# మెట్రోచార్జీల పెంపుతో మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థికభారం

## నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని

## సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ ఎమ్మెల్యేల లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 17:** హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు ఛార్జీల పెంపు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ పరిధిలోని 11 మంది బీఆర్ఎస్ శాసనసభ్యులు నేడు ఈ లేఖను సీఎంకు పంపించారు. చార్జీల పెంపు నగరవాసులపై, ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలపై తీవ్ర ఆర్థిక భారం మోపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ లేఖలో, బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన మెట్రో రైలు సేవలను లక్షలాది మంది ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు తమ ప్రధాన రవాణా మార్గంగా వినియోగిస్తున్నారని ఎమ్మెల్యేలు గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో టికెట్ ధరలను పెంచాలని చూడటం వల్ల, నిత్యం ప్రయాణించే వారిపై ఇది పెనుభారంగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్రోల్, నిత్యావసరాల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న ప్రజలపై ఈ పెంపు మరింత భారం వేస్తుందని అన్నారు. టికెట్ ధరలను రూ.10 నుంచి రూ.20 వరకు పెంచితే, ఒక సాధారణ ప్రయాణికుడి నెలవారీ ఖర్చు కనీసం రూ.500 నుంచి రూ.600 వరకు పెరుగుతుందని, ఇది కుటుంబ బడ్జెట్‌ను దెబ్బతీస్తుందని వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థల ప్రాథమిక ఉద్దేశం ప్రజలకు చవకైన, వేగవంతమైన, నమ్మకమైన సేవలు అందించడమేనని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ప్రజా రవాణా వ్యవస్థను దెబ్బతీసేలా ఉందని ఎమ్మెల్యేలు ఆరోపించారు. సింగపూర్, బెర్లిన్, టోక్యో వంటి అంతర్జాతీయ నగరాల్లో ప్రభుత్వాలు సబ్సిడీలు ఇచ్చి ప్రజా రవాణాను ప్రోత్సహిస్తున్నాయని గుర్తు చేశారు. విశ్వనగరంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ఉన్న హైదరా బాద్‌లో కూడా ప్రజా రవాణాను బలోపేతం చేసి, తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని వారు సూచించారు.

# రక్షణ ఉపగ్రహం నేడే నింగిలోకి

## ఉదయం 5.59 గం.కే ముహూర్తం

## షార్‌లో పర్యటిస్తున్న కేంద్ర పార్లమెంటరీ బృందం సభ్యులు

**శ్రీహరికోట (తడ), మే 17 ప్రభాతవార్త:** శ్రీహరికోట నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు రక్షణ ఉపగ్రహాన్ని పిఎస్ ఎల్‌వి-సి61 రాకెట్ నింగికి మోసుకెళ్ల నుంది. ఇందుకు సంబంధించి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి.నారాయణన్‌తో పాటు సీనియర్ శాస్త్రవే త్తలు, షార్ అధికారులు ఏర్పాట్లు చేస్తు న్నారు. శనివారం ఉదయం 7.59 గంట లకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. రెండు, నాలుగవ దశలలో ఘన ఇంధనం నిం పడం కాకుండా రాకెట్‌లోని అన్ని ఎలక్ట్రి కల్, ఎలక్ట్రానిక్స్ పనితీరును కౌంట్‌డౌన్‌లో ఎప్పటికప్పుడు తెలుసుకుంటు న్నారు. శ్రీహరికోట మొదటి ప్రయో గ వేదిక నుంచి ఈ రాకెట్ నింగికి నిచ్చెన వేయనుండగా, రక్షణ ఉపగ్రహం ఇఓఎస్09 దీని ద్వారా ప్రయోగిస్తున్నారు. ప్రయోగ సమయంలో రాకెట్ బరువు 321 టన్నులు కాగా, ఉపగ్రహం బరువు 1696.24 కిలోల బరువుగా ఉంది. అంతరిక్షంలోని 534 కిలోమీటర్ల దూరంలో 18 నిమిషాలలోపే ఇఓఎస్9ను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టేలా ఈ ప్రయోగం జరుపుతున్నారు. ఇఓఎస్09 భారత రక్షణ దళానికి ఎంతో ఉపయోగపడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు ఇప్పటికే పేర్కొన్నారు. ఈ కీలక ఉపగ్రహ ప్రయోగ వేళ పార్లమెంటరీ కమిటీ బృందం షార్‌లో పర్యటన చేస్తోంది. శనివారం కూడా సుమారు 18 మందితో కూడిన ఎంపీలు, ఇతర ముఖ్య అధికారులు శ్రీహరికోటలోని వివిధ అంతరిక్ష కేంద్రాలను పరిశీలించారు. రాకెట్ అనుసంధాన భవనాలు, ప్రయోగ వేదికలు, మిషన్ కంట్రోల్ సెంటర్ తదితర ప్రాంతాల పర్యటన అనంతరం స్థానిక నక్షత్ర హోటల్‌లో ఇస్రో పెద్దలతో కీలక సమావేశాలు జరిపారు. ఈ పర్యటన కేవలం రాకెట్ ప్రయోగ వీక్షణ కోసమే కాకుండా శ్రీహరికోట అభివృద్ధికి సంబంధించి విస్తృతమైన చర్చలు జరిపినట్లు తెలిసింది. భవిష్యత్‌లో నిర్మాణం జరుపుకోనున్న మూడవ ప్రయోగ వేదిక లాంటివి ఇందులో ఉన్నాయి. శ్రీహరికోటలో రాకెట్ ప్రయోగాలు కొత్త కొకపోయినా ఇప్పటికి వంద పూర్తి చేసుకుని, ప్రస్తుతం 101 ప్రయోగం జరుగుతున్నప్పటికీ గతంలో ఎన్నడూ లేని విధంగా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలు, తిరుపతి జిల్లా పోలీసులు, ఇంటలిజెన్స్, నావికా దళ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.



పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్

# మావోయిస్టు పార్టీ మరింత నిర్వీర్యం!

## కొత్త ఎత్తుగడలతో పోలీసులు

## డిసెంబర్‌కల్లా వెయ్యిమంది లొంగుబాటుకు వ్యూహం

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేసేందుకు కేంద్రం చేబట్టిన ఆపరేషన్ కగార్ ఓవైపు వేగం గా సాగుతుండగా మరోవైపు భారీగా నక్సలైట్ల లొంగు బాట్లను పెంచేందుకు తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ పోలీసులు ప్రయత్నాలు చేబట్టారు. ఈ ఏడాది చివరి నాటికి మరో వెయ్యి మంది వరకు మావోయిస్టుల లొంగుబాట్లు వుండేలా చర్యలు తీసుకోసాగారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 250 మందికి పైగా నక్సలైట్లు లొం గిపోగా ఈ సంఖ్యను మరింత పెంచేందుకు ఇరు రాష్ట్రాల పోలీసులు ఉమ్మడి వ్యూహం అమలు చేస్తున్నారు.

నిషిద్ధ మావోయిస్టు పార్టీని మరింతగా నిర్వీర్యం చేసేందుకు కేంద్రంతో పాటు ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ పోలీసులు కొత్త తరహా ఎత్తుగడలను అనుసరించేందుకు నిర్ణయించారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఓవైపు కూంబింగ్ నిర్వహిస్తూనే మరోవైపు లొంగుబాట్లను భారీగా పెంచేందుకు క్షేత్రస్థాయిలో పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేయసాగారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్‌లలో కేంద్ర బలగాలతో పాటు ఆయా రాష్ట్రాల పోలీసులు వరుసగా నక్సలైట్ల స్థావరాలను ధ్వంసం చేసుకుంటూ దూసుకు పోతుండడం తెలిసిందే. మరింత ముందుకు వెళ్లేందుకు ఎక్కడికక్కడ బేస్ క్యాంప్‌లను కూడా ఏర్పాటు చేసుకుంటు న్న భద్రతా బలగాలు ఇదే సమయంలో స్థానికుల నుంచి సహాయం పొందడలో చాలా వరకు సఫలమైనట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. గతంలో న క్సలైట్లకు పట్టువున్న ప్రాంతాలలో పోలీసులకు పెద్దగా సహకారం అందేది కాదు. కానీ ప్రస్తుతం దీనికి భిన్నంగా ఆయా ప్రాంతాలలో స్థానికులు పోలీసులకు స హకరిస్తున్నారని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు మావోయిస్టు పార్టీకి చెందిన అగ్ర నాయకులతో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు అనారోగ్య కా రణాలు, కుటుంబ నేపథ్యం కారణంగానే లొంగిపోయేవారు. ఇదే సమయంలో లొంగిపోయిన నక్సలైట్లు కూడా ఇదే విషయాన్ని చెప్పేవారు. ఒకటి రెండు సం దర్భాల లోనే లొంగిపోయిన నక్సలైట్లు మావోయిస్టు పార్టీపై విమర్శలు చేసిన ఉదంతాలున్నాయి. కానీ గడచిన రెండేళ్ల కాలంలో పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు రాష్ట్ర, కేంద్రస్థాయి నాయకులు తమ పార్టీపై ఇదివరకెన్నడూ లేనంతగా విమర్శలు చేయడం గమనార్హం. దీంతో పాటు పోలీసుల నిర్బంధం పెరి గిన దరిమిలా లొంగుబాట్లు మరింతగా పెరిగాయి. ఇక మావోయిస్టు పార్టీలో వున్న అగ్ర నాయకులంతా తెలుగు రాష్ట్రాలకు చెందిన వారే కావడం గమనార్హం. తెలుగు రాష్ట్రాలకు చెందిన అగ్ర నాయకుల్లో మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి సహా ఇతర నాయకులు కీలక స్థా నాల్లో వున్నారు. ఇందులో కొందరు ఉమ్మడి ఎపి హయాంలో పోలీసుల కూంబింగ్ సమయంలో తృటిలో తప్పించుకోగా మరికొందరు తెలంగాణ రాష్ట్రం ఏర్పా టయ్యాక పోలీసులకు సవాల్‌గా మారారు. అయితే మావోయిస్టు పార్టీలో వున్న అగ్రనేతలంతా వయో భారంతో వున్న వారే కావడంపై పోలీసులు దృష్టి సారిం చారు. ఇదే సమయంలో వీరిలో అనేక మంది వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయమై కూడా పోలీసులు సమాచారం సేకరించారు.

ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యులు, స్నేహితుల చేత ఒత్తిడి చేయించి లొంగిపోయేలా చూడాలన్నది పోలీసుల వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది. లొంగిపోయిన వారికి భారీ ప్యాకేజి ఇచ్చేందుకు పోలీసు శాఖ రెడీ అవుతోంది. ఛత్తీస్‌ఘడ్‌తో పాటు ఆ రాష్ట్రంతో సరిహద్దులు పంచుకుంటున్న తెలంగాణ జిల్లాల ఎస్‌పిలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నక్సలైట్ల నేతల కుటుంబీలకులను కలుస్తూ లొంగుబాట్లు పెంచేలా కృషి చేస్తున్నారు. నక్సలైట్లు లొంగిపోతే వారు గౌరవంగా జీవించే oదుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. నక్సలైట్ల కుటుంబీకుల్లో అనేక మంది బీదరికంతో వుండడంతో వారికి పోలీసు అధికారులు కొన్ని నెల లకు సరిపడ నిత్యావసర సరుకులతో వృద్ధులకు వైద్య సేవలకు ఏర్పాట్లు చేశారు. ఇది చాలా మంది ద్వితీయశ్రేణి నక్సలైట్లలో మార్పు వచ్చి వారిని లొంగిపో యేలా చేస్తోంది. పోలీసులకు లొంగిపోయి ఇక్కడ జనజీవన స్రవంతిలో వుంటే ఎదురయ్యే సమస్యలు చాలా వుండడంతో ఎవరైనా విదేశాలకు వెళ్లాలనుకుంటే ఇందుకు కూడా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖ భావిస్తున్నట్లు తెలిసింది. ఓవైపు అగ్ర నాయకులను లొంగుబాట్లకు ఒత్తిడి తెస్తూనే మరోవైపు రాష్ట్ర స్థాయి నా యకులను కూడా లొంగిపోయేలా చేయాలన్నది పోలీసుల వ్యూహంగా కనిపిస్తోంది. ఇలా చేయడం ద్వారా నూతన భర్తీలు పూర్తిగా నివారించ వచ్చని పోలీసు లు భావిస్తున్నారు.

# రక్షణరంగ కొనుగోళ్లకు రూ.40 వేలకోట్లు ఆమోదం

## రక్షణశాఖ కొనుగోళ్ల కమిటీ గ్రీన్‌సిగ్నల్

**న్యూఢిల్లీ, మే 17:** భారత్‌పాక్ ఉద్రిక్తతల వేళ రక్షణ దళాలకు మరింత బలాన్ని ఇచ్చేలా భారీ ప్రోత్సా న్ని అందించనున్నారు. పరిశోధన, ఆయుధాలు, మందుగుండు, యుద్ధ సామాగ్రిని కొనుగోలు కోసం రూ.40 వేల కోట్లకు రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. అత్యవసర అధికారాల కింద ఈ కొనుగోళ్లకు ఇటీవల రక్షణ మంత్రిత్వ శాఖ, సైనిక ఉన్నతాధికారుల సమావేశంలో ఆమోదం తెలిపినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అత్యవసర అధికారాల కింద, రక్షణ దళాలు నిఘా డ్రోన్లు, కమికజ్ డ్రోన్లు, లాంగ్ రేంజ్ లూటరింగ్ క్షిపణులు, రాకెట్లు వంటి సామగ్రిని కొనుగోలు చేయడంపై రక్షణ శాఖ దృష్టి సారిస్తుంది. అత్యవసర అధికారాల కింద ఒప్పందాలు కుదుర్చు కుంటున్న పరికరాలను నిర్ణీత వ్యవధిలోపు బల గాలను అందిచాలని నిర ్ణయించారు. గత ఐదు సంవత్సరాల్లో ఇలా కొను గోలు కోసం కేటాయిం చడం ఇది ఐదోసారి. రక్షణ ఆర్థిక విభాగం, ఆర్థిక సలహాదారులతో కలిసి ఈ కొనుగోళ్లను చేస్తాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. పాక్‌స్థావరాలపై దాడి చేయడానికి ఉపయో గించిన రాంపేజ్ మిసైల్ కూడా కూడా అత్యవసర కొనుగోలు అధికారాల కింద రక్షణ దళాలు కొనుగోలు చేశాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రత్యక్ష కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఉపయోగించిన హెరాన్ మార్క్2 డ్రోన్‌లను కూడా భారత్ ఇలానే కొనుగోలు చేసింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రక్షణ రంగానికి రూ.50వేల కోట్ల మేర బడ్జెట్‌లో అదనపు కేటాయింపులు చేపట్టవచ్చని సంబందిత వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం ఆ దిశగా సన్నాహాలు చేస్తుందని తెలిపాయి. ఈ ఏడాది రక్షణశాఖ కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. తాజాగా పెంపునకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం విధిగా లభిస్తుంది. దీంతో డిఫెన్స్‌కు కేటాయించిన నిధులు రూ. 7లక్షల కోట్లు దాటేస్తాయి.



# పాక్ ఐఎంఎఫ్ రుణప్యాకేజీలో అమెరికా ఒత్తిడికి తలొగ్గిన భారత్

## జైరామ్‌రమేష్ ఎద్దేవా

**న్యూఢిల్లీ, మే 17:** పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం మంజూరు విషయంలో మోదీ సర్కార్ అమెరికా ఒత్తిడికి తలొగ్గిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఉగ్రవాదులను ప్రోత్సహించే పాకిస్థాన్‌కు రుణాలుమంజూరు చేసే అంశంపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) పునరాలోచన చేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరిన ఒక రోజు తరువాత కాంగ్రెస్ ఈ ఆరోపణలు చేయడం గమనార్హం. ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ సమావేశంలో పాకిస్థాన్‌కు రుణాలు మంజూరు చేయడంపై చర్చ జరుగుతున్నప్పుడు మోదీ సర్కార్ అమెరికా ఒత్తిడికి తలొగ్గిందని కాంగ్రెస్ నేత జైరామ్‌రమేష్ ఆరోపించారు. అందుకే ఐఎంఎఫ్ మీటింగ్‌కు భారత్ గైర్హాజరయ్యిందని గుర్తుచేసారు. ఎగ్జిక్యూటివ్ బోర్డ్‌లో ఓటు వేయడానికి అవకాశం ఉందని 2016 సెప్టెంబర్‌లో ఉక్రెయిన్‌కు రుణం మంజూరు ప్రతిపాదన వచ్చినప్పుడు రష్యా నో ఓటు హక్కును వినియోగించుకుందని గుర్తుచేసారు. 2005 సెప్టెంబర్ 11న జింబాబ్వే బహిష్కరణ అంశంపై భారత్ కూడా నో ఓటు వేసింది. ఏదేమైనా, సంకల్పం ఉంటే మార్గం ఉంటుంది. కానీ మోదీ సర్కార్, పాక్‌కు రుణాలు మంజూరు చేయడానికి ఐఎంఎఫ్ తీర్మానించినప్పుడు మిన్నకుండిపోయింది. కానీ ఇప్పుడు రాజ్‌నాథ్ సింగ్ దాని గురించి పునరాలోచన చేయాలని కోరడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి జైరామ్‌రమేష్ అన్నారు. 9న వాషింగ్టన్‌లో జరిగిన బోర్డ్ సమావేశంలో ఐఎంఎఫ్ పాకిస్థాన్‌కు 1 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం నిర్ణయించింది. దీనిని వ్యతిరేకించిన భారత్, ఇస్లామాబాద్ సదరు నిధులను ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలకు తగినంత నిధులు సమకూర్చుకోవడానికి వినియోగించవచ్చని పేర్కొంది. గుజరాత్‌లోని భుజ్ వైమానిక స్థావరాన్ని సందర్శించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అక్కడి యోధులతో ముచ్చటించారు. పాక్‌కు ఐఎంఎఫ్ ఆర్థిక సాయం అందించకూడదని పేర్కొన్నారు. ఒక వేళ అలాంటి సాయం ఏదైనా చేస్తే ఉగ్రవాదులకు నిధులు సమకూర్చినట్లు అవుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మురిద్కే, బహావాల్పూర్‌ల్లో ఉన్న లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాదులకు మౌలిక సదుపాయాలను పునర్నిర్మించడానికి పాక్ ఐఎంఎఫ్ నిధులు వాడుకునే అవకాశం ఉందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.



# దేశంలోనే భూభారతి రోల్‌మోడల్

## ధరణితో రైతులు అరిగోస పడ్డారు: మంత్రి పొంగులేటి



**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** భూభారతి చట్టం రైతుల చుట్టమని, రైతులు, ప్రజల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని, పేదలకు న్యాయం చేయడమే లక్ష ్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సం బంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో లక్షలాదిమంది ప్రజలు, మేధావుల అభిప్రాయాలు సేకరించి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును మంత్రి శ్రీనివాస్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రితోపాటు ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఎస్పీ అశోక్ కుమార్ హాజరయ్యారు. రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేసిన మంత్రి, విప్, కలెక్టర్ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం దేశంలోని రోల్ మోడల్ గా నిలుస్తుందని, 18 రాష్ట్రాలలో భూ చట్టాలపై అధ్యయనం చేశామని, అక్కడ భూ సమస్యలకు సంబంధించి ఏమేం చర్యలు చేపట్టారావు తెలుసుకున్నామన్నారు. లక్షలాది మంది ప్రజలు, మేధావుల అభిప్రాయాలు ఆకాంక్షల మేరకు భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదవారికి న్యాయం జరగాలని, భూమి ఉన్న ఆసాములకు ఇబ్బందులు కలగవద్దని ఉద్దేశంతోనే అద్భుతమైన చట్టాన్ని తెచ్చామని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, అందులో భాగంగానే జూన్ రెండు నుంచి రాష్ట్రంలోని పదివేల పైగా రెవెన్యూ గ్రామాలకు రెవెన్యూ అధికారులకు కేటాయిస్తామని చెప్పారు.

ప్రతి భూసమస్యకు పరిష్కారం లభించే విధంగా భూభారతి చట్టాన్ని రూపొందించామని, తహసీల్దార్ స్థాయి నుంచి సిసిఎల్‌ఏ వరకు అధికారాలను వికేంద్రీకరించి రైతులకు మేలు జరిగేలా చూస్తున్నామన్నారు. భూ సమస్యలకు సంబంధించి ఆపిల్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల ఆఖరి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేస్తామని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు అందించి తీరుతామని ఈ కార్యక్రమము ఐదేళ్ల వరకు కొనసాగుతుందని, ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. ఈ నెలాఖరు వరకు ప్రతి నియోజకవర్గానికి 3500 రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు.

# సిగరెట్ తెచ్చివ్వనందుకు ఎస్‌యువితో ఢీకొట్టి హత్య

**బెంగళూరు, మే 17:** బెంగళూరు నగరంలో సిగరెట్ విషయమై తలెత్తిన చిన్న గొడవ చివరికి ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రాణాలు కోల్పోయేలా చేసింది. ఈ అమానవీయ సంఘటన కనకపుర రోడ్డులోని వసంతపుర క్రాస్ సమీపంలో ఈనెల 10న తెల్లవారుజామున జరిగింది. మృతుడిని వజరహళ్ళికి చెందిన హెచ్.ఎన్. సంజయ్ (29)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం, సంజయ్ తన సహోద్యోగి చేతన్ (30)తో కలిసి సుబ్రమణ్యపుర ప్రాంతంలోని ఒక దుకాణం వద్ద సిగరెట్ తాగుతున్నారు. అదే సమయంలో ప్రతీక్ అనే వ్యక్తి తన ఎస్‌యూవీ వాహనంలో అక్కడికి వచ్చాడు. దగ్గరలోని దుకాణం నుంచి తనకు ఒక సిగరెట్ తీసుకురమ్మని సంజయ్‌ను కోరాడు. ఇందుకు సంజయ్ నిరాకరించడమే కాకుండా, ఆ వ్యక్తిని మందలించినట్లు సమాచారం. దీంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసింది. ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ప్రకారం, ఈ క్రమంలో ప్రతీక్ సంజయ్‌పై భౌతికంగా దాడి చేశాడని తెలిసింది. ఆ తర్వాత, సంజయ్, చేతన్ ఇద్దరూ తమ మోటార్‌సైకిల్‌పై అక్కడి నుంచి బయలుదేరారు. అయితే, వారిని వెంబడించిన ప్రతీక్, తన ఎస్‌యూవీతో వెనుక నుంచి వారి బైక్‌ను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యాడని ఆరోపణలున్నాయి. ఈ ఘటనలో బైక్ పైనుంచి కిందపడిన సంజయ్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గాయపడిన చేతన్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘటనపై చేతన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తొలుత హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

# నా హత్యకు కోమి కుట్ర చేసాడు.. డొనాల్డ్ ట్రంప్

**న్యూయార్క్, మే 17:** ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్ జేమ్స్ కోమీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ఆరోపణలు చేశారు. తనను హత్య చేసేందుకు కోమీ కుట్ర పన్నారని, ఇందుకోసం కోడ్ భాషలో బెదిరింపులకు






పాల్పడ్డారని ట్రంప్ ఆరోపించారు. జేమ్స్ కోమీ ఒక బ్యాడ్ కాప్ (చెడ్డ పోలీసు అధికారి) అని ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జేమ్స్ కోమీ ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 86 47 అనే కోడ్‌ను పోస్ట్ చేసి, ఆ తర్వాత దానిని తొలగించారు. ఈ కోడ్‌కు అమెరికా 47వ అధ్యక్షుడిని చంపడం అనే అర్థం వస్తుందని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ స్పందిస్తూ, ఆ కోడ్ అర్థం జేమ్స్ కోమీకి కచ్చితంగా తెలుసు. నన్ను హత్య చేయాలనేది అతని ఉద్దేశమని స్పష్టమవుతోంది. కోమీ సమర్థుడు కాకపోవచ్చు, కానీ ఆ కోడ్ అర్థం చేసుకునేంత తెలివి అతనికి ఉంది. దేశాధ్యక్షుడిని చంపాలని కోమీ పిలుపునిచ్చాడని విమర్శించారు. అయితే, ఈ ఆరోపణలపై జేమ్స్ కోమీ స్పందించారు. తాను బీచ్‌లో షెల్స్ చిత్రాన్ని పోస్ట్ చేశానని, అధికారులు దానిని తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు. ఆ నంబర్లను హత్యలకు ఉపయోగిస్తారనే విషయం తనకు తెలియదని, అమెరికా అధ్యక్షుడిని చంపాలనే ఉద్దేశం తనకు ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. అనవసర ఆరోపణలు రావడంతోనే పోస్ట్‌ను డిలీట్ చేసినట్లు కోమీ వివరణ ఇచ్చారు. కోమీ పోస్ట్‌పై అమెరికా సీక్రెట్ సర్వీస్ సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ తెలిపారు. ఇప్పటికే సీక్రెట్ సర్వీస్ అధికారులు కోమీని ప్రశ్నించినట్లు అక్కడి మీడియా వర్గాలు పేర్కొన్నాయి. కాగా, గతంలోనూ డొనాల్డ్ ట్రంప్‌పై పలుమార్లు హత్యాయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. గత ఏడాది ఎన్నికల ప్రచారంలో పెన్సిల్వేనియాలో దుండగుడి కాల్పుల్లో ట్రంప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఫ్లోరిడాలో గోల్ఫ్ ఆడుతుండగా ఓ వ్యక్తి తుపాకీతో ఫెన్సింగ్ వద్దకు రావడం, మరో సమావేశం సమీపంలో ఏకే47తో ఓ వ్యక్తిని అరెస్టు చేయడం వంటి ఘటనల నేపథ్యంలో ట్రంప్‌కు భద్రతను భారీగా పెంచారు. తాజా పరిణామాల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది.

# ఆగస్టు 15 నుంచి ఎపిలో మహిళలకు ఉచిత బస్సు

## స్వాతంత్ర్య దినోత్సవ కానుక ప్రకటించిన ఎపి సిఎం చంద్రబాబు

## హరిత ఇంధన కేంద్రంగా రాయలసీమను తయారుచేస్తాం

**కర్నూలు, మే 17, ప్రభాతవార్త :** స్వచ్ఛాంధ్ర లక్ష్య య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పర్యావరణ పరిరక్షణకు కలిసికట్టుగా కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపు నిచ్చారు. తెలుగుదేశం హయాంలో రాయల సీమలో ఫ్యాక్షనిజాన్ని కూకటివేళ్లతో పెక లించివేశామని, భవిష్యత్తులోనూ సీమ గడ్డపై ఫ్యాక్షన్ మాట వినబడనివ్వమని స్పష్టం చేశారు. సీమకు పరిశ్రమలు తెచ్చి పెద్దఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, హరిత ఇంధన కేంద్రంగా సీమను తయారుచేస్తామని అన్నారు. ఆగస్టు 15 నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. కర్నూలు నగరంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పెట్టాను. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం. మన ఇల్లు, పరిసరాలు శుభ్రం చేసు కోవాలి. పల్లెలు, పట్టణాలు, చెరువులు, ప్రభు త్వ కార్యాలయాలు, పరిశ్రమలు, ఆస్పత్రులు, విద్యాలయాల్లో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహించాలి. దుమ్ము దులిపి స్వచ్ఛమైన ఆలోచనలు చేయాలి. ఆధునిక ప్రపంచంలో చాలామంది అనారోగ్యం పాలవుతున్నారు. ప్రతిరోజూ అందరూ యోగా చేయాలి. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ విశాఖ వస్తున్నారు. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకూ యోగా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తాం. నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకు న్నాం. గత ప్రభుత్వం పట్టణాల్లోనే 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలేసిపోయింది. అక్టోబర్ 2నాటికి రాష్ట్రంలో చెత్తలేకుండా చేస్తాం. చెత్త నుంచి ఎనర్జీ తీసే ప్రాజెక్టులు ప్రస్తుతం రెండు పనిచేస్తున్నాయి. భవిష్యత్‌లో రాజమండ్రి, విజయవాడ, నెల్లూరు, కడపలో అందుబాటులోకి వస్తాయి. వీటి వల్ల 90 శాతం పట్టణ ప్రాంతాల్లో ఉండే చెత్త ఎనర్జీగా తయారవుతుంది. పల్లె పుష్కరిణి అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చెరువులు శుభ్రం చేయబోతున్నాం. చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్స్ వేస్తాము. 123 మున్సిపాలిటీ మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్లు పెట్టాం. అనంతపురం, సత్యసాయి జిల్లాలు ఓడీఎఫ్ ప్లస్ గా నిలిచాయి. 15, 995 రైతు బజార్లు కూడా విజయవంతంగా నడిపించాం. సీమ అభివృద్ధి నా బాధ్యత...... నేను సీమ బిడ్డను సీమ అభివృద్ధి నా బాధ్యత. ఒకప్పుడు రాయలసీమ అంటే కరువు, ఫ్యాక్షన్ అనేవారు. నేను వచ్చాక సీమలో ఫ్యాక్షనిజం మాటే వినబడకుండా చేశాను. కరువు రక్కసి నుంచి సీమ ప్రజలను కాపాడాము. సీమను హారి ్టకల్చర్ హబ్‌గా తయారుచేస్తామని అన్నారు.



శనివారం కర్నూలు సభలో ప్రసంగిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు

# 'శుభం' సక్సెస్ మీట్

ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద ప్రముఖ నటి సమంత నిర్మించిన తొలి చిత్రం శుభం. హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పెరి, శ్రియా కొంతం, శ్రావణి లక్ష్మీ, షాలినీ కొండెపూడి, వంశీధర్ వంటి వారు ప్రధాన పాత్రలుగా పోషించిన ఈ చిత్రాన్ని ప్రవీణ్ కండ్రేగుల



తెరకెక్కించారు. ఈ మూవీ మే 9వ తేదీన విడుదలై సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతూ రెండో వారంలోకి అడుగు పెట్టేసింది. ఈ క్రమంలో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో, నటి, నిర్మాత సమంత మాట్లాడుతూ,పది శాతం సక్సెస్ రేట్ ఉన్న ఈ ఇండస్ట్రీ లోకి ఎలా వచ్చానా? అన్నది ఇప్పుడు నాకు అర్థం అవుతోంది. శుభం మూవీకి పని చేసిన ప్రతీ ఒక్కరితో నవ్వులు, సంతోషం కనిపిస్తోంది. ఇదే అసలైన సక్సెస్. ఇలాంటి ఆనందం చూడటానికే నిర్మాతలు ఇంకా ఇంకా సినిమాలు తీస్తూనే ఉంటారు. నాకు ఈ మూవీ చూస్తే నా సమ్మర్ హాలీడేస్ గుర్తుకు వచ్చాయి. పిల్లల్ని సినిమాలకు తీసుకు వెళ్లేందుకు మా అమ్మ ఎంత కష్టపడిందో నాకు తెలుసు. ఓ మూవీని మాఫ్యామిలీ అంతా కలిసి చూసిన రోజులన్నీ నాకు మళ్లీ గుర్తుకువచ్చాయి. అవన్నీ నిన్నే జరిగినట్టుగా అనిపించాయి. శుభంతో అందరినీ మళ్లీ పాత రోజుల్లోకి తీసుకెళ్లాం. మేం ఇలాంటి మంచి చిత్రాలను తీసి ఫ్యామిలీస్‌ను థియేటర్లకు రప్పించేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాం. మీ తీపి జ్ఞాపకాల్ని మళ్లీ మీకు గుర్తు చేస్తూనే ఉంటాం.. అదే మా ట్రాలాలా లక్ష్యం. దాని కోసం ఎంతైనా కష్టపడుతూనే ఉంటాం. నటిగా ఉంటే లాస్ట్‌గా వస్తాం.. ఫస్ట్ వెళ్లిపోతాం. హీరోయిన్‌గా ఉన్నప్పుడు కేవలం నా పాత్ర గురించే ఆలోచించేదాన్ని. కానీ నిర్మాతగా అసలుకష్టాల్ని తెలుసుకున్నాను. సినిమా రిలీజ్‌కుముందు మూడు రోజులు ఏ ఒక్కరూ నిద్రపోలేదు. అంతలా కష్టపడ్డ నా టీంకు సక్సెస్‌రావాలని, క్రెడిట్ దక్కాలని కోరుకున్నాను.ఇప్పుడు వస్తున్న ప్రేమ, అభిమానం, ప్రశంసలు అన్నింటికీ వాళ్లే కారణం. రాజ్ అండ్ హిమాంగ్‌లే ట్రాలాలా బ్యాక్ బోన్‌లా నిలుచున్నారు. ప్రవీణ్ చాలా మంచి వ్యక్తి. ఆయనెప్పుడూ ట్రాలాలాలో ఓభాగం. వసంత్ ఎప్పుడూ మా బ్యానర్‌లో భాగస్వామి. ఎడిటర్ ధర్మేంద్రకి థాంక్స్. వివేక్ సాగర్ తన బీజీఎంతో ప్రాణం పోశారు. క్లింటన్ పాటలు అందరినీ మెప్పిస్తున్నాయి. డైరెక్షన్ టీం అందరికీ థాంక్స్. రామ్ ఆర్ట్ వర్క్, లేడీ కెమెరామెన్ మృదుల్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాకేష్‌కి థాంక్స్.

# 'సింగిల్'ని సక్సెస్ చేసిన ఆడియన్స్‌కి థాంక్స్: అల్లు అరవింద్

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు, ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ సమ్మర్ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ సింగిల్. కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మించారు. మే 9న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా అందరినీ అలరించి సమ్మర్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు.సింగిల్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో ప్రొడ్యూసర్ అల్లుఅరవింద్ మాట్లాడుతూ, ఈ సినిమా రసెస్ చూసిన తర్వాత శ్రీవిష్ణుని పిలిచి గీతఆర్ట్స్‌లో మరో రెండు సినిమాలు చేయాలని చెక్ ఇచ్చాను. మనిషిగా యాక్టర్‌గా తను అంత నచ్చాడు. సినిమా బాగుంటే మేము థియేటర్స్‌కి వస్తాము అని నిరూపించిన ఆడియన్స్ అందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. డైరెక్టర్ కార్తీక్ రాజు అద్భుతంగా ఈ సినిమాని తీశారు. విష్ణుతో నా ప్రయాణం ఇంకా ముందు ముందు ఉంటుంది. తను డైలాగ్ డైలాగ్‌కి మధ్య చెప్పిన డైలాగు



అర్థం చేసుకోవడం నావల్ల కాలేదు( నవ్వుతూ) వెన్నెల కిషోర్ ఈ సినిమాతో కొంచెం దగ్గర అయ్యారు. వ్యక్తిగత సలహాలు తీసుకోవడం దగ్గర వరకు వచ్చింది. కేతిక ఇవాన ఫెంటాస్టిక్‌గా పెర్ఫాం చేశారు. విశాల్ చంద్రశేఖర్ సినిమాకి అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. చాలా ఎంగేజింగ్‌గా చేశారు. యువ దర్శకులంతా వచ్చి ఈ సక్సెస్‌ని సెలబ్రేట్ చేయడం అనేది చాలా ఆనందాన్ని ఇచ్చింది. వారందరికీ థాంక్యూ. విద్య మా అమ్మాయి. తను ఈ సినిమాతో విజయాన్ని అందుకోవడం ఆనందంగా వుంది. ఈ సినిమాలో పని చేసిన టెక్నీషియన్స్‌కి నటీనటులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సమ్మర్లో థియేటర్స్‌కి వచ్చి అద్భుతంగా ఎంజాయ్ చేస్తున్న ఆడియన్స్ అందరికీ థాంక్యూ సో మచ్ అన్నారు. హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ, మూడేళ్ల క్రితం ఈ కథని డైరెక్టర్ కార్తీక్ రాజుగారు నాకు చెప్పడం జరిగింది. అంతకు ముందు ఈ కథని ఒక 15 మంది రిజెక్ట్ చేశారు వాళ్లందరికీ కూడా థాంక్యూ (నవ్వుతూ). సినిమాని చాలా కసిగా చేసాం. నా కసిలో పాలుపంచుకున్న వెన్నెల కిషోర్‌కి థాంక్యూ (నవ్వుతూ) అరవింద్, విద్య రియాజ్, భానుసినిమా బిగినింగ్ నుంచి చాలా సపోర్ట్ చేశారు. మంచి టీంతో చేస్తున్న ఈ సినిమా ఖచ్చితంగా సక్సెస్ కొడితే బావుంటుం దని అనుకున్నాను అది జరిగింది.

# 'మెగా157'లో నయనతార..

మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి మోస్ట్ యాంటిసిపేటెడ్ ప్రాజెక్ట్ మెగా157 త్వరలో సెట్స్ పైకి వెళ్లనుంది. క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్‌గా ఉంటుందని హామీ ఇస్తుంది, చాలా కాలం తర్వాత చిరంజీవి కంప్లీట్ హ్యూమరస్ రోల్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్‌తో కలిసి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్రీమతి అర్చన సమర్పణలో ఈ చిత్రం రూపొందనుంది. మ్యాసీవ్ ఎంటర్ టైనర్స్‌ని క్రియేట్ చేయడంలో, వినూత్నమైన ప్రమోషన్లను రూపొందించడంలో పేరుపొందిన అనిల్ రావిపూడి మరోసారి తన మార్క్ చూపించారు. సంక్రాంతికి వస్తున్నాం విజయంతో దర్శకుడు మెగా157 ప్రమోషన్స్‌కు తన సిగ్నేచర్ టచ్, ఒరిజినాలిటీని తీసుకువస్తున్నారు. చిరంజీవికి జోడిగా నయనతారను హీరోయిన్‌గా పరిచయం చేయడానికి అనిల్ రావిపూడి న్యూ వీడియోను రిలీజ్ చేశారు. ఈ వీడియోలో నయనతార తన టీంతో తెలుగులో మాట్లాడటం, కారు ప్రయాణంలో చిరంజీవి క్లాసిక్ పాటలు వినడం, స్క్రిప్ట్‌ను చదవడం, చిరు ఐకానిక్ డైలాగ్‌లలో ఒకదాన్ని చెప్పడం ఆకట్టుకుంది. ఫైనల్‌గా, అనిల్ రావిపూడి ఆమెతో కలిసి న్యూస్‌ని అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. సైరా నరసింహారెడ్డి, గాడ్‌ఫాదర్ తర్వాత చిరంజీవితో నయనతార మూడవసారి కలిసి పనిచేస్తున్న చిత్రం మెగా157. ఈ యూనిక్ ప్రోమోలో ఆమె కనిపించడం రావిపూడి క్రియేటివిటీకి నిదర్శనం. ఈ వీడియో నయనతార పాత్ర యొక్క హిలేరియస్ నేచర్‌ని సూచిస్తుంది. నయనతార కోసం అనిల్ రావిపూడి ఒక అద్భుతమైన పాత్రను రాశారు, ఇది రిఫ్రెషింగ్‌గా, మెమరబుల్ గా ఉంటుంది. చిరంజీవి, నయనతారల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులకు విజువల్ ట్రీట్ అవుతుంది. అనౌన్స్ మెంట్ నుండి సాంకేతిక బృందాన్ని పరిచయం చేయడం, నయనతారను లీడ్ యాక్ట్రెస్‌గా ప్రకటించడం వరకు జరిగిన ప్రతి ప్రమోషన్ వినూత్నంగా, ఆకట్టుకునేలా సాగుతోంది.






# యాక్షన్ థ్రిల్లర్ 'భైరవం'

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ హీరోలుగా నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం. విజయ్ కనకమేడల దర్శకత్వంలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని పెన్ స్టూడియోస్ అధినేత డా.జయంతి లాల్ గడా సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా అదితి శంకర్, ఆనంది, దివ్యా పిళ్ళై నటిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై భారీ బజ్ క్రియేట్ చేశాయి. భైరవం ఈ సమ్మర్ బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌గా మే 30న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ్ కనకమేడల విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.

**గరుడన్ కథని రిమేక్ చేయడానికి కారణం? ఒరిజినల్ కథకి తెలుగులో తీసుకొచ్చినప్పుడు ఎలాంటి మార్పులు చేశారు?** కథ కమర్షియల్‌గా నాకు చాలా నచ్చింది. అలాగే ముగ్గురు హీరోలతో వర్క్ చేసే ఛాన్స్ కూడా ఉంది. అందుకే ఓకే చేశాను. ఒరిజినల్‌లో ఉన్న ఆర్గానిక్ ఎమోషన్ ఇందులో వుంటుంది. క్యారెక్టరైజేషన్ ప్రజెంటేషన్ నా స్టైల్‌లో ఉంటుంది. తెలుగు సినిమాకి కావాల్సిన కమర్షియల్ వాల్యూస్ అన్నీ ఉంటాయి.

**బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మనోజ్ మంచు ఈ ముగ్గురితో కలిసి పనిచేయడం ఎలా అనిపించింది?** ఫస్ట్ ఈ కథ అనుకున్నప్పుడు సాయిని ఫైనల్ చేసుకున్నాం. తర్వాత రోహిత్‌ని మనోజ్ గారిని కలిసాం. ఇద్దరు ఓకే చెప్పారు. మనోజ్ గారు రోహిత్ చాలా మంచి పర్ఫార్మర్స్. అలాగే వాళ్ళు స్క్రీన్ మీదకి వచ్చి కూడా కొంత గ్యాప్ వచ్చింది. ఒక మంచి యాక్టర్స్ నుంచి మంచి సినిమా వచ్చినప్పుడు డెఫినెట్‌గా ఆడియన్స్ థియేటర్‌కి వస్తారని నమ్మకం ఉంది. ఒరిజినల్‌లో ఉన్న కాన్ ఫ్లిక్ట్ ఎమోషన్స్ అన్నీ ఉంటాయి. అలాగే తెలుగు ఆడియన్స్‌కి కావలసిన ఎమోషన్స్ వుంటాయి.

**ముగ్గురు హీరోలతో సెట్స్ లో వర్క్ చేయడం ఎలాఅనిపించింది? చాలెంజింగ్ మూమెంట్ ఏమిటి?** బిగినింగ్‌లో ముగ్గురు హీరోలను హ్యాండిల్ చేయడం కష్టమవుతుందేమో అనుకున్నాను. అయితే ఈ ముగ్గురు కూడా ఆఫ్ స్క్రీన్ చాలా మంచి ఫ్రెండ్స్. చాలా సపోర్ట్ చేశారు. 14రోజులుపాటు ఫుల్ నైట్స్ వర్క్‌చేసాం. దాదాపు 900 మంది సెట్స్‌లో ఉండే వారు. అ అపోర్షన్ షూట్ చేయడం చాలెంజింగ్‌గా అనిపించింది.

**అతిథి శంకర్ గురించి?** తను కార్తీతో చేసిన సినిమా చూశాను. పెర్ఫామెన్స్ నాకు చాలా నచ్చింది. ఇందులో కూడా సాయి శ్రీనివాస్‌తో తనకి చాలా మంచి కెమిస్ట్రీ ఉంటుంది. తన క్యారెక్టర్‌లో చాలా ఎనర్జీ ఉంటుంది.


డైరెక్టర్ విజయ్ కనకమేడల

# 'ఓ భామ అయ్యో రామ' నుంచి లిరికల్ సాంగ్

సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తుతున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఓ భామ అయ్యో రామ. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ కథానాయకుడు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. వేసవిలో ఈ చిత్రం థియేటర్‌లో సందడి చేయనుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు, పాటలకు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి రామచంద్రుడే



అంటూ కొనసాగే ఓ బ్యూటిఫుల్ పెళ్లి సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. హీరో, హీరోయిన్‌పై అందమైనవిజువల్స్‌తో మోస్ట్ బ్యూటిఫుల్‌గా చిత్రీకరించిన ఈ పెళ్లి సాంగ్‌కు శ్రీ హర్ష ఈమని, పార్థు సన్నిధిరాజు సాహిత్యం అందించగా, టిప్పుఅండ్ హారిణి టిప్పు ఈ సాంగ్‌ను పాడారు. రథన్ ఈ పాటకు ఎంతో ప్లెజెంట్ సంగీతాన్ని అందించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, ఈ పెళ్లి పాట తప్పకుండా అందరి హృదయాలకు హత్తుకుంటుంది. ఇప్పటి వరకు తెలుగు సినిమాల్లో వచ్చిన ఉత్తమమైన పెళ్లి పాటల్లో తప్పకుండా మా రామచంద్రుడే సాంగ్ కూడా ముందు వరుసలో ఉంటుంది.రథన్ ఈ లవ్‌స్టోరీకి చాలా మంచి సంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలో ఉన్న ఆరుపాటలు వేటికవే అనే విధంగా బ్యూటిఫుల్‌గాఉంటాయి. ముఖ్యంగా ఈ పెళ్లి పాట అందరికి ఎంతగానో నచ్చుతుంది అన్నారు. నిర్మాత హరీష్ మాట్లాడుతూ, ఈ సినిమా చేసిన నా టెక్నిషియన్స్, ఆర్టిస్టులు ఎంతో సపోర్ట్ చేసి మంచి ప్రొడక్ట్‌ను తీసుకొచ్చారు. బెస్ట్ క్వాలిటీ సినిమా ఇవ్వబోతున్నాం. పూర్తి ఎంటర్‌టైనింగ్‌గా రాబోతున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మీ హృదయాలను దోచుకుంటుంది. తప్పకుండా నిర్మాతగా ఓ మంచి సినిమాను ఇవ్వబోతున్నాం అనే నమ్మకం ఉంది. త్వరలో విడుదల తేదిని ప్రకటిస్తాం అన్నారు. ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు. మణికందన్ సినిమాటోగ్రఫీని అందిస్తున్న ఈ చిత్రానికి రథన్ సంగీతాన్నిసమాకూరుస్తున్నాడు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. సుహాస్, మాళవిక మనోజ్, అనిత హస్సానందిని, అలీ, రవీందర్, విజయ్, బబ్లూ, పృథ్వీరాజ్, ప్రభాస్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్: భవిన్.ఎమ్.షా.

# 'డాన్ బాస్కో'లో మిర్నామీనన్ కీలక పాత్రధారి

ఎమెర్జింగ్ నిర్మాణ సంస్థ శ్రీ మాయ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోన్న ఔట్ అండ్ ఔట్ కామెడీ ఎంటర్‌టైనర్ డాన్ బాస్కో. శైలేష్ రమ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రముఖ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ నాగవంశీ బావమరిది రుష్య హీరోగా నటిస్తున్నారు. ఇటీవల ప్రారంభమైన ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా పూర్తవుతుంది. తాజాగా జైలర్, నాసామిరంగ చిత్రాల ఫేమ్ మిర్నా మీనన్‌ను ఈ మూవీలో కీలక పాత్రలో నటిస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ప్రముఖ నటుడు మురళీ శర్మ ఇందులో ప్రిన్సిపాల్ విశ్వనాథ్ పాత్రలో నటిస్తుండగా.. లెక్చరర్ సుమతి పాత్రలో మిర్నా మీనన్ నటిస్తున్నారు. ఇంకా మోనిక, రాజ్‌కుమార్ కసిరెడ్డి, విష్ణు ఓయ్ తదితరులు ఈ ఎంటర్‌టైనింగ్ రైడ్‌లో ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. డాన్ బాస్కో అనే టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమా క్యాప్షన్ ఆసక్తి కరంగా ఉంది. వెల్‌కమ్ టు ది క్లాస్ రీయూనియన్ బ్యాచ్ 2014...అన్ని రీయూనియన్‌లు జ్ఞాపకాలను గుర్తు చేసుకోవటానికే కాదు.. కొన్ని విమోచన గురించి కూడా అని ఉంది. ఈ క్యాప్షన్ సినిమా కాన్సెప్ట్‌పై ఆసక్తిని మరింత పెంచుతోంది. శంకర్ గౌరి ఈ చిత్రానికి రచన, దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఎదురోలు రాజు సినిమాటోగ్రఫీ, మార్క్ కె.రాబిన్ సంగీతాన్ని అందిస్తున్నారు. నటీనటులు రుష్య, మిర్నా మీనన్, మోనిక, మురళీ శర్మ, విష్ణు ఓయ్, రాజ్‌కుమార్ కసిరెడ్డి తదితరులు.

సాంకేతిక వర్గం: నిర్మాత: శైలేష్ రమ, బ్యానర్: శ్రీ మాయ ఎంటర్ టైన్మెంట్స్, దర్శకత్వం: పి.శంకర్ గౌరి, మ్యూజిక్: మార్క్ కె.రాబిన్, సినిమాటోగ్రఫీ: ఎదురోలు రాజు, ఆర్ట్: ప్రణయ్‌నైనా, ఎడిటర్: గ్యారీ బి.హెచ్, పి.ఆర్.ఒ వంశీ కాకా.



# 'కృష్ణ లీల' నేచురల్ మిస్టీరియస్ టీజర్

యంగ్ ట్యాలెంటెడ్ దేవన్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ కృష్ణ లీల. తిరిగొచ్చిన కాలం అనేది ట్యాగ్ లైన్. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్‌పై జ్యోత్స్న జి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కథ,మాటలు అనిల్ కిరణ్ కుమార్ జి అందించారు. ఈ సినిమా టైటిల్ మోషన్ పోస్టర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ వివి వినాయక్ ఈ సినిమా టీజర్‌ని లాంచ్ చేశారు. ప్రేమించడం, ప్రేమించబడడం.. రెండు కర్మలే. ఈ ప్రేమని అనైతికంగా అనుభవించాలనుకున్నా, అవాయిడ్ చేయాలనుకున్న, అది మరింత కాంప్లికెటెడ్ అయి, ఎన్ని జన్మలైనా నీకు సరైన పాఠం నేర్పే వరకు వదలదుఖిఖిఅనే పవర్ ఫుల్ వాయిస్‌తో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. టీజర్‌లో దేవన్ క్యారెక్టర్ వేరియేషన్స్, డిఫరెంట్ టైం లైన్స్, మిస్టీరియస్ కథనం.. సినిమాపై చాలా క్యూరియాసిటీని పెంచాయి. నెవర్ బిఫోర్ లవ్ స్టోరీతో ఈ సినిమా ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తున్నారని టీజర్ చూస్తే అర్థమోతోంది. దర్శకుడిగా దేవన్ సరికొత్త పంథాలో ఈ ప్రేమ కథని ప్రెజెంట్ చేస్తున్నారని టీజర్ ప్రామిస్ చేస్తోంది. ధన్య బాలకృష్ణన్‌తో పాటు వినోద్ కుమార్, యానిమల్ పృథ్వి, రవి కాలే కీలక పాత్రల్లో కనిపించారు. భీమ్స్ సిసిరోలియా బీజీఎం, సతీష్ ముత్యాల కెమరా వర్క్ టీజర్ ని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్ళింది. ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్‌గా వున్నాయి. మొత్తానికి ఈ టీజర్ సినిమాపై మంచి బజ్‌ని క్రియేట్ చేసింది. నటీనటులు: దేవన్, ధన్య బాలకృష్ణన్, వినోద్ కుమార్.



# 'బకాసుర రెస్టారెంట్' ట్రైలర్ రిలీజ్

పలు విజయవంతమైన చిత్రాలతో మంచి నటుడిగా, కమెడియన్‌గా అందరికి సుపరిచితుడైన ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం బకాసుర రెస్టారెంట్, ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్,ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. హాంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు మారుతి ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ,భకాసుర రెస్టారెంట్ త్వరలో మీ ముందుకు రాబోతుంది. మా ట్రైలర్ మారుతి చేతుల మీదుగా విడుదల కావడం హ్యాపీగా ఉంది. ఆయన దర్శకత్వంలో వచ్చిన ప్రేమకథా చిత్రం నా కెరీర్ సెట్ కావడానికి ఎంతో ఉపయోగపడింది. మరోసారి ఆయన నా సినిమా ట్రైలర్‌కు రావడం ఆనందంగా ఉంది. ఆయనకు నా కృతజ్ఞతలు అన్నారు. మారుతి మాట్లాడుతూ, ఈ సినిమాకు టైటిల్‌తోనే విజయం సాధించారు. మంచి టైటిల్ పెట్టారు. సినిమా కూడా బాగుంటుందనే ఫీల్ కలుగుతుంది. మంచి టైటిల్ ఈ సినిమాకు పెట్టడంతో మంచి పాజిటివ్ వైబ్ ఉంది. చాలా రోజుల నుంచి ప్రవీణ్‌ను హీరోగా చూడాలనుకుంటున్నాను. డెఫినెట్‌గా ఈ సినిమా ప్రవీణ్ కెరీర్‌కు మరో మైలురాయిగా నిలుస్తుంది. తప్పకుండా ఈ సినిమా ఆడియన్స్ అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమా తప్పకుండా విజయం సాధించి ఈ సినిమా యూనిట్ అందరికి మంచి పేరు తీసుకరావాలని అని కోరుకుంటున్నాను అన్నారు.



నిర్మాత జనార్థన్ ఆచారి మాట్లాడుతూ, శివ ఈ లైన్ చెప్పగానే బాగా నచ్చింది. వెంటనే ఈ పాత్రకు ప్రవీణ్ అనుకున్నాం. ఆర్టిస్టులు అందరూ ఎంతో సపోర్ట్ చేశారు. కేజీఎఫ్ గరుడ రామ్ పాత్ర అందరికి నచ్చుతుంది అన్నారు.

# మేకప్ మరకలా?



**వేడుకలన్నాక కాస్త మేకప్ టచ్ లేకపోతే ఎలా? సమస్యల్లా ఆ సందడిలోపడి ఆదమరిచినప్పుడే! గమనించుకోకుండా కాటుకో, లిప్‌స్టిక్కో దుస్తులకు అంటిందో.. వదిలించడం పెద్ద తలనొప్పి. సులువుగా పోగొట్టే మార్గాలు కావాలా.. అయితే చదివేయండి.**

♦ హైనెక్ కాలర్ డ్రెస్ వేడుకున్నారా? మనం ప్రత్యేకంగా అంటించుకోనక్కర్లేదు. మెడకు వేసిన ఫౌండేషన్, కాంపాక్ట్ చక్కగా దుస్తులకు అతుక్కుపోతుంది. లేత దుస్తులైతే మరకలు మరింత బాగా కనిపిస్తాయి. ఇలాంటప్పుడు ఒక చిన్న గిన్నెలో గోరువెచ్చని నీటిని తీసుకొని దానికి కొద్దిగా లిక్విడ్ డిషవాష్‌ను కలపాలి. దూదిని ఆ నీటిలో ముంచి, నెమ్మదిగా మరక ఉన్నప్రాంతంలో రుద్దకుండా సున్నితంగా అద్దాలి. దూదితోపాటుగా మేకప్ వచ్చేస్తుంది. అవసరమైతే దూదిని మార్చుకుంటే సరిపోతుంది.

♦. చూసుకోకుండా లిప్‌స్టిక్, మస్కారా, ఐ లైనర్ పూసేసుకున్నారా? ఇంట్లో షేవింగ్ ఫోమ్ ఉంటే సమస్య తీరినట్లే. షేవింగ్ ఫోమ్‌ని మరక ఉన్నచోట రాసి, పావుగంట వదిలేయండి. తరవాత దూదితోగానీ శుభ్రమైన వస్త్రంతోగానీ ఫోమ్‌ని తుడిచేయాలి. ఆపై చల్లని నీటితో కడిగేస్తే సరిపోతుంది. ఇంకా ఆనవాళ్లు కనిపిస్తోంటే మరోసారి ఈ ప్రక్రియను అనుసరిస్తే సరి.

♦ నెయిల్ పాలిష్ అంటితే.. రెండు దూది ఉండలను తీసుకొని నెయిల్ పాలిష్ రిమూవర్‌లో ముంచాలి. మరక ఉన్న ప్రాంతంలో వస్త్రానికి ఇరువైపులా వాటిని ఉంచి కొద్ది సేపు అద్దితే చాలు. అదే ఊడొస్తుంది.

♦ ముదురు రంగు దుస్తులు వేసుకుని అలా అలా పౌడర్ ఫౌండేషన్‌తో టచప్ ఇద్దామను కున్నామనుకోండి. అది పొరపాటున వాటిపై పడితే తిప్పలు మామూలుగా ఉండవు. దుస్తులపై తెల్లని పొరలా ఎంతసేపటికీ వదలదు. అలాంటప్పుడు చేతులకు కాకుండా హెయిర్ డ్రైయ్యర్‌కి పనిచెప్పండి. దాంతో బ్లో చేస్తే.. ఆనవాళ్లు లేకుండా పౌడర్ వదిలిపోతుంది. కావాలంటే చూడండి. □

# న్యాయ నిర్ణేతలుగా లక్ష్యాన్ని చేరుకుని..

**ఒకే ఒక్క మార్కుతో గురి తప్పారామె, అయినా, దాని గురించి బాధపడకుండా, ఆ అనుభవంతో ఈ సారి పక్కాగా సన్నద్ధమయ్యారు. లక్ష్యాన్ని చేరుకుని... ఇంట్లో మూడో జడ్జిగా నిలిచారు హైదరాబాద్‌కు చెందిన నిఖీషా.**



**బిటెక్ తర్వాత 'లా' ...**

బిటెక్ చదివి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పనిచేశారు నిఖీషా తండ్రి కె. ఖుషా న్యాయమూర్తి ప్రస్తుతం హైదరాబాద్‌లో సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జిగా పనిచేస్తున్నారు. ఆయన స్ఫూర్తితో న్యాయమూర్తి కావాలనుకున్నారు నిఖీషా. తాజాగా విడుదలైన తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో ఆమె ప్రతిభ కనబరిచి కలను నిజం చేసుకున్నారు. నిఖీషాకు 2019లో న్యాయవాది శాంతికుమార్‌తో వెళ్లింది. ఆ తర్వాత చదువు కొనసాగుతుంది. ఎల్.ఎల్.బి. పూర్తిచేసి 2020లో న్యాయవాదిగా పట్టా పొందారు. 2022లో జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్ష రాయగా, ఒక్క మార్కుతో ప్రిలిమ్స్ తప్పారు. అప్పటికి నిఖీషా ఎనిమిది నెలల గర్భిణి. ఆ పరీక్షల్లో ఆమె సోదరి భావన ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో 4వ ఆదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు. 2024లో మరోసారి నోటిఫికేషన్ రావడంతో ఈసారి ఎలాగైనా లక్ష్యం సాధించాలని పట్టుదలతో పరీక్షకు సిద్ధమయ్యారు నిఖీషా. 2024 జూన్‌లో ప్రిలిమ్స్ నవంబర్‌లో మెయిన్స్ పూర్తిచేసి, ఏప్రిల్ 2025లో జరిగిన ఇంటర్వ్యూనూ విజయవంతంగా పూర్తిచేసి 44 మందిలో స్థానం సంపాదించారు. రెండేళ్ల వయసున్న కవల కుమార్తెల బాధ్యతను చూసుకుంటూనే కఠినమైన పరీక్షకు సన్నద్ధమయ్యారు. మెయిన్స్‌కు పది రోజుల ముందు తల్లికి సర్జరీ అయింది. భర్త సహకారంతో పిల్లల్నీ, తల్లినీ చూసుకుంటూనే ప్రణాళిక తప్పకుండా చదివారు. తండ్రి ఇద్దరు కుమార్తెలు ఒకేసారి న్యాయ మూర్తులుగా సేవలందించడం చాలా అరుదు. ఈ విజయం ఆమె కృషి, పట్టుదలనే కాదు, కుటుంబ మద్దతుని ప్రతిబింబిస్తోంది.

**డాక్టర్ అవ్వాలనుకుని..**



తేజస్విని

సెలవులకు హైదరాబాద్‌లో ఉండే పెదనాన్న ఇంటికి వెళ్లేవారమే. ఆయన ప్రభుత్వ ప్లీడర్. అతని కుమారుడు జడ్జి ఇద్దరూ నల్లకోటు వేసుకుని విధులకు వెళ్లడం చూసి తానూ న్యాయమూర్తి కావాలని కలలుకన్నారు. సివిల్ జడ్జిగా ఎంపికై దాన్ని నిజం చేసుకున్నారు. తేజస్విని. ఈమెది మహబూబ్‌నగర్. తండ్రి నాగ్యానాయక్ నవాబ్‌పేట మండల విద్యాధికారి. తల్లి సరోజ జడ్చర్ల మండల పంచాయతీ అధికారి. ఈమెకో తమ్ముడు. పదో తరగతి వరకూ ఉన్న న్యూ రిషి ఉన్నత పాఠశాలలో చదివిన తేజస్విని... హైదరాబాద్‌లో ఇంటర్ బైపీసీ చదివారు. 978 మార్కులు సాధించారు. ఆపై హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ లా కళాశాలలో ఐదేళ్ల న్యాయవాద కోర్సులో చేరారు. 2022లో ఎల్ఎల్‌బీ, ఆపై 2024లో ఉస్మానియా నుంచి ఎల్ఎల్ఎం పూర్తిచేశారు. తాజాగా తెలంగాణ రాష్ట్ర జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక య్యారు. డాక్టర్ కావాలనుకున్నా. కానీ పెదనాన్న సాయి చక్రవర్తి(మాజీ ప్రభుత్వ ప్లీడర్), అన్నయ్య రాధాకృష్ణ చౌహాన్(హుజూర్‌నగర్ కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి)లను చూశాక పేదలకు వైద్యం చేయడం ద్వారా న్యాయం అందించడాన్ని లక్ష్యంగా మార్చుకున్నా. వాళ్ల మార్గ నిర్దేశంలోనే న్యాయవాద విద్యను అభ్యసించా. పోటీ పరీక్షల కోసం హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నా. రోజుకు 12-13 గంటలు చదివేదాన్ని. స్నేహితులతో బృంద చర్చలు, పాత ప్రశ్న పత్రాల సాధనతోపాటు. న్యాయవాద విద్యకు సంబంధించిన అనేక పుస్తకాలు చదివి సొంతంగా నోట్స్ రాసుకునేదాన్ని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు విడివిడిగా నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలను రాసి, రెండు చోట్ల ఎంపికయ్యా. పేదలకు చట్టాలపై అవగాహన కల్పించి, తమ హక్కులను కాపాడుకునేలా చైతన్యం తీసుకొస్తాను అని తేజస్విని చెబుతున్నారు. □

# గుండె పదిలంగా ఉండాలా..



**శారీరక ఆరోగ్యానికి నడక, యోగా.. ఇలా నచ్చిన వ్యాయామాలను చేస్తుంటాం కదా! వాటిలో శ్వాస వ్యాయామాలకీ చోటివ్వండి వీటితో మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చు అంటున్నారు నిపుణులు.**

★ నేలమీద కూర్చొని దీర్ఘంగా శ్వాస తీసుకోవాలి. తరవాత నెమ్మదిగా నోటితో ఆ గాలిని వదిలేయాలి. లేదా ముక్కు ఒక రంధ్రంతో దీర్ఘశ్వాస తీసుకొని మరోదాని నుంచి వదలాలి. వీటిలో నచ్చినదాన్ని రోజుకు కనీసం 2 నిమిషాలైనా ప్రయత్నించాలి.

★ రోజులో ఇంటిపని, ఆఫీసుపని అంటూ పరుగులు పెడుతుంటాం. ఈ క్రమంలో ఒత్తిడి బారిన పడతాం. దాన్నుంచి బయటపడటానికి శ్వాస వ్యాయామాలు ఉత్తమ పరిష్కారం. ఇవి నాడీ వ్యవస్థను ప్రశాంతంగా ఉంచి ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తాయి.

★ ప్రతిరోజూ వీటిని జీవనశైలి భాగం చేసుకుంటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. అంతేకాదు, ఆస్తమా మొదలైన దీర్ఘకాలిక వ్యాధులకూ ఇది ప్రయోజనకరం.

★ లోతుగా ఊపిరి పీల్చుకుని వదలటం వల్ల శరీరానికి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. దాంతో అవయవాల పనితీరు మెరుగుపడుతుంది. రక్తపోటును తగ్గించడానికీ ఇది ఉత్తమ సాధనం. గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. □

## చెలి చిట్కా

★ తలకే కాకుండా శరీరానికి కూడా నూనెను పట్టించి మర్ధన చేయడం వలన శరీరానికి చక్కని వ్యాయామం లభించి దేహపుష్టి కలుగుతుంది.

★ అరటికాయ ముక్కలుగా కోసేటప్పుడు తోలుతీసిన అరటికాయలను మజ్జిక కలిపిన నీళ్లలోముంచండి. ఆ తర్వాత కోస్తే ముక్కలు నల్లబడవు.

★ ఖాళీడబ్బాలను తలక్రిందులుగా అలమరలో పెట్టినట్లయితే మీకు కావలసిన డబ్బాను గుర్తించడం సులభం. □

# ఆడిద్దామా... స్పడ్ !



ముందుగా పిల్లల్లో ఎవరో ఒకరు బంతిని గాల్లోకి ఎగరవేయాలి. ఎగరవేసిన వెంటనే ఇతర పిల్లల్లో ఎవరో ఒకరి పేరుని గట్టి అరవాలి. అలా ఎవరి పేరు చెప్పారో వాళ్లు ఆ బాల్‌ని కిందపడే లోగా పట్టుకోవాలి. వెంటనే ఎస్‌పియూడి (స్పడ్) అని అరవాలి. దీంతో మిగతా పిల్లలు ఎక్కడ ఉన్నవాళ్లు అక్కడే కదలకుండా ఉండిపోవాలి. బాల్ పట్టుకున్న పిల్లవాడు నిల్చున్న చోటునుంచే దాన్ని ఎవరో ఒకరి మీదకు విసరాలి. బాల్ తగిలిన వాళ్లకు ఒక 'ఎస్' అక్షరం వచ్చినట్లు. తర్వాత వాళ్లే బాల్‌ను కూడా పైకి విసరాల్సి ఉంటుంది. అలా ఎవరికైతే ముందుగా ఎస్‌పియూడి అక్షరాలు వస్తాయో వాళ్లు ఓడిపోయినట్లు మిగిలిన వాళ్లు ఆటను కొనసాగిస్తారు! ఈ ఆటవల్ల పిలల్లో మెంటల్ అలర్ట్‌నెస్ అలవడుతుంది. □

# యోనా మనకు నేర్పించే పాఠం..

'నేను హెబ్రీయుడను, సముద్రమునకును భూమికిని సృష్టికర్తయై ఆకాశమందుండే దేవుడైయున్న యెహోవాయందు నేను భయభక్తులు గలవాడనైయున్నాను.. (యోనా (1:9)..'ఇది చూడగా ఆ మనుష్యులు యెహోవాకు మిగుల భయపడి, ఆయనకు బలి అర్పించి మ్రొక్కుబళ్లు చేసిరి' (1:16). యోనా గురించి మనలో చాలామందికి తెలుసు. యోనాను చాలామంది ఒక్కకోణంలోనే చూస్తుంటారు. యోనా అనగానే అవిధేయుడైన యోనా అని అనుకుంటారు. యోనా అవిధేయుడైన వ్యక్తి అనడంలో ఎలాంటి సందేహం లేదు. దేవుడు చెప్పిన మాటను వినకుండా సొంతనిర్ణయంతో ముందుకు సాగిపోయాడు. అయితే యోనాలో అనేకులు గమనించని విషయాలున్నాయి. యోనా ఓడలో ఉన్న అన్యులకు దేవుడి గురించి పరిచయం చేసాడు. అంతేకాదు, దేవుడి సన్నిధి నుంచి పారిపోతున్నట్లుగా సత్యం చెప్పాడు. ఈ తుఫానుకు కారణం తన అవిధేయత అని చెప్పాడు. ఆ మాటలు విన్న ఆ మనుషులు భయపడ్డారు. ఏం చేయాలని యోనాను అడిగారు. అందుకు యోనా తనను ఎత్తి సముద్రంలో పడవేయమని చెప్పాడు. వారు ఆవిధంగా యోనాను సముద్రంలో పడవేయగానే, సముద్రం నిమ్మళించింది. తుఫాను ఆగిపోయింది. దీనితో వారు యెహోవా దేవుడికి భయపడి, ఆయనకు బలలను అర్పించారు. అంతేకాదు, వారు యోనాను సముద్రం లో పడవేస్తున్నపుడు ప్రార్థించి, మరీ వేసారు. అంటే వారు దేవుడిపై భయంతో



పాటు, ఆయన నిజమైన దేవుడని నమ్మారు. అసలు యోనా ఎందుకు నీనెవె పట్టణానికి వెళ్లకూడదను కున్నాడు అంటే ఆ ప్రజలు యూదులకు శత్రువులు. వారు దేవుడిని నమ్ముకోవడం యోనాకు ఇష్టం లేదు. అందుకే నీనెవె నుంచి తర్షీషు పట్టణానికి పారిపోవాలను కున్నాడు. యోనాకు తన జాతిప్రజలపై ఎనలేని ప్రేమ ఉంది. తాను తప్పు చేసిన సమయంలో కూడా ఆత్మహత్య మహాపాపం అని తెలుసు. అందుకే తనను సముద్రంలో పడవేయమని ఓడలో ఉన్నవారికి చెప్పాడు. మొత్తానికి నీనెవె పట్టణానికి వెళ్లి దేవుడి గురించి ప్రకటించాడు. వారిని దేవుడు రక్షించాడు. యోనాకు దేవుడితో సన్నిహిత సంబంధం ఉంది. అందుకే ప్రతిదానిలోనూ దేవుడితోనే వాదించేవాడు. తన కోపాన్ని ప్రదర్శించేవాడు. ఈ పుస్తకం ద్వారా మనం నేర్చుకోవాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. వాటిని తర్వాత తెలుసుకుందాం. ఒక్కటి మనం గమనించవలసిన అంశం ఏమిటంటే, దేవుడితో మనకు ఎంత సన్నిహిత సబంధం ఉంది, దేవుడితో మన పయనం ఎలాగుంది అని పరిశీలించుకుని, ఆవిధంగా విశ్వాసంలో సాగిపోదాం.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# వెరైటీ వడియాలు

**పచ్చిమిర్చి, కొత్తిమీరల ఘుమాయింపుతో నోరూరించే చారన్నంలో కాసిని వడియాలు నంజుకుంటే చాలదా.. తృప్తిగా తిన్నామనిపించటానికి! తరచూ ఒకటే అయితే విసుగని.. బియ్యప్పిండి, మినపప్పు, రవ్వ, సగ్గుబియ్యం, గుమ్మడి.. రకాలు తింటుంటాం. వడియాల్లో ఇంకా బోల్డన్ని వెరైటీలున్నాయి..**

## ఉల్లి..

**కావలసినవి:** మినప్పప్పు పావు కిలో, మిరపకాయలు 20, ఉల్లిపాయలు కిలో, పసుపు అర చెంచా, ఉప్పు రుచికి తగినంత, అల్లం ముద్ద చెంచా, ఇంగువ పావు చెంచా

**తయారీ:** మినప్పప్పును రాత్రి పూట నానబెట్టాలి. ఉదయం ఆ నీళ్ల తీసేసి, కాస్త ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఉల్లిపాయలు పొట్టు తీసి చిన్న ముక్కలుగా కోసుకోవాలి. మిరపకాయలను



కచ్చాపచ్చాగా దంచాలి. మినప్పిండిలో ఉల్లి తరుగు, ఉప్పు, పసుపు, అల్లం ముద్ద, దంచిన మిరపకాయలు, ఇంగువ వేసి కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని చెంచాతో పాలిథిన్ కవరు మీద అంగుళం వెడల్పున వడియాలు వేసి ఎండబెట్టాలి. ఇక నూనెలో వేయించుకుంటే రసం, పప్పుచారు, సాంబారు, పులుసుల్లో సూపర్‌గా ఉంటాయి.

## పాలకూర..



**కావలసినవి:** బియ్యప్పిండి కప్పు, జీలకర్ర చెంచా, పాలకూర 2 కట్టలు, పచ్చిమిరప కాయలు మూడు, ఉప్పు రుచికి తగినంత, నువ్వులు పావు కప్పు

**తయారీ:** కడిగిన పాలకూరను తరిగి కొద్దిగా నీళ్ల పోసి గ్రైండ్ చేయాలి. బియ్యప్పిండిలో నాలుగు కప్పుల నీళ్ల, పాలకూర గుజ్జు వేసి కలియతిప్పుతూ ఉడికించాలి. అందులో ఉప్పు, నువ్వులు, జీలకర్ర, మిర్చి జతచేసి ఉండలు కట్టకుండా కలియబెడుతూనే ఉండాలి. చిక్కబడ్డాక దించేసి వస్త్రం మీద వడియాలు పెట్టి.. రెండు రోజులు ఆరబెట్టాలి.

## టొమాటో..

**కావలసినవి:** బియ్యప్పిండి కప్పు, సగ్గుబియ్యం పావు కప్పు, టొమాటోలు 4 అల్లంఅంగుళం ముక్క పచ్చిమిరపకాయలు 2, ఉప్పు రుచికి అవసరం, జీలకర్ర చెంచా

**తయారీ:** బియ్యప్పిండిలో రెండు కప్పుల నీళ్ళు పోసి ఉండలు కట్టకుండా కలపాలి. సగ్గుబియ్యం కడిగి ఓ గంట నానబెట్టాలి. టొమాటో ముక్కలను గ్రైండ్ చేయాలి. ఆ గుజ్జు గిన్నెలోకి తీసి.. ఆరు కప్పులు నీళ్ల, నానిన సగ్గుబియ్యం, ఉప్పు కలిపి మధ్యమధ్యలో కలియబెడుతూ ఉడికించాలి. నాలుగు నిమిషాల తర్వాత బియ్యప్పిండి, జీలకర్ర, కచ్చాపచ్చ దంచిన అల్లం, పచ్చిమిరపకాయల ముద్ద వేసి కలపాలి. అడుగంటకుండా అప్పుడప్పుడూ కలియతిప్పుతూ పది నిమిషాలు ఉడికించాలి. చిక్కగా అయ్యాక దించేసి.. పాలిథిన్ పేపరు మీద చెంచాతో వెడల్పుగా వడియాలు వేసి.. రెండు రోజులు ఎండబెట్టాలి.



## బీట్‌రూట్ ..

**తయారీ:** బియ్యపిండి-కప్పు ఉప్పు-రుచికి తగినంత, బీట్‌రూట్-రెండు, ఎండుమిర్చి-రెండు, జీలకర్ర-చెంచా, మిరియాల పొడి - అర చెంచా.

**తయారీ :** బీట్‌రూట్ చెక్కు తీసి ముక్కలు కోయాలి. వాటికి ఎండుమిర్చి, ఉప్పు జోడించి గ్రైండ్ చేయాలి. ఈ గుజ్జులో ఐదు కప్పుల నీళ్ల, జీలకర్ర, మిరియాల పొడి జతచేసి ఉడికించాలి. బియ్యపిండిలో రెండు కప్పుల నీళ్ల పోసి ఉండలు కట్టకుండా కలపాలి. దీన్ని తెర్లుతున్న బీట్‌రూట్ నీళ్లలో వేసి.. కలియబెడుతూనే ఉండాలి. చిక్కబడిన తర్వాత దించేసి.. శుభ్రమైన వస్త్రం మీద పల్చగా వడియాలు పెట్టి ఎండలో ఆరబెట్టుకోవాలి.



## సొరకాయ

**కావలసినవి :** మినప్పప్పు-పావు కిలో, సొరకాయ తురుము-6 కప్పులు, రాళ్లుప్పు-చెంచా, మెత్త ఉప్పు-తగినంత, పచ్చిమిర్చి ముద్ద- 2 చెంచాలు.



**తయారీ :** మినప్పప్పును నాలుగైదు గంటలు నానబెట్టి.. ఆ నీళ్ల తీసేసి.. ఆస్త ఉప్పు జోడించి గ్రైండ్ చేయాలి. కడిగిన సొరకాయను తురుముకోవాలి. చెక్కు తీయనవసరం లేదు. అందులో రాళ్లుప్పు చల్లి.. శుభ్రమైన వస్త్రంలో వేసి.. మూటకట్టాలి. దాని మీద చిన్న రోలు లాంటి బరువైన వస్తువునుంచాలి. నీరంతా పోయిన సొరకాయ తురుము, పచ్చిమిర్చి ముద్దలను మినప్పిండిలో కలపాలి. ఈ మిశ్రమంతో పాలిథిన్ కాగితం మీద కాస్త మందంగా, వెడల్పుగా వడియాలు పెట్టి.. మూడు రోజులు ఎండబెట్టాలి. వాటిని తడి లేని డబ్బాలో భద్రం చేసుకోవాలి.

## క్యాబేజీ..

**కావలసినవి :** మినపప్పు-150 గ్రాములు, క్యాబేజీ-పావుకిలో, ఉప్పు-రుచికి తగినంత, పసుపు-అర చెంచా, పచ్చిమిర్చి ముద్ద-రెండు చెంచాలు, జీలకర్ర-ముప్పావు చెంచా, ఇంగువ-పావు చెంచా.

**తయారీ :** క్యాబేజీని సన్నగా తురమాలి. మినపప్పును ఐదు గంటలు నానబెట్టి ఉప్పు జోడించి మెత్తగా రుబ్బాలి. అందులో క్యాబేజీ తురుము, పసుపు, జీలకర్ర, ఇంగువ, పచ్చిమర్చి ముద్ద వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో వడియాలు పట్టి రెండు మూడు రోజులు ఆరబెట్టాలి. □



# ఇంట్లో మేనిక్యూర్

**చేతులు కోమలంగా, గోళ్ల ఆరోగ్యంగా కనిపించా లంటే మేనిక్యూర్ అవసరమే. దీన్ని ఇంట్లోనే ఎలా చేసుకోవాలంటే...**

★. ముందుగా గోళ్లపై ఉన్న నెయిల్ పాలిష్ తొలగించండి. ఆపై అరచెంచా ఉప్పు, కొద్దిగా బాదం నూనె, కాస్త నిమ్మరసం కలిపిన మిశ్రమంలో కనీసం 10 నిమిషాలపాటు గోళ్లను నాన బెట్టండి. దీనివల్ల గోళ్ల శుభ్రపడటమే కాదు... పసుపు తగ్గి ప్రకాశిస్తాయి. చేతులు టాన్ తగ్గి మెరిసిపోతాయి.



★ రెండో దశలో గోళ్లను కత్తిరించి రౌండ్, స్క్వేర్, ఓవల్... ఇలా మీకు నచ్చిన రూపు ఇవ్వండి. ఆపై గోరువెచ్చని నీళ్లలో రెండు చుక్కల షాంపూ లేదా బాడీవాష్ కలిపి అందులో కనీసం పది నిమిషాలు చేతుల్ని నాననివ్వండి. ★. తర్వాత ఆరెంజ్ స్టిక్ లేదా క్యూటికల్ పూషర్‌తో చుట్టూ ఉన్న మృతచర్మాన్ని తొలగించండి. ఆపై ఆలివ్ ఆయిల్‌తో రుద్దాలి. తర్వాత చిన్న బ్రష్ తీసుకుని గోళ్లపై రుద్దితే సరి. మురికి వదులుతుంది. ఇప్పుడు చెంచా చొప్పున పెరుగు, పంచదార, తేనె కలిపిన మిశ్రమాన్ని చేతులకు రాసి వేళ్లతో వలయాకారంగా స్క్రబ్ చేయండి.

★ చివరగా చేతుల్ని చల్లటి నీళ్లతో కడిగేసి కాస్త బాదం నూనె రాసి మరోసారి మృదువుగా మర్దన చేయండి. వారానికోసారి ఇలా చేయడంవల్ల చేతులు నాజూగ్గా కనిపిస్తున్నాయి. ఆరోగ్య ంగానూ ఉంటాయి. గిన్నెలు తోమడం, బట్టలు ఉతకడం వంటి పనులు ఎక్కువగా చేసేవారు... రోజూ రాత్రిపూట గ్లిజరిన్ రాయడాన్ని అలవాటుగా మార్చుకోండి. □

# ఇటాలియన్ టెన్నిస్ ఫైనల్‌కు సిన్నర్

**న్యూఢిల్లీ:** మూడు నెలల డోపింగ్ నిషేధం తర్వాత తిరిగి వచ్చిన జానిక్ సిన్నర్ తన మొదటి టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరుకున్నాడు. రోమ్‌లో జరిగిన సెమీఫైనల్లో అగ్రస్థానంలో ఉన్న సిన్నర్ 1-6, 6-0, 6-3 తేడాతో 12వ ర్యాంకర్ టామీ పాల్‌ను ఓడించాడు. 1976లో అడ్రియానో పనాట్టా తర్వాత రోమ్ ట్రోఫీని గెలిచిన తొలి ఇటాలియన్ వ్యక్తిగా నిలిచేందుకు సిన్నర్ ప్రయత్నిస్తున్నాడు.



అంతకుముందు, అల్కరాజ్ 6-3, 7-6(4) తేడాతో లోరెంజో ముసెట్టిని ఓడించి తన తొలి రోమ్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఈ నెల 18న జరిగే ఫైనల్ అక్టోబర్ తర్వాత సిన్నర్ మరియు అల్కరాజ్ మధ్య జరిగిన తొలి మ్యాచ్ అవుతుంది, అల్కరాజ్ చైనా ఓపెన్ ఫైనల్‌ను మూడో సెట్ టైబ్రేకర్‌లో గెలిచాడు. సిన్నర్‌తో తన కెరీర్ సమావేశాల్లో అల్కరాజ్ 6-4 ఆధిక్యంలో ఉన్నాడు. దీంతో తన అతి పెద్ద ప్రత్యర్థిపై వరుసగా మూడు విజయాలు సాధించాడు. కానీ బీజింగ్‌లో అల్కరాజ్ చేతిలో ఓటమి పాలైన తర్వాత సిన్నర్ ఒక్కసారి కూడా ఓడిపోకపోవడం విశేషం. సరికదా వరుసగా 26 మ్యాచ్‌ల విజయాలతో దూసుకుపోతున్నాడు. తొలుత క్వార్టర్ ఫైనల్స్‌లో కాస్పర్ రూడ్‌ను ఓడించి సిన్నర్ తన స్థాయిని దాదాపు పరిపూర్ణతకు చేరుకున్నాడు. పాల్‌తో జరిగిన మ్యాచ్‌లో, సిన్నర్ మొదటి సెట్‌లో అనవసర తప్పిదాలు చేయగా, అతని అమెరికన్ ప్రత్యర్థి లైన్స్‌లో షాట్‌ల తర్వాత షాట్‌లు కొట్టాడు. కానీ సిన్నర్ త్వరగా మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఇక జనవరిలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తన మూడవ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత సిన్నర్ తన మొదటి టోర్నమెంట్‌ను ఆడుతున్నాడు.




# చెస్ ఛాంపియన్‌గా ప్రజ్ఞానంద్

## టైబ్రేకర్‌లో వాచియర్-లాగ్రేవ్ ఓటమి

**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్ సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ 2025 ఛాంపియన్‌గా గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద్ నిలిచాడు. అతను అద్భుతంగా ప్రదర్శన ఇచ్చి టైబ్రేకర్‌లో వాచియర్‌లాగ్రేవ్‌ను ఓడించాడు. భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద్ అలిరేజా ఫిరోజా మరియు మాక్సిమ్ వాచియర్‌లాగ్రేవ్‌లపై జరిగిన టైబ్రేక్ ప్లేఆఫ్ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా సూపర్‌బెట్ చెస్ క్లాసిక్‌ను గెలుచుకున్నాడు. తొమ్మిది రౌండ్ల తర్వాత, ప్రజ్ఞానంద్, వాచియర్‌లాగ్రేవ్ మరియు ఫిరోజా మొత్తం 5.5 స్కోరును సాధించారు. ఫలితంగా, విజేతను టై బ్రేకర్‌లో నిర్ణయించారు. మొదటి రెండు మ్యాచ్‌లు టై బ్రేకర్‌లలో డ్రా అయిన తర్వాత, ప్రజ్ఞానంద మూడవ మ్యాచ్‌లో గెలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. చివరి రౌండ్ వరకు. పోటీలో ప్రజ్ఞానంద్ చాలా ముందున్నాడు. కానీ లెవాన్ అరోనియన్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను డ్రా చేసుకోవడంతో ఫిరోజా మరియు వాచియర్‌లాగ్రేవ్‌లు తమ చివరి మ్యాచ్‌లను గెలిచి సమం చేశారు. టైబ్రేక్‌లోని మొదటి రెండు మ్యాచ్‌లు (ప్రజ్ఞానంద్-ఫిరోజ్జా మరియు వాచియర్ లాగ్రేవ్-ఫిరోజ్జా) డ్రాగా ముగిశాయి. మూడో గేమ్ గెలిచింది. ప్రజ్ఞానంద అద్భుతంగా రాణించి వాచియర్‌లాగ్రేవ్‌ను ఓడించాడు. విజయం తర్వాత, ప్రజ్ఞానంద తన భావాలను వ్యక్తం చేస్తూ, "అద్భుతమైన అనుభవం, బుకారెస్ట్‌లో జరిగిన సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ టోర్నమెంట్‌ను ఇప్పుడే గెలుచుకుంది. నిరంతర ప్రోత్సాహానికి నా బృందం మరియు సహచరులకు ధన్యవాదాలు" అని అన్నాడు. కాగా భారత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్ నాలుగు పాయింట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. ఇప్పుడు తదుపరి గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్, సూపర్ యునైటెడ్ రాపిడ్ అండ్ బ్లిట్జ్, జూలై 1 నుండి క్రొయేషియాలో జరుగుతుంది.

# వన్డేల్లో నో ఔట్

## ముగ్గురి రూటే సెపరేట్

### టీమిండియా సౌరభ్, ఫజల్, భరత్

**న్యూఢిల్లీ:** వన్డే ఫార్మాట్‌లో ఎన్నో అరుదైన రికార్డులు ఉన్నాయి. కొత్తగా కొన్ని నమోదవుతుంటే, ఇప్పటికే ఉన్న వాటిలో కొన్ని బ్రేక్ అవుతున్నాయి. క్రికెట్ చరిత్రలో పరుగులు, సెంచరీల వర్షం కురిపించిన బ్యాట్స్‌మెన్లు చాలా మందే ఉన్నారు. కానీ, వన్డే క్రికెట్‌లో ఏ బౌలర్ చేతిలోనూ అవుట్ కాని బ్యాట్స్‌మెన్లు ఉన్నారు. ప్రపంచంలో ఏ బౌలర్ కూడా వన్డే క్రికెట్‌లో వీరిని అవుట్ చేయలేకపోయారు. ఈ లిస్ట్‌లో కేవలం కొందరికే ఛాన్స్ దక్కింది. ఇందులో ముగ్గురు టీమిండియా ప్లేయర్లు ఈ అరుదైన రికార్డును సాధించారు. ఈ ముగ్గురు బ్యాట్స్‌మన్స్ వన్డేలో ఎప్పుడూ ఏ బౌలర్ చేతిలోనూ అవుట్ కాకపోవడం విశేషం. ఈ జాబితాలోని సౌరభ్ తివారీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టినప్పుడు, అతన్ని ధోని జిరాక్స్ అని పిలిచేవారు. సౌరభ్ పొడవాటి జుట్టు చూసి, ప్రజలు అతన్ని ధోనితో పోల్చేవారు. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించడం ద్వారా అతడు టీమ్ ఇండియాలో చోటు సంపాదించుకున్నాడు. సౌరభ్ 2010లో ఆస్ట్రేలియాపై వన్డే అరంగేట్రం చేశాడు. టీమ్ ఇండియా తరపున కేవలం మూడు వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. అందులో అతను రెండు ఇన్నింగ్స్‌లలో మాత్రమే బ్యాటింగ్ చేయగలిగాడు. ఈ రెండు ఇన్నింగ్స్‌లలోనూ సౌరభ్ తివారీ నాటౌట్‌గా నిలిచాడు. ఆ తరువాత అతన్ని జట్టు నుంచి తప్పించారు. అలాగే ఫైజ్ ఫజల్ దేశీయ క్రికెట్‌లో తన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. అందుకే అతనికి టీం ఇండియాలో కూడా అవకాశం లభించింది. కానీ, ఈ ఆటగాడు టీం ఇండియా తరపున ఒకే ఒక వన్డే మ్యాచ్ ఆడాడు. 2016లో జరిగిన ఈ వన్డే మ్యాచ్‌లో ఫైజ్ ఫజల్ జింబాబ్వేపై 55 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ అద్భుతమైన అర్ధ సెంచరీ తర్వాత కూడా అతన్ని జట్టు నుంచి తొలగించారు. ఇక నేటి యువతకు భరత్‌రెడ్డి పేరు తెలియకపోవచ్చు. కానీ, ఈ ఆటగాడికి కూడా భారతదేశం తరపున కేవలం మూడు వన్డేలు మాత్రమే ఆడే అదృష్టం కలిగింది. భరత్ రెడ్డి 1978 నుంచి 1981 వరకు భారతదేశం తరపున మూడు వన్డేలు ఆడాడు. అందులో అతనికి రెండుసార్లు బ్యాటింగ్ చేసే అవకాశం లభించింది. రెండు సార్లు అజేయంగా నిలిచాడు. ఆ తరువాత, భరత్ రెడ్డిని కూడా టీం ఇండియా నుంచి తొలగించారు. అతని కెరీర్ కూడా విషాదకరమైన ముగింపునకు చేరుకుంది.

ఆట




# ఇంగ్లండ్ టెస్ట్‌కు భారత్ టీం

## కెప్టెన్‌గా ఈశ్వరన్.. శ్రేయాస్‌కు దక్కని ప్లేస్

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ టూర్‌కు భారత్ ఎ జట్టు సిద్ధమైంది. ఇండియా ఎ జట్టు ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికారిక టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌లు ఈ నెల 30 నుండి జూన్ 9వ వరకూ జరగనున్నాయి. ఈ పర్యటనకు గాను నిమించిన భారత్ జట్టుకు కెప్టెన్‌గా అభిమన్యు ఈశ్వరన్‌ను నియమిస్తూ సెలక్టర్లు నిర్ణయించారు. ఈ మేరకు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ 18 మందితో కూడిన భారత్ జట్టును ప్రకటించింది. ఇంగ్లండ్ టూర్‌లో ఈశ్వరన్‌కు డిప్యూటీగా వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ వ్యవహరించనున్నాడు. ఇక ఇండియా ఎ జట్టుకు చాలాకాలం తర్వాత వెటరన్ క్రికెటర్ కరుణ్ నాయర్ ఎంపికయ్యాడు. కరుణ్ 8 ఏళ్ల తర్వాత ఇండియా సీనియర్ టెస్టు జట్టులోకి సైతం రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. కరుణ్‌తో పాటు, ఇషాన్ కిషన్‌కు కూడా భారత్ ఎ జట్టులో చోటు దక్కింది. అయితే ఆశ్చర్యకంగా శ్రేయాస్ అయ్యర్‌ను సెలక్టర్లు పక్కన పెట్టారు. దీంతో అయ్యర్ ఇంగ్లండ్‌తో టెస్టులకు ప్రధాన భారత్ జట్టులో ఉంటాడనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ జట్టులో భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్, నితీష్ కుమార్, తనుష్ కోటియన్, ముఖేష్ కుమార్, ఆకాశ్ దీప్ కూడా ఉన్నారు. క్రికెట్ బోర్డు వారిని ప్రాక్టీస్ కోసం ముందుగా ఇంగ్లండ్‌కు పంపింది. అదే విధంగా ప్రస్తుత ఇండియన్ నప్రీమియర్ లీగ్ ప్లే ఆఫ్స్ తర్వాత శుభమన్ గిల్, సాయి సుదర్శన్‌లు ఇండియా ఎ జట్టుతో కలవనున్నారు. కాగా ఈ ఏడాది రంజీ ట్రోఫీ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్ హర్ష్ దుబే కూడా భారత్ ఎ జట్టులో భాగమయ్యాడు. ఈ విదర్భ స్పిన్నర్ 10 మ్యాచ్‌ల్లో 17 సగటుతో 69 వికెట్లు పడగొట్టాడు. మరో ఎడమ చేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. భారత్ ఎ జట్టులో అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), ధృవ్ జురెల్ (వైస్ కెప్టెన్) యశస్వి జైస్వాల్, కరుణ్ నాయర్, ధృవ్ జురెల్, నితీష్ కుమార్, శార్దూల్ ఠాకూర్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), మానవ్ సుతార్, తనుష్ కోటియన్, ముఖేశ్ కుమార్, ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా, అన్షుల్ కాంబోజ్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, సర్ఫరాజ్ ఖాన్, తుషార్ దేశ్‌పాండే, హర్ష్ దూబే ఉన్నారు.




# ప్రో కబడ్డీ లీగ్ వేలం

## ముంబయిలో పాల్గొననున్న 12 ఫ్రాంచైజీలు

**న్యూఢిల్లీ:** ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌కు ముందు ఆటగాళ్ల వేలం ప్రక్రియకు సమయం దగ్గర పడుతోంది. ఈ నెల 31, జూన్ 1వ తేదీల్లో ఈ వేలాన్ని నిర్వహించేందుకు నిర్వహాకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముంబైలో నిర్వహించే ఈ వేలానికి సంబంధించి 12 ఫ్రాంచైజీలు పాల్గొంటున్నాయి. ఈ వేలానికి ముందే ప్రో కబడ్డీ లీగ్ ఎలైట్ రిటైన్డ్ ప్లేయర్లు, రిటైన్డ్ యంగ్ ప్లేయర్ల, న్యూ యంగ్ ప్లేయర్ల జాబితాను ప్రకటించింది. ఫ్రాంచైజీలు ఇప్పటికే 83 మంది ఆటగాళ్లను నిలుపుకొన్నాయి. ఇందులో ఎలైట్ రిటైండ్ ప్లేయర్స్ విభాగంలో 25 మంది, రిటైన్డ్ యంగ్ ప్లేయర్ల విభాగంలో 23 మంది, న్యూ యంగ్ ప్లేయర్స్ విభాగంలో 35 మంది ఉన్నట్లు ప్రకటించింది. మొత్తం ప్లేయర్లను 4 వర్గాలుగా విభజించారు. ఎ కేటగిరి ప్లేయర్లకు రూ.30 లక్షలు, బి లో ఉన్న వారికి రూ.20 లక్షలు, సి లోని వారికి 13 లక్షలు, డి కేటగిరిలో ఉన్న ప్లేయర్ల కనీస వేలం ధర 9 లక్షల రూపాయలుగా వర్గీకరించారు. ప్లేయర్ల కొనుగోలు నిమిత్తం ఒక్కో ఫ్రాంచైజీ 5 కోట్ల రూపాయల మేర పర్స్ కలిగి ఉంటుంది. బెంగాల్ వారియర్జ్, బెంగుళూరు బుల్స్, దబాంగ్ ఢిల్లీ కెసి, గుజరాత్ జెయింట్స్, హర్యానా స్టీలర్స్, జైపూర్ పింక్ పాంథర్స్, పాట్నా పైరేట్స్, పుణేరి పల్టన్, తమిళ తైలవులు, తెలుగు టైటాన్స్, యు ముంబా, యుపి యోధా ఫ్రాంచైజీలు ఈ వేలంలో పాల్గొంటున్నాయి. కాగా 2014 నుండి ఇప్పటి వరకూ జరిగిన 11 సీజన్లలో 8 వేర్వేరు జట్లు టైటిల్స్ గెలుపొందాయి. ఈ నేపథ్యంలో ప్రతీ జట్టూ టైటిల్ కోసం పోరాడుతునే ఉంది.

# వాణిజ్యం

# ఆర్‌బిఐ వద్ద 879.59 టన్నుల బంగారం

**న్యూఢిల్లీ, మే 17:** భారతదేశంలో పెట్టుబడి పరంగా బంగారానికి చాలా ప్రాముఖ్యత ఉంది. బంగారం వందల సంవత్సరాలుగా దాని విలువ, ప్రాముఖ్యతను నిలుపుకుంది. దీనిని ఆభరణాలుగా మాత్రమే కాకుండా పారిశ్రామిక అవసరాలకు కూడా ఉపయోగిస్తారు. భారతదేశంలోని చాలా మంది ఆర్థిక సలహాదారులు ప్రజలు తమ ఆస్తులలో కొంత బంగారం రూపంలో ఉంచుకోవాలని సలహా ఇస్తుంటారు. భారతదేశ కేంద్ర బ్యాంకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవలి సంవత్సరాలలో బంగారం కొనుగోళ్లను పెంచింది. 2021 నుండి ఇప్పటి వరకు, ఆర్‌బిఐ తన ఫారెక్స్ నిల్వలలో బంగారం వాటాను 25 పెంచింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు కూడా బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. గత 3 సంవత్సరాలలో కేంద్ర బ్యాంకులు తమ నిల్వలకు 1,000 టన్నులకు పైగా బంగారాన్ని జోడించాయి. 2024లోనే ఆర్బీఐ 57.5 టన్నుల బంగారాన్ని కొనుగోలుచేసింది. మార్చి 2025 నాటికి ఆర్‌బిఐ వద్ద మొత్తం 879.59టన్నుల బంగారం ఉంది. అందులో 511.99 టన్నులు భారత దేశంలో, మిగిలినవి ఇంగ్లాండ్, ఇతర ప్రదేశాలలో భద్రంగా ఉంది. ఆర్బీఐ డేటా ప్రకారం.. భారతదేశ విదేశీ మారక నిల్వలలో (డాలర్లలో) బంగారం వాటా మార్చి 2021లో 5.87గా ఉంది. ఇది మార్చి 2025లో 11.7కి పెరిగింది. కేవలం నాలుగు సంవత్సరాలలో బంగారు ఆస్తులలో



ఆర్బీఐ పెట్టుబడి రెట్టింపు అయింది. మే 9 నాటికి ఆర్బీఐ విదేశీ మారక నిల్వలు 690 బిలియన్లు, అందులో బంగారం విలువ 86 బిలియన్లు. దీని అర్థం భారతదేశ విదేశీ మారక నిల్వలలో దాదాపు 12.46 బంగారంలో ఉన్నాయి.


# యుఎస్‌కు భారత్ జీరో టారిఫ్ ఆఫర్: ట్రంప్

**న్యూఢిల్లీ, మే 17:** జీరో టారిఫ్‌ల విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రస్తావించారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే చాలారకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌లను ఆఫర్ చేసిందని మరోసారి పునరుద్ఘాటించారు. భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న సమయంలో ట్రంప్ నుంచి పదేపదే ఈ వ్యాఖ్యలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. భారత్‌ను లక్ష్యంగా చేసుకొని మాట్లాడారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి అని మరోమారు వ్యాఖ్యానించారు. తమ దేశం నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాల్ని 100 శాతం తగ్గించడానికి భారత్ అంగీకరించిందన్నా రు. ఇక భారత్‌తో వాణిజ్య ఒప్పందం గురించి తొందరలేదని.. తమతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు అందరూ ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ఇప్పటికే ట్రంప్ వ్యాఖ్యలపై జైశంకర్ స్పందించారు. రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అవి సంక్లిష్ట చర్చలు. ప్రతి అంశంపై నిర్ణయం తీసుకునేవరకు అవి కొనసాగుతూనే ఉంటాయి. వాణిజ్య ఒప్పందం పరస్పరం ప్రయోజనకరంగా ఉండాలి. అది జరిగే వరకు దాని గురించి ప్రకటన చేయడం తొందర పాటే అవుతుం ది అని ట్రంప్ ప్రస్తావన లేకుండా మంత్రి మాట్లాడిన విషయం తెలిసిందే.



# రాబడుల్లో పెద్ద కంపెనీలతో పతంజలి పోటీ!

**ముంబై, మే 17:** భారతీయ ఎఫ్‌ఎంసిజి కంపెనీ పతంజలి ఫుడ్స్ ఆదాయం, లాభం నిరంతరం పెరుగుతోంది. బాబా రామ్‌దేవ్ కంపెనీ ప్రపంచంలోని పెద్ద నీలీదిబి కంపెనీలతో పోటీ పడటానికి ఇదే కారణం. నాల్గవ త్రైమాసిక గణాంకాలను పరిశీలిస్తే, కంపెనీ లాభంలో 74 శాతం పెరుగుదల కనిపించింది. కాగా కంపెనీ ఆదాయం కూడా పెరిగింది. ప్రత్యేకత ఏమిటంటే కంపెనీ నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన గణాంకాలను మాత్రమే విడుదల చేయలేదు. మొత్తం ఆర్థిక సంవత్సరం డేటాను కూడా విడుదల చేసింది. దీనిలో పెరుగుదల కనిపించింది. అంతకుముందు కంపెనీ షేర్లు దాదాపు ఒకటిన్నర శాతం పెరిగాయి. పతంజలి ఫుడ్స్ నుండి త్రైమాసిక ఫలితాల్లో ఎలాంటి గణాంకాలు వచ్చాయో తెలుసుకుందాం. నాల్గవ త్రైమాసికంలో లాభం, ఆదాయంలో పెరుగుదల: గత ఆర్థిక సంవత్సరం జనవరి మార్చి త్రైమాసికంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ నికర లాభం స్వతంత్ర ప్రాతిపదికన 74 శాతం పెరిగి రూ.358.53 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం 2023-24 ఇదే త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.206.31 కోట్లుగా ఉంది. మరోవైపు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు ఒక ప్రకటనలో తన మొత్తం ఆదాయం 2023 24 ఇదే త్రైమాసికంలో రూ.8,348.02 కోట్ల నుండి రూ.9,744.73 కోట్లకు చేరుకుందని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ లాభం అపారమైన పెరుగుదల ఉంది. గణాంకాలను పరిశీలిస్తే, కంపెనీ నికర లాభం రూ.1,301.34 కోట్లకు పెరిగింది. ఇది 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.765.15 కోట్లు. ఇక కంపెనీ మొత్తం ఆదాయం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.34,289.40 కోట్లకు పెరిగింది. ఇది 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.31,961.62 కోట్లు. గురువారం స్టాక్ మార్కెట్లో పతంజలి షేర్లలో పెరుగుదల కనిపించింది. కంపెనీ స్టాక్ 1.41 శాతం లాభంతో రూ.1811.35 వద్ద ముగిసింది. అంటే ఒక్కో షేరుకు రూ.25.20. కంపెనీ షేరు రోజు గరిష్ట స్థాయి రూ.1824 కి చేరుకుంది. అయితే కంపెనీ షేరు రూ.1795.95 వద్ద ప్రారంభమైంది.



# అంబానీ, అదానీలకు కలిసొచ్చిన కాల్పుల విరమణ

**ముంబై, మే 17:** భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ తర్వాత, ఆసియాలోని ఇద్దరు ధనవంతులైన వ్యాపారవేత్తలు ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీల అదృష్టం మారిపోయినట్లు కనిపిస్తోంది. ప్రత్యేకత ఏమిటంటే ముఖేష్ అంబానీ రూ.100 బిలియన్లు లేదా అంతకంటే ఎక్కువ సంపద కలిగిన బిలియనీర్ల గుంపులో చేరారు. మరోవైపు ప్రపంచంలోని టాప్ 20 ధనవంతుల జాబితాలో గౌతమ్ అదానీ చోటు దక్కించుకున్నారు. బ్లూమ్‌బెర్గ్ డేటాను పరిశీలిస్తే, ఆసియాలోని అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ నికర విలువ 5 రోజుల్లో 6 బిలియన్ డాలర్లు పెరిగింది. ఆసియాలో రెండవ అత్యంత ధనవంతుడైన వ్యాపారవేత్త గౌతమ్ అదానీ నికర విలువ 9.2 బిలియన్లు పెరిగింది. ఇప్పుడు ఇద్దరు బిలియనీర్ల నికర విలువ ఎంత ఉందో తెలుసుకుందాం. నివేదిక ప్రకారం, ముఖేష్ అంబానీ మొత్తం నికర విలువ మే 9న 99 బిలియన్లు కాగా, మే 16న అది 105 బిలియన్లకు పెరిగింది. అంటే 5 పని దినాలలో ముఖేష్ అంబానీ నికర విలువ 6 బిలియన్లకు పైగా అంటే రూ.51 వేల కోట్లకు పైగా పెరిగింది. ముఖేష్ అంబానీ 100 బిలియన్ డాలర్ల నికర విలువ కలిగిన ఎలైట్ గ్రూపులో చేరారు. కాల్పుల విరమణ తర్వాత, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో మంచి పెరుగుదల కనిపించింది. ఆ తర్వాత అతని నికర విలువలో పెరుగుదల ఉంది. మరోవైపు గౌతమ్ అదానీ నికర విలువ కూడా బాగా పెరిగింది. ప్రత్యేకత ఏమిటంటే, ఐదు పని దినాలలో అదానీ నికర విలువ అంబానీ కంటే ఎక్కువ పెరిగింది. నివేదిక ప్రకారం, గౌతమ్‌అదానీ నికర విలువ మే 9న 74.4బిలియన్లు కాగా, మే 16న అది 83.6 బిలియన్లకు పెరిగింది. అంటే గౌతమ్ అదానీనికరవిలువ 9.2 బిలియన్లు అంటే దాదాపు రూ.79 వేల కోట్లు పెరిగింది. అతను ప్రపంచంలోని టాప్20 బిలియనీర్ల జాబితాలోచేరాడు. అతను ఇదేవేగంతో కదులుతూ ఉంటే, అతను 100బిలియన్లకు దగ్గరగా చేరుకోవచ్చు.




# తగ్గనున్న రెపో రేట్లు..!

**న్యూఢిల్లీ, మే 17:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి రెపో రేటులో పెద్ద కోతను పరిశీలిస్తోంది. ఈ సంవత్సరం జూన్ నుండి దీపావళి వరకు రిజర్వ్ బ్యాంక్ మూడు ద్రవ్య విధాన కమిటీ సమావేశాలు జరగనున్నాయి, ఈ తరుణంలో రెపో రేటును తగ్గించవచ్చు. ఈ కోత 0.50 నుండి 0.75 శాతం వరకు ఉండవచ్చని నివేదికలలో పేర్కొన్నాయి. రెపో రేటులో ఇంత తగ్గింపు ఉంటే సామాన్యులకు పెద్ద రిలీఫ్ లభిస్తుంది. మీడియా నివేదికల ప్రకారం ఆర్‌బిఐ ద్రవ్యవిధాన కమిటీ వచ్చే సమావేశం జూన్ 46 వరకు జరగనుంది, ఈ సమావేశంలో సామాన్యులకు ఉపశమనం కలిగించడానికి పెద్ద నిర్ణయాలు తీసుకోవచ్చు అలాగే రెపో రేటును దాదాపు 0.25 తగ్గించవచ్చు. దీని తరువాత ఆగస్టు 5 నుండి 7 వరకు లేదా సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 1 వరకు జరిగే సమావేశంలో 0.25 శాతం నుండి 0.50 శాతం వరకు కోత ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం ప్రకారం ఫిబ్రవరి నుండి ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించడం ప్రారంభించింది. అప్పటి నుండి రెండు సమావేశాలలో 0.50 కోత వచ్చింది. ఈకారణంగా రెపో రేటు 6కి తగ్గింది. ఈసారి దీపావళికి ముందు సామాన్యులకు పెద్ద ఉపశమనం లభిస్తుందని, ఆర్‌బిఐ రెపో రేటు 0.75 వరకు తగ్గించవచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం రెపో రేటు 6 వద్ద ఉంది. దీపావళి నాటికి ఇది 5.25కి తగ్గవచ్చు. సింపుల్‌గా అర్థం చేసుకోవాలంటే రెపోరేటు అంటే ఆర్‌బిఐబ్యాంకులకు రుణాలిచ్చే వడ్డీరేటు, తరువాత బ్యాంకులు కొంత వడ్డీని కలపడం ద్వారా కస్టమర్లకు లైన్స్ ఇస్తాయి. ఇలాంటి పరిస్థితిలో రెపో రేటు తగ్గితే మీ లోన్ కూడా తగ్గుతుంది ఇంకా మీ హోమ్‌లోన్ అండ్ కారు లోన్ చౌకగా మారుతుంది. ఆర్‌బిఐ సెక్యూరిటీస్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ సన్నీ అగర్వాల్ ప్రకారం, అన్ని అంశాలు రేటు తగ్గింపు వైపు చూపిస్తున్నాయి. ఇంకా పరిస్థితులు కూడా సాధారణంగానే ఉంటాయని భావిస్తున్నారు.

# అజియో, మింత్రాలో తుర్కియే బ్రాండ్ బంద్

**ఇస్లామాబాద్, మే 17:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించిన తుర్కియే దేశంపై భారత్‌లోని అన్ని వర్గాలు మండిపడుతున్నాయి. ఆ దేశానికి చెందిన ఉత్పత్తులను బహిష్కరించాలని 'బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆన్‌లైన్ రిటైల్ సంస్థలు మింత్రా, అజియో టర్కీ బ్రాండ్ల అమ్మకాలను నిలిపివేశాయి. ఆయా ప్లాట్‌ఫామ్‌లలో టర్కీకి చెందిన దుస్తులను చూపించడం ఆపేశాయి. బాయ్‌కాట్ తుర్కియే నినాదం జోరందుకున్న క్రమంలో వ్యాపారులు ఆ దేశంతో వర్తక, వ్యాపారాలను నిలిపేస్తున్నారు. టర్కీకి చెందిన అన్ని బ్రాండ్‌ల అమ్మకాలను మింత్రా తాత్కాలికంగా నిలిపివేసింది. గతవారం నుంచి ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత అధికారి వెల్లడించారు. రిలయన్స్ కూడా తన ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ అజియోలో విక్రయిస్తున్న కోటాన్, ఎలేసీ వైకికి, మావి వంటి టర్కిష్ దుస్తుల బ్రాండ్ల అమ్మకాల్ని ఆపేసింది. ఆ దేశంలో సంస్థ కార్యాలయాన్ని కూడా మూసివేసినట్లు రిలయన్స్‌కు చెందిన ఓఅధికారి పేర్కొన్నారు. తుర్కియేతో తెంచేసుకుందాం. పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన తురిక్గయే, అజర్‌బైజాన్ దేశాలతో పర్యాటకం సహా అన్ని రకాల వ్యాపార సంబంధాలు తెంచుకోవాలని దేశీయ వర్గాలు ఇప్పటికే నిర్ణయించాయి. అఖిలభారత వ్యాపారుల సమాఖ్య (కెయిట్) సైతం ఆరెండు దేశాలతో వాణిజ్యసంబంధాలను తెంచుకోవాలని నిర్ణయించింది. భారత




ఎగుమతిదార్లు, దిగుమతిదార్లు, వ్యాపార వర్గాలు సైతం ఆరెండు దేశాల్లోని కంపెనీలతో ఎటు వంటి సంబంధాలూ పెట్టుకోరని తెలిపింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.